RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 22 Issue No. 04 Monthly April 2025 ISSN No. 2456-4702 Rs. : 15/-



## శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఏప్రియల్ - 2025** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

*Founder :*
Kolla Sri Krishnarao (Late)

*E-mail :*
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 22 - Issue. 04 - April 2025 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

## ADVISORY COMMITTEE

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy & Religion Studies,
Andhra University, Visakhapatnam, A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

## ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, #135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, GUNTUR - 522 034. Andhra Pradesh. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com. Printed at : GLS Enterprises, Guntur - 2. Ph. 94 94 660 509.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి

(జననం : 23 ఏప్రిల్ 1891 - 25 ఫిబ్రవరి 1961)

తెలుగు కథ సాహిత్యంలో విశిష్టంగా చెప్పుకోదగ్గ తెలుగు సాహితీ వేత్త లలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అగ్రగన్యుడు. భాషలో, భావములో, తెలుగు నుడికారం ప్రయోగించడంలో ఇతడు పేద పేరెన్నిక గల సాహితీవేత్త. శ్రీపాద వారి సాహిత్యం ఒక ఒక సంధి యుగములో గడిచింది. ఒక పక్క పాత సంప్రదాయాలు వెనక్కి లాగుతూ ఉండగా పాశ్చాత్య నాగరికత మరోపక్క ఆకర్షిస్తూ ఉండగా ఆ పాత కొత్తల కలయికని తన రచనలు ప్రతిభావంతంగా చిత్రించాడు.

శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి 1891 ఏప్రిల్ 23 వ తారీఖున తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పాలమూరు గ్రామంలో జన్మించారు. తల్లి మహాలక్ష్మి సోతమ్మ తండ్రి లక్ష్మీపతి సోమయాజులు. మీరు గొప్ప వేద పండితుడు జ్యోతిష్యం, ధర్మశాస్త్రాలలోదిట్ట.. ఇతను గాంధీ ఖద్దరు హిందీ ఈ మూడింటిని వ్యతిరేకించాడు. చేప సువర్ణ శాస్త్రి 1961 ఫిబ్రవరి 25 తారీకు తన69వ ఏట రాజమహేంద్ర వరంలో మరణించాడు. వీరి కుటుంబం సనాతన సాంప్రదాయాలను, తరతరాలుగా అధ్యయం చేసే పండితుల కుటుంబం. అలాంటి కుటుంబంలో పుట్టి సంస్కృతానికి స్వస్తి చెప్పి,తెలుగులో చిన్న కథలను రాయటం ప్రవృత్తిక ఎంచుకొని ఆ చిన్నకథకు కావ్య ప్రతి పత్తి కలిగించిన సాహితీ శిల్పి సుబ్రమణ్య శాస్త్రి.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వివిధ తెలుగు సాహితీ ప్రక్రియలకు విశిష్ట సేవలు అందించారు. వీరు దాదాపు 75 కథలు రాశాడు. ఇది కదా ఇతివృత్తాల ఆధారంగా అతని కథలను ప్రణయ కథలు, సంఘసంస్కారం, ప్రబోధం, కుటుంబ జీవితం, అపరాధ పరిశోధనం, భాష వివాదాత్మకం, చారిత్రకం అనే విషయాలుగా విభజించవచ్చు. ఏ కాక వీరు అనేక పద్య రచనలు, నవలలు, నాటకాలు, అనువాదాలు, వైద్య గ్రంథాలు కూడా రాశాడు. శాస్త్రి తన ఆత్మకథ "అనుభవాలు : జ్ఞాపకాలలు" అనే పేరుతో 8 సంపుతాలుగా ప్రచురించారు. వాటిలో కొన్ని ఆత్మబలి, రక్షాబంధనం, రాజారాజు, కలం పోటు, వీర పూజ, మహా భక్త విజయం, ఆయుర్వేద యోగ ము, వైద్యక పరిభాష వగైరా. కానీ ఆ ఎనిమిదిటిలో మూడు సంపుటలు ప్రచురించిన తర్వాత వారు మరణించడంతో అవి అవి అక్కడితో నిలిచిపోయాయి. వీరి సచ్చినోళ్ళు ఆంధ్రప్రదేశ్ పాఠశాల కళాశాల పాఠ్యాంశాలుగా కూడా ముద్రించబడ్డాయి. మీరు దాదాపు తొమ్మిదేళ్లపాటు బుద్ధాంధ్ర పత్రిక నిర్వచించారు. వీరు అనేక శతాధిక వ్యాసాలు రాశాడు. ఆయన అనేక అష్టావధానాలు చేశారు. 1956లో కనకాభిషేకం అందుకున్న గొప్ప సాహితీ వేత్త. వీరి మొదటి కథ "ఇరువుర ఒక్కచోటకే పోదాం"ఇది 1915లో ప్రచురితమైంది. 'మిథునాను రాగము' వీరి మొదటి నవల 1923 ప్రచురితమైంది.

సుబ్రహ్మణ్య శాస్త్రి వ్యక్తిగతం గురించి తన స్వేచ్ఛలో చాలా వివరంగా రాసుకున్నారు. మీరు చిన్నతనం నుండి బాగా అల్లరి చిల్లరగా పొలాల వెంబడి తన బాల్య స్నేహితులతో ఎంతో ఆనందంగాగడిపాడు. చాలాకాలం చేసుకుంటూ విద్యాభ్యాసం కొనసాగించారు చిన్న వయసులోనే అత్త కూతురు సీతతో వివాహం జరిగింది. కానీ వీరికి సంతానం కలగలేదు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి తెలుగు సాహిత్యాన్ని చేసిన సేవలు వెలకట్టలేనివి. వీరు ఎందరో సాహిత్య వేత్తల హృదయాలు చిరస్థాయిగా నిలిచిపోయారు.

వీరికి తెలుగు భాష పైన తెలుగు నేల పైన మొక్క ఎక్కువా...

"తెనుగు దేశమే దేశం తెనుగు భాషే భాష....
తెనుగు మనుష్యులే మనుష్యులు...
తెనుగు వేషమే వేషం...
జాతి యెదతా ఏ సంద్భంలోనూ ఎందుకునూ నా తెనుగుజజాతి తీసిపోదు"...

అని ఒక్కాడించిన గొప్ప తెలుగు సాహితీ అభిమాని శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి తెలుగు హృదయాలలో సదా చరిస్మరణీయుడు.

- చీఫ్ ఎడిటర్

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీశ్రీ "మహా ప్రస్థానం" - నవ్యత | - డా॥. టి. విమల | 8 |
| 2. | నవ్య ప్రబంధము - "సీతమ్మ" : సమాలోచన | - డా॥. జి. శ్రీనివాసరావు | 14 |
| 3. | ఆధునిక భారతీయ లిపులు - పరిచయం | - డా॥. యం. మాదన్న | 20 |
| 4. | ప్రసార మాధ్యమాలలో జానపద సాహిత్యం | - వంజరి రాజేశ్వరి | 24 |
| 5. | కందుకూరి 'రాజశేఖర చరిత్ర' నవల విశ్లేషణ | - గంధం రోజమ్మ | 28 |
| 6. | కోమలాదేవి నవలలు - సమాజ స్థితిగతులకు దర్పణాలు | - పి. నాగశృతి | 33 |
| 7. | పిల్లల సామాజిక స్పృహ హేతువులు - పొడుపు కథలు | - చిలకల బాలరాజు | 37 |
| 8. | మాలతీ చందూర్ నవలా సాహిత్యంలో విజిలెన్స్ హోమ్ జీవిత చిత్రణ | - ఎద్దు స్రవంతి<br>- ఆచార్య కిన్నెర శ్రీదేవి | 40 |
| 9. | సి.నా.రె కవిత - మానవత | - సిరిపురం వాణిశ్రీ | 51 |
| 10. | Cultural Resistance and Resilience : Exploring the Empowerment of Dalit Women in Literature | - Chettupalli Anvesh | 55 |
| 11. | The Architecture of Thirunallûr Kalyânasundharçswarar Attic (Mâda) Templein Thiruvarur District, Tamil Nadu | - P. Praveen Kumar<br>- Dr. V. Vivekanandam | 62 |

# శ్రీశ్రీ "మహా ప్రస్థానం" - నవ్యత

- డా॥. టి. విమల, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి), తెలుగు విభాగము, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

"నేను సైతం / ప్రపంచాగ్నికి / సమిధనొక్కటి ఆహుతి చ్చాను!
నేను సైతం / విశ్వవృష్టికి / అశ్రువొక్కటి ధారపోశాను!
నైను సైతం / భువన ఘోషకు / వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!"

- (జయభేరి)

అని నినదించిన కవి శ్రీశ్రీ "జగమెరిగిన బ్రాహ్మణునికి జందెమేల"? అని నానుడి. అలా శ్రీశ్రీ - ఈ పేరుకు పరిచయం అవసరం లేదు. శ్రీరంగం శ్రీనివాసరావు (30, ఏప్రియల్ 1910 - 15, జూన్ 1983) గారు విశాఖ పట్టణంలో అప్పన్నకొండ, వెంకట రమణయ్యలకు జన్మించాడు. శ్రీశ్రీ కవితా సాధన దశలోనే పద్యనాటకం, తరువాత నవలలు రచించారు. 18వ యేట 'ప్రభవ' కావ్య సంపుటిని ప్రచురించారు. ఈ రచనలన్నీ గ్రాంథిక శైలిలో, సాంప్రదాయ పద్ధతిలో రాశారు. తరువాత గ్రాంథికశైలి, ఛందస్సు ప్రక్కన పెట్టి వాడుక భాషలో మాత్రా ఛందస్సులో రచనలు చేశారు.

దేశ దేశాల కవుల రచనలు చదవడం వల్ల శ్రీశ్రీ ఆలోచనా విధానం మారింది. 1930-40 'ఆకలి దశకం'గా పేర్కొనబడిన, పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారిన కాలంలో 'మహాప్రస్థానం' రచించారు. పత్రికలలో వెలువడిన శ్రీశ్రీ కవితల వల్ల నాటి యువ తరం బాగా ప్రభావితం అయింది. 1950లో 'మహా ప్రస్థానం' ముద్రణ అయింది.

గురజాడతో మొదలైన కవితా విప్లవాన్ని శ్రీశ్రీ ముందంజ వేయించారు. "గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను". (మహా ప్రస్థానం - పేజీ నెం. 4) అన్నారు శ్రీశ్రీ. 'ప్రభవ' నాటికి శ్రీరంగం శ్రీనివాసరావుగా పిలవబడిన వీరు 'సుప్తాస్థికలు' రచించే నాటికి 'శ్రీశ్రీ' పేరుతో ప్రసిద్ధు లయ్యారు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే, తరువాత తెలుగు కవిత్వాన్ని తాను నడిపించా నని శ్రీశ్రీ చెప్పుకున్నారు. "ఈ శతాబ్దం నాదే" అని కూడా శ్రీశ్రీ గర్వంగా చెప్పారు.

1950లో 'మహాప్రస్థానం' కవితా సంపుటి చలం 'యోగ్యతాపత్రం'తో వెలువడింది. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, ఊహించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి ఈ 'మహాప్రస్థానం' అని చలం కొనియాడారు. "నెత్తురు, కన్నీళ్ళు, కలిపి కొత్త టానిక్ తయారు చేశాడు. శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి" అన్నారు చలం.

క్రొత్త ప్రయోగాలపై మనసుపడి 'సర్రియలిజమ్' వంటి కవితా రూపాలను తెలుగులో ప్రవేశపెట్టారు. "ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను 'సామాజిక వాస్తవికత' అంటారని, దీని వెనుక దన్నుగా 'మార్క్సిజం' అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కి తిరిగి చూసు కుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహ యాధృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుసోతంది" అంటారు శ్రీశ్రీ.

విశ్వవిఖ్యాత రచయితల రచనలకు అనువాదం కూడా శ్రీశ్రీ. కథలు, నాటకాలు, వ్యాసాలు, లిమరిక్కులు మొదలైన పెక్కు సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. చరమరాత్రి, చతురస్రం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, గురజాడ, మరో ప్రస్థానం, వారం వారం, శ్రీశ్రీ వ్యాసాలు, పాడవోయి భారతీయుడా, అనంతం (స్వీయ చరిత్ర) శ్రీశ్రీ ఇతర రచనలు. శ్రీశ్రీ తన పదాలతో ఉద్యమాలకు ఊపరిపోశాడు. నిర్భయంగా, నిర్ద్వందంగా అభిప్రాయాలు వెలిబుచ్చడం శ్రీశ్రీ తత్వం. శ్రీశ్రీ గొంతుకకు లోకానికి చాటిన ప్రథమ గీతం 'నేను సైతం'.

## శ్రీశ్రీ కవిత్వంలో నవ్యత - మహా ప్రస్థానం :

'నవత' ప్రతిభకు పర్యాయపదం. శ్రీశ్రీ అసామాన్య ప్రతిభావంతుడు. మూర్తీభవించిన 'నవ్యత' లేకుండా

కలం కదిలించలేడు. 'మహా[ప్రస్థానం' తెలుగు సాహిత్యంలో ఒక పెద్ద మలుపు. ఆధునిక కవులు చాలామంది భావ కవిత్వం, ఊహా కవిత్వం, సాంప్రదాయవాదం వైపు ఉన్నప్పుడు, ఆధునితవైపు, వాస్తవికత వైపు మరలడం ఒక విశేషం. నాటికాలపు కవులందరి కంటే భిన్నంగా ఆలోచించిన కవి శ్రీశ్రీ.

"కదిలేదీ, కదిలించేది! మారేది, మార్పించేదీ!
పాడేదీ, పాడించేది! మునుముందుకు సాగించేదీ!
పెనునిద్దుర వదిలించేది! పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ!
కావాలోయ్ నవకవనానికి"

('నవకవిత' - మహా ప్రస్థానం - పేజీ 72)

అంటాడు శ్రీశ్రీ.

'మహా ప్రస్థానం'లో ఏ సిద్ధాంతాలు, ఏ ఆదర్శాలు, ఏ భావాలు వ్యక్తం అయ్యాయి అనే విషయంలో విమర్శకులలో ఎన్ని భేదాభిప్రాయాలున్నా, ఈ కవతా సంపుటి తెలుగు కవిత్వాన్ని ఒక తిరుగులేని మలుపు తిప్పింది అనేది మాత్రం అందరూ అంగీకరించిన విషయం.

"అందమైన అబద్ధాలలో కన్న, నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనమవుతుందని విశ్వసించాను. దీనితో మహాప్రస్థాన గీతాలలో సామాజిక, వాస్తవికతు దర్పణం పట్టడం జరిగింది" అన్నారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవిత్వ వ్యక్తిత్వంలో ఇతర అంశాలన్నింటికంటే ప్రాధాన్యత వహించే అంశం ఆయ నవ్యతాప్రియత్వం. ప్రతి కవితలోనూ ఒక నవ్య ప్రయోగం కోసం తపన పడతాడు శ్రీశ్రీ "మహా ప్రస్థానం"లో భావ కవిత్వం ధోరణి గల కవితల్లోనూ, అభ్యుదయ ధోరణి గల కవితల్లోను, మిగతా కవితల్లోను సమానంగా కనబడే లక్షణం 'మిస మిసలాడే నవ్యత'. అటు వస్తువులోనూ, ఇటు రూపం లోనూ, అటు భావంలోనూ, భాషలోను, ఇటు ధోరణి లోనూ కూడా ఈ 'నవ్యత' మహా ప్రస్థానం కవితల్లో కనబడుతుంది.

**భాష :**

'మహా ప్రస్థానం' కవితా సంపుటిలో దాదాపు 40 కవితలున్నాయి. వీటిలో ప్రధానమైన సంచలనం భాష సమాజంలోని లోపాల గురించి తీవ్రంగా నిరసిస్తూ, అందుకు అవసరమైన భాష ప్రయోగిస్తూ, కొన్నిచోట్ల వ్యవహారిక భాష, కొన్ని చోట్ల నిత్యనూతన పదాలు ప్రయోగిస్తూ, ఛందస్సు శృంఖలాలు తెంచి, కవిత్వానిన ధారగా వెలువరించారు శ్రీశ్రీ. రాసిన ప్రతి కవితలోని అంశంలో, రచనా ధోరణిలో, భావ వ్యక్తీకరణలో, భాషలోఓ నవ్యత పాటించి, కవిత్వానికి నిత్యనూతనత్వాన్ని అందించారు శ్రీశ్రీ. శ్రీశ్రీ ప్రయోగించిన వ్యవహారిక భాష వల్ల తెలుగు కవిత్వంలో ఈ భాషా ప్రయోగం విరివిగా జరగడం మొదలైంది.

**నూతన పదాలు :**

పరిక్షమిస్తూ, బలివితరి, అస్త్రనైవేద్యం, అనలవేదిక, అగ్ని కిరీటం మొదలగునవి.

**వ్యవహారిక భాషా పదాలు :**

మూలనక్కి మూలగడం, ఆవులించడం, గెంతడం, పాడుకల, పేగుకదలడం, సన్న సందులు, ఎంగిలాకు, బొమికలు, తిట్లు, పాట్లు మొదలగునవి.

ప్రాసకు, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. 'వ్యక్తికి బహు వచనం శక్తి' అనేది అతను సృజించిన మహత్తర వాక్యమే. శబ్ద ప్రయోగంలో కూడా నవ్యతను చూపించాడు.

**ఉదా :**

"భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని / వైష్ణవ గీతాన్ని నేను!
స్మరిస్తే పద్యం, / అరిస్తే వాద్యం,
అనలవేదికముందు అస్త్రనైవేద్యం"

('ఐ' - మహా ప్రస్థానం, పేజీ నెం. 35)

"మనమంతా బానిసలం / గానుగలం, పీనుగులం,
వెనుకదగా, ముందుదగా! కుడియెడమల దగా, దగా"!

('చేదుపాట' - మహా ప్రస్థానం, పేజి నెం. 63)

**వస్తువు :**

వస్తువులో భావకవులు ప్రకృతికి, పల్లెటూరికి పరిమితమైపోవడం, తాము ఉదాత్తమైనవి అనుకున్న

వస్తువులకే పరిమితమైపోవడం శ్రీశ్రీకి నచ్చలేదు. 'బుక్కులు' అనే కవితలో ఆయన దీని గురించే తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా -
హీనంగా చూడకు దేన్నీ! /
కవితామయమేనోయ్ అన్నీ"!
('బుక్కులు' - మహా ప్రస్థానం - పేజీ నెం. 29)

ఇలా భావకవులు అందమైన జంతువులు, పక్షులు మాత్రమే తమ కవితా వస్తువుగా స్వీకరిస్తారని 'కుక్కపిల్ల' లాంటి వాటిని ఎందుకు గ్రహించరు? 'అగ్గిపుల్ల' 'సబ్బుబిళ్ళ' గురించి ఎందుకు పట్టించుకోరు? అన్న శ్రీశ్రీ వ్యాఖ్యానం ఈ కవితలో మనకు కనబడుతుంది. అంద చందాలు, ఉదాత్త అనుదాత్తతలు వస్తువులో లేవని, దృష్టి లోనే ఉన్నాయని శ్రీశ్రీ ప్రబోధం అందుకే,

"ఉండాలోయ్ కవితావేశం ! కానీవోయ్ రసనిర్దేశం!
దొరకదటోయ్ శోభాలేశం!"

వంటి భావ వ్యక్తీకరణ ద్వారా ప్రపంచంలో అన్ని వస్తువులు కవితా వస్తువులు కాదగినవే అని అంటాడు శ్రీశ్రీ. కవి తాను సృష్టించుకున్న ప్రపంచంలో ఉండి పోతాడని, ఆ ప్రపంచాన్ని 'పద్యవ్యూహం' అని, 'కవిత్వం ఒక తీరని దాహం' అని అన్నాడు శ్రీశ్రీ.

## దేశీయత లేదా జాతీయత :

భావ కవులు వ్యక్తం చేయకపోయినా, తమకు తాము విధించుకున్న మరొక సరిహద్దు దేశీయత లేదా జాతీయత. ఈ దేశానికి బయటి వస్తువులు భావకవిత్వంలో కవితా వస్తువులుగా గాని, ఉపమానాలుగా వాడే కవితా సామాగ్రిగా గానీ, కాలేకపోయాయి. శ్రీశ్రీ ఇలాంటి హద్దు లను ఛేదించుకుంటూ, నయాగరా జలపాతాలను, టర్కీలో టోర్నడోలను, లోహశ్యేనాలను, ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న అన్ని వస్తువులనూ తన కవిత్వంలోకి తెచ్చేశాడు.

"చీనాలో రిక్షావాలా! చెక్ దేశపు గని పనిమనిషి!
ఐర్లాండున ఓడ కళాసీ"
('దేశ చరిత్రలు' - మహా ప్రస్థానం, పేజీ నెం. 75)

ఇలా ప్రపంచంలోని ఎక్కడెక్కడో ఉన్న విషయాలు శ్రీశ్రీ కవితా నేత్రం ముందు అలవోకగా మెదులుతూ ఉంటాయి.

## భావ కవిత్వం - వస్తువులు - విలువలు - నవ్యత:

భావ కవులు ప్రకృతి వర్ణనలు చేస్తూ, ప్రకృతిలోని వస్తువులకు కూడా కొన్ని స్థిరమైన విలువలను ఆపాదించారు. ఉదాహరణకు 'పున్నమి వెన్నెల'. ఇది విరహం కలిగిస్తుంది. ఆహ్లాదం కూడా అందిస్తుంది. శ్రీశ్రీ 'బహుళ పంచమి' వెన్నెల ఎన్నుకుంటాడు.

"విశ్వమంతా నిండి, వెలిబూదివోలె
బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టునన్ను!"
('ఒక రాత్రి' - మహా ప్రస్థానం, పేజీ నెం. 24)

అని అంటాడు. నిజానికి కవిత్వాన్ని రాజ ప్రసాదాల నుండి పల్లెసీమలకు, పచ్చని పొలాలకు మళ్ళించిన భావ కవులే సామాన్యుడికి పట్టం కట్టి, రైతును ఆరాధ్యదైవంగా చేశారు. కాని శ్రీశ్రీ సామాన్యులలో ఒక్క రైతు కూలీలను మాత్రమే కాక, పట్టణపు కూలీలను, ఫ్యాక్టరీ కార్మికులను దర్శించి తన కవిత్వంలోకి తీసుకొని వచ్చాడు.

"కూటికోసం, కూలికోసం / పట్టణంలో బ్రతుకు దామని!" ఒక బాటసారి బయలుదేరాడు. 'మహా ప్రస్థానం'లో పల్లెకూలీ, పట్టణంలో కూలీ అయ్యేందుకు బయలుదేరాడు. అలాగే ఈ కావ్యంలోని కార్మికుడు "యంత్ర భూతముల కోరలు తోమే కార్మికుడు"! ఈ మహా ప్రస్థానంలో సమ్మె కట్టిన కూలీల భార్యల, బిడ్డల ఆకలి కేకలు అడుగడుగునా కనబడతాయి.

అలాగే 'భిక్షువర్షీయసి' కవితలో 'బిచ్చగత్తె' కవితా వస్తువు. భావ కవులు ఒకవేళ ఈమెను కవితా వస్తువుగా గ్రహించినా ఎముకముక్క కొరికే కుక్క, ఈగను నోటిలో పడవేసుకుని పోయే తొండ, గాలికి ఎగిరి వచ్చే ఎంగిలాకు లాంటి వస్తువులు వీరి కవిత్వంలో కనబడవు. శ్రీశ్రీ వాస్తవికతకు అద్దం పట్టిన కవిత ఇది.

"ముగ్గుబుట్ట వంటి తలా / ముడుతలు తేలిన దేహం
కాంతిలేని గాజు కళ్ళు / తనకన్నా శవం నయం"
"ఎముక ముక్క కొరుక్కొంటూ / ఏమీ అనలేదు
కుక్క!

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

ఒక ఈగను పడవేసుకు / తొందరగా తొలగె తొండ!"
('భిక్షువర్షీయసి' - మహా ప్రస్థానం, పేజీ నెం. 43)

పల్లెల్లోని సౌందర్యమే తప్ప, రాక్సీ, బ్రాడ్‌వే లాంటి సినిమా థియేటర్లు, ఉడిపి హెూటళ్ళు, ఆసుపత్రిలోని శస్త్ర చికిత్స గదులూ లాంటివి భావ కవిత్వంలో కనిపించే అవకాశమేలేదు 'సంధ్యా సమస్యలు' కవితలో ఈ విషయాలు శ్రీశ్రీ ప్రస్తావిస్తారు.

"ఆ సాయంత్రం...
రాక్సీలో నార్మా షేరర్ / బ్రాడ్వేలో కాంచనమాల!
ఎటకేగుటో సమస్య తగిలిం / దొక విద్యార్థికి!"
('సంధ్యా సమస్యలు' - మహా ప్రస్థానం, పేజి నెం. 82)

## ప్రణయ కవిత్వం :

చివరికి భావ కవులకు అత్యంత ప్రతీపాత్రమైన 'ప్రణయ కవిత్వం' తీసుకున్నప్పుడు కూడా శ్రీశ్రీ ఆ భావ కవులు స్పృశించని విచిత్రమైన ప్రణయ కవిత్వాన్ని తన 'అద్వైతం' కవితలో వ్యక్తం చేశాడు.

"ఆనందం అర్ణవమైతే / అనురాగం అంబరమైతే
అనురాగపుటంచులు చూస్తాం / ఆనందపు లోతులు తీస్తాం"
('అద్వైతం' - మహా ప్రస్థానం, పేజీ నెం. 51)

ఒక ప్రియుడు తన ప్రేమకు ప్రతిస్పందించి వెళ్ళిపోయి, హాయిగా జీవిస్తున్న తన ప్రేయసిని తలుచుకొని ఒకరినొకరు కలుసుకోకుండా, భిన్న భావాలతో ఇద్దరు అనురాగపు అంచులను చూస్తున్నాం అంటాడు.

ఇలా వస్తువులోనూ, వస్తువు పట్ల దృష్టిలోనూ, భావంలోనూ, ఆలోచనలోనూ, ధోరణిలోనూ, తనలో మెదిలిన నవ్యత, తన అభివ్యక్తి విధానాన్నే మార్చివేసిందని శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!' గేయం! అంటాడు. ఏదో ఒక క్రొత్తదనం కోసం తపనపడితే, ఆ తపస్సులోనుంచి క్రొత్త భావాలు, క్రొత్త వస్తువులు, దృశ్యాలు తోచాయని అంటాడు.

"నావిన్నవి కన్నవి విన్నవించగా / మాటలకై వెదుకాడగబోతే
అవి,
పుంఖానుపుంఖాలుగా / శ్మశానాలవంటి నిఘంటువుల దాటి,
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి, / ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి
వడిగా, వడి వడిగా / వెలువడినై, పరుగిడినై, నా యెదనడుగిడినై!"
('కవితా! ఓ కవితా!' - మహా ప్రస్థానం, పేజి నెం. 68)

## అభివ్యక్తిలో నవ్యత :

పైన చెప్పినట్లుగానే శ్రీశ్రీ తన నవ్య భావాలకు అనుగుణంగా, క్రొత్త అభివ్యక్తి మార్గాలను ఎన్నుకొన్నాడు. ఎక్కువగా గేయాలు, అక్కడక్కడ వచన కవితలు ఉపయోగించాడు. 'గురజాడ' వారు ప్రవేశపెట్టిన 'ముత్యాల సరాలు' ఛందస్సుకి నాల్గవ పంక్తిలో 2 మాత్రలు అధికంగా ప్రయోగించి క్రొత్తదనం కూర్చాడు.

'అవతారం' 'జయభేరి' కవితలలో ఈ నడకను మనం గమనించవచ్చు.

"యముని మహిషపు లోహ గంటలు
మబ్బు చాటున
ఖణేల్ మన్నాయి".
('అవతారం', పేజి నెం. 30)

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను"
('జయభేరి', పేజి నెం. 22)

## ప్రతీకాత్మక శిల్పం (సింబాలిజమ్) :

"భావ ప్రకటనకు, వాతావరణ కల్పనకు తోడ్పడే శబ్దాలే ప్రతీకలు" - అని పాశ్చత్య కవి మలార్మే అంటాడు. ఎడ్గార్ ఎల్లెన్‌పో, బాడ్లెయిర్, మలార్మే వంటి పాశ్చాత్య వాద ప్రతీకవాద కవులచే ప్రభావితుడై, శ్రీశ్రీ భావ చిత్రాల పరపంర ద్వారా ప్రతీకాత్మకంగా భావాన్ని అందించే పద్ధతిని 'మహా ప్రస్థానం' ద్వారా విజయవంతంగా ప్రవేశపెట్టాడు.

"సింధూరం, రక్త చందనం / బంధూకం, సంధ్యా రాగం !
పులిచంపిన లేడినెత్తురూ / ఎగరేసిన ఎర్రని జెండా!
రుద్రాలిక నయన జ్వాలిక / కలకత్తా, కాళిక నాలిక !
కావాలోయ్ నవకవనానికి'
('నవకవిత' - మహా ప్రస్థానం, పేజి నెం. 71)
అంటాడు శ్రీశ్రీ.

ఇదే సింబాలిజమ్

"నేనొక్కణ్ణే / నిల్చిపోతే
చంద్రగాడ్పులు, వాన మబ్బులు, మంచుసోనలు
భూమి మీదా / భుగ్నమౌతాయి"

ఇక్కడ 'నేను' అంటే - కార్మికుడు - అతడు పని చేయడం అపేస్తే సుఖంగా బ్రతికే అందరూ కష్టపడతారు అంటాడు.

**పురాణ ప్రతీకలు :**

"నేను సైతం / ప్రపంచాగ్నికి, సమిధనొక్కటి ఆహుతిచ్చాను"
('జయభేరి')

హోమాగ్ని, సమిధ - ఇక్కడ ప్రతీకలు. అలాగే ధనుంజయుడు, త్రేతాగ్ని, హోమజ్వాల వంటివి కూడా అదేవిధంగా పద్యవ్యూహం, పరమేష్టిజూకాలు, బలివితర్ది, వైతరణీనది వంటి ప్రతీకలు సామాజిక స్పృహతో ప్రయోగించాడు అలాగే ఎంగిలాకు (కర్మవాది) వేగుచుక్క (మేధావి), వెర్రిగాలి (భౌతికవాది) మేరువులు (ధనికులు) వంటి ప్రకృతి ప్రతీకలు కూడా కనిపిస్తాయి.

**జానపద ప్రతీకలు :**

"పల్లెటూళ్ళో తల్లికేదో - పాడుకలలో పేగు కదిలింది"
('బాటసారి')

**గతితార్కిక భౌతికవాదం :**

పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ, విరోధ వైరధ్యం, పరిణామము గుణముగా మారే పద్ధతి - ఈ వాదం మూడు సూత్రాలు.

"పరస్పరం సంఘర్షించిన / శక్తులలో చరిత్ర పుట్టెను"
"నరజాతి చరిత్ర సమస్తం / దరిద్రులను కాల్చుకు తినడం"
"ధనవంతుల పన్నాగాలూ / ఇంకానా! ఇకపై చెల్లవు"
('దేశ చరిత్రలు' - మహా ప్రస్థానం,
పేజి నెం. 73 & 75)

ఈ విధంగా శ్రీశ్రీ గతితార్కిక, భౌతికవాదగ సిద్ధాంతమైన, మార్క్సిస్టు దృక్పధాలతో కూడుకున్న 'మహా ప్రస్థానం' నవ్యత్వంతో సృష్టించాడు.

**ముగింపు :**

"మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది / పదండి ముందుకు పదండి తోసుక, పోదాం పోదాం పైకి" అంటూ అభివృద్ధి పదంలోకి దూసుకుపోవాలని యువతకు పిలుపునిచ్చాడు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లు స్తబ్ధుగా ఉన్నవారిని చూచి, "ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి / నెత్తురుమండే, శక్తులు నిండే సైనికులారా రారండి" అంటూ సమాజ అభ్యుదయం కోసం పాటుపడాలని యువతలో ఉత్సాహాన్ని నింపాడు శ్రీశ్రీ.

సమాజంలో పెద్దహోదాలో వున్నవారిని సామాన్యులు ఎదిరించే సాహసం సాధారణంగా చేయరు. కాని శ్రీశ్రీ అభాగ్యులంతా, అనాధలంతా విప్లవ శంఖం వినిపిస్తారోయ్" అని హెచ్చరించాడు. "త్రాచుల వలెనూ / రేచుల వలెనూ / ధనుంజయునిలా సాగండి" అని ఉత్సాహ పరిచాడు.

"మీ రక్తం కలగి, కలగి / మీ నాడులు కదలి కదలి
మీ ప్రేవులు కనలి, కనలి / ఏడవకండేవకండి
పతితులారా / భ్రష్టులారా / ఏడవకండేవకండి"

అంటూ బాధితుల కన్నీళ్ళు తుడిచే ప్రయత్నం చేశారు. "క్రిష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" - అంటారు చలం. "అణ్వస్త్రాలు కాదు అన్నవస్త్రాలు ముఖ్యం" అంటారు శ్రీశ్రీ.

"నాలో కదిలే నవ్య కవిత్వం / కార్మిక లోకపు కళ్యాణానికి / శ్రామిక లోకపు సౌభాగ్యానికి / సమర్పణంగా, సమర్చనంగా" - అంకితం చేస్తానని చెప్పాడు. చేశాడు కూడా.

"శ్రమైక జీవన సౌందర్యానికి / సమానమైనది లేనే లేదని" చెప్తూ కష్టజీవులందరికీ నిత్య మంగళం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు శ్రీశ్రీ.

ఈ విధంగా భావంలోనూ, పదాలలోనూ శ్రీశ్రీ ప్రవేశ పెట్టిన నవ్యతకు కారణం అతని స్వీయ ప్రతిభనే. తెలుగు కవిత్వాన్ని నేటికీ నూతనమార్గంలో నడిపిస్తున్న శక్తి శ్రీశ్రీ తిప్పిన మలుపునే అని అనడం అతిశయోక్తి కాదు. 'మహా ప్రస్థానం' శ్రీశ్రీ విశ్వరూపం. ఆ మహాకవి స్ఫూర్తి ముందు తరాలవారికి అందించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. అది మనందరి బాధ్యత కూడా.

**ఆధార గ్రంథాలు :**

1. మహా ప్రస్థానం - శ్రీశ్రీ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి.
4. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు - కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురణలు, న్యూఢిల్లీ.

★★★

# నవ్య ప్రబంధము - "సీతమ్మ" : సమాలోచన

- డా॥. జి. శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, తారా ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి), సంగారెడ్డి.

## పరిచయం :

16వ శతాబ్దం నాటి ప్రబంధ కవులకు ఏ మాత్రం తీసిపోకుండా నేటి ఆధునిక తెలంగాణ కవులలో చక్కని చిక్కని రచనలు చేస్తున్న కవులలో శ్రీరావికంటి వసునందన్ (విశ్రాంత తెలుగు ఆచార్యులు) గారు ఒకరు, వీరిది కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా) వీరు 1971 నుండి పద్య, గేయ, వచన కథా కావ్యాలు, దీర్ఘ కావ్యాలు, నవలలు, పాటలు, ప్రస్తుతి కావ్యాలు, బాలసాహిత్యం, సంకీర్తన సాహిత్యం వంటి అనేక సాహితీ ప్రక్రియలలో 100వరకు రచనలు చేశారు.

వీరు వ్రాసిన పద్య కావ్యాలలో "సీతమ్మ" (నవ్య ప్రబంధము) ఒకటి. రామాయణ కథలోని సీత పాత్రను కేంద్రబిందువుగా చేసుకొని రచింపబడిన నవ్య ప్రబంధమిది. నాలుగు ఆశ్వాసాలు 371 గద్య పద్యాలు గల ఈ చంపూ కావ్యం 2013లో ముద్రితమైనది. పద్మ భూషణ్ డా.కె.ఐ.వరప్రసాదరెడ్డిగారికి అంకితం ఇవ్వబడింది.

నవ్య ప్రబంధ లక్షణాలతో కూడి, శబార్థ రమణీయత కలిగి, కదళీ పాకమున పుష్టియై వివిధ వర్ణనలతో అలరాలుతూ, చక్కని కథా సంవిధానముతో, అలంకార శోభితమై, కరుణము అంగిరసముగా శృంగార, వీరములు అంగరసములుగా తెలుగు, సంస్కృత పదభూయిష్టమై, కవిగారి కవిత్వ పరిపక్వతను చాటుతున్నదీ సీతమ్మ నవ్య ప్రబంధము.

## కథా సంవిధానం :

రామాయణంలోని కథనంతా కాకుండా సీతాదేవిని కేంద్రబిందువుగా చేస్తూ రచింపబడిన ప్రబంధమిది. 'రామ' అనే మాటకు 'స్త్రీ' అనే అర్థముంది. రామ + అయనం అంటే సీత నడచిన మార్గము అని, ఆ దృష్టితో సీతమ్మను ప్రధాన పాత్రగా నిలుపుతూ ఇతర కథలను సంక్షిప్తం చేస్తూ కథను నడిపించడం కవి అనుపమ కథన నైపుణ్యమునకు నిదర్శనం.

వాల్మీకి రామ కథా క్రమమునకు భిన్నముగా సీత కథను ముందుగా (ప్రథమాశ్వాసంలో) చెప్పి, రాముని కథను తరువాత (ద్వితీయాశ్వాసంలో) చెప్పడం కవి కథన కౌశలాన్ని తెలుపుతుంది.

1. ప్రథమాశ్వాసాన్ని సీత శివధనుస్సును కదిలించడం, దాన్ని చూసి పెద్దలు శివధనుస్సు ఎక్కుపెట్టిన వానినే సీతనివ్వవలెనని నిశ్చయించడంతో ముగించడం,
2. ద్వితీయాశ్వాసాన్ని సీతరామ కళ్యాణంతో ముగించడం,
3. తృతీయాశ్వాసాన్ని సీతను రావణుడెత్తుకు పోవడంతో ముగించడం,
4. చతుర్థాశ్వాసాన్ని సీతను రావణుని చెర నుండి విముక్తం చేసి తిరిగి అయోధ్యలో పట్టాభిషేకంతో ముగించడం- చూస్తే కథన నిర్మాణం బాగా తెలిసినవారుగా కవి మనకు కనిపిస్తారు.
5. శివ ధనుర్భంగ శబ్దము విని పరశురాముడు రావడం, విష్ణు చాప ఖండన అనంతరం వెళ్ళిపోవడం.
6. గుహుని కథ, శూర్పణఖ కథ సందర్భోచితంగా చెప్పడం అద్భుతంగా ఉంది.
7. ప్రతి ఆశ్వాసంలోని ప్రారంభ పద్యము, ఆ ఆశ్వాసములోని వస్తు సూచకంగా ఉంది.

## పాత్ర చిత్రణ

### 1. సీత పాత్ర చిత్రణ

ఈ ప్రబంధానికి హృదయం సీతాదేవి కావున సీతను కవి చిత్రించిన తీరు చూద్దాం.

1. లక్ష్మీ, సరస్వతి, పార్వతిల కలబోతగా సీతను

చిత్రించారు. ఇది వారి దర్శన నైశిత్యాన్ని సూచిస్తుంది. శ్రీవిద్యకు అధిష్ఠాన దేవత సీత అనే ప్రతిపాదన కూడా ఉన్నది.

శ్రీరామాకృతి పూర్ణమై యెసగనే సీతామహాసాధ్వి తా
నారోహించునొ విశ్వమాతృపదమత్సంతాప్త సౌభాగ్యధా
రారోపంబుగ లక్ష్మియై గిరిజయై బ్రాహ్మీమహా మాతయై
సీరాంకంబుల నొర్చి కాచు సుగుణశ్రీ చక్రనర్చించెదన్

సీతమ్మ విశ్వమాతయని, ముగ్గురమ్మల మూల పుటమ్మయని, శ్రీచక్ర స్వరూపిణియని చెప్పడం జరిగింది.

2. జోల పాటలోనూ ఈ విషయం చెప్పబడింది
శ్రీలక్ష్మి నీకు శ్రీనాథు లాలీ/ గిరి కన్య నీకు పరమేశు లాలీ/ వర శారదాంబ పరమేష్ఠి లాలీ(1-42).
3. ఇంకా 1-27, 1-51, 2-65 పద్యాలలో సీతను ఇలాగే దర్శించడం జరిగింది.
4. సీతను పంచ భూతమయంగా దర్శించడం కలదు. (1-6, 1-30).
5. సీత తమ తోటి బాలికలతో కలిసి రకరకాల ఆటలు ఆడటం, సీత కలుపుగోలుతనాన్ని తెలుపుతుంది.
6. సీత శివధనుస్సు కదపటం ఆమె దైవీ లక్షణాన్ని తెలుపుతుంది.
7. గంగ సీతను తల్లిగా భావించడం, కవిగారి ఊహ అత్యున్నత స్థితికి చేరిందనడానికి నిదర్శనం.

తరగల ముంగురుల్ విపుల దర్పపయోత్థిత గోపురమ్ములున్
గర కరి శైవలమ్ములును, గ్రాల్కొను మీనములున్ సుడుల్ మనో
హరమగు తళ్కు బెళ్కుల మహాజలరూపము మీర, మాతకున్
సరియగు కూతురై యలరె సాధ్వికి సీతకు గంగ యత్తరిన్ (3-17)

తల్లి పాదాల గడుగుచు దనువు ధన్య/ గతిని వహియించ బరగె గంగా భవాని/ తల్లి యొడిలోన దలిరొందు తనయవోలె తల్లి తనయొడి బయనించ దనరె గంగ(3-18)

హరి పాదమున పుట్టింది కావున హరికి పుత్రిక గంగ. అంటే లక్ష్మికి కూడ పుత్రికే అవుతుంది. లక్ష్మి అవతారమే సీత కావున, గంగకు సీత తల్లి అవుతుందనటం చమత్కారం. సాధారణంగా తల్లి ఒడిలో బిడ్డ హాయిగా సేద తీరుతుంది. కాని ఇక్కడ బిడ్డ ఒడిలో తల్లి ఉందని చెప్పటం రమణీయం.

8. రామునితో బాటే తాను అడవికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నప్పుడు సీతకు భర్తపై గల ప్రేమ తెలుస్తుంది.
9. లంకలోని సీతను హనుమంతుడు రాముని కడకు తీసుకెళ్తానన్నప్పుడు రాముడే వచ్చి రావణున్ని చంపి తనను తీసుకెళ్ళాలని చెప్పినప్పుడు ఆమెకు రామునిపై గల విశ్వాసము తెలుస్తుంది.
10. సీత మనసు మెత్తనిది-చిన్న కీటకము కనిపించినా భయపడుతుంది.(3-127).
11. లక్ష్మణుని నిష్ఠూరము లాడినపుడు మాత్రమే సీత తన వ్యక్తిత్వాన్ని తక్కువ జేసుకున్నట్లు తెలుస్తుంది.

## 2. రాముని పాత్ర చిత్రణ

1. కవి రాముణ్ణి సాక్షాత్తు విష్ణు రూపునిగానే చిత్రించడం జరిగింది.(3-87).
2. రాముడు పురుషులకునైన మోహంబు బుట్టు జేయు(2-57) వాడు
3. బాలునిగా తల్లిదండ్రుల వద్ద అమాయకంగా ఆడుకోవడం.
4. విశ్వామిత్రుని వెంట శిష్యునిగా గురుభక్తిని ప్రకటించడం. తాటకిని చంపునపుడు 'స్త్రీ' యని సంకోచించడం, గుహునిపై, శబరిపై చూపించు ప్రేమ రాముని ప్రవర్తనకు మచ్చుతునకలు.
5. శూర్పణఖ ముక్కు చెవులు కోయమని రాముడు, లక్ష్మణునికి చెప్పకపోవడం-రాముని వ్యక్తిత్వాన్ని కవి నిలబెట్టినట్లైంది.

6. సీతాపహరణ తరువాత రాముడు విహ్వాలుడైనట్లు వర్ణించడం రామునికి సీతపై గల ప్రేమను తెలియ జేస్తుంది.

దీపము లేని ఇంటిగతి దీనుని మోము విధాన శూన్యమై
పాపపు గాలి సోకిన విభారహితంబగు యజ్ఞ వేదికా రూపము దాల్చి పంచవటిరూపజీయుంట కుటిన్ విదేహజ్యా రూపములేమి దాశరథి రోదన జేయుచు వెళ్లికైవడిన్ (3-124).

7. లక్ష్మణుడన్న సోదరభావం సుగ్రీవునితోడి మైత్రి, హనుమంతునిపై ప్రేమ, వీభీషణునిపై వాత్సల్యం, రావణ సంహార సమయంలో ధీరత్వం, లోక నిందను ఊహించి సీతకు అగ్ని పరీక్ష పెట్టడం మొదలైనవి రాముని ధర్మస్వరూపునిగా నిలుపు తాయి.

### 3. లక్ష్మణుని పాత్ర చిత్రణ

1. లక్ష్మణుడు ఆదిశేషుని అంశగా చెప్పబడ్డాడు.(3-6).
2. బంగారు జింక కొరకు రాముడు వెళ్ళినప్పుడు, రాముని బలపరాక్రమాల మీద లక్ష్మణునికి గల అపార నమ్మకం తెలుస్తుంది.
3. సీత నిష్ఠూరములాడిపుడు తాను సీతాదేవిని తల్లిలాగే భావిస్తున్నానని చెప్పడం లక్ష్మణుని ఔచిత్యాన్ని తెలుపుతుంది.
4. పరిస్థితి పసిగట్టి శూర్పణఖ ముక్కు చెవులు కోయడం లక్ష్మణుని సమయస్ఫూర్తిని తెలియజేస్తుంది.

### రసపోషణ

కవి ప్రబంధాన్ని 'రసప్రశక్తి'గా(1-5)రచింప పూను కొనినాడు. శృంగార వీరములు అంగరసములుగాను కరుణ రసమును అంగి రసముగా నిల్పాడు.

రాముడు అరణ్య వాసములో కొన్ని కష్టము లెదుర్కొన్ననూ - ముఖ్యముగా సీతాపహరణం తరువాత రాముడు గుండెలు పగులునట్లుగా ఏడ్వడం అత్యంత కరుణ రసపూర్ణముగా వర్ణింపబడినది.

భూజాత గంటిరే భూమి జాతములార/ తెలుపరే యని చెట్ల నలముకొనును
సుమనోంగి ఏమయ్యె సుమనోలతిక లార/ పాద జూపరేయని పొదవు కొనును
గంధేభగామిని గతిజెప్ప వేలరా/ గంధవాహాయని గర్జసేయు
లోకచక్షుడవై త్రిలోక సుందరి జూపు/ సౌరుమూసెనె నీకు సవితయనును
నలిగి దిక్పాలకులు జచ్చినారె యనును/ చెలగి లోక భీకరగతి జెందు వేయు
వలపు బరువున నిట్టూర్పు వనులు నదులు/ గిరులు ఘూర్ణిల్లు బ్రేయసి గేకవైచు(3-125)

ఎంతో గంభీరంగా ఉండే రాముడు గుండెలవిసి పోయెల శోకించడం పాఠకుని గుండెను పిండేస్తుంది.

### అర్థ చమత్కృతి మరియు అర్థాలంకారాలు

కథా సందర్భోచితంగా బంగారానికి రత్నములు పొదిగినట్లు అర్థ రామణీయకతను కలిగించారు కవి. కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తాను.

**1. మొదటి పద్యంలో సీతను వర్ణించుచూ 'సుగుణశ్రీ చక్ర నర్చించెదన్' (1-1) అంటారు. అంటే**

1. సీత సుగుణముల శుభ వలయం అనీ
2. శ్రీవిద్యాధిష్ఠాన దేవత అనీ ఒక అర్థం
3. శ్రీచక్రస్ఫురణ ధ్వనిస్తుంది.

**2. మిథిలానగరంలో అన్నీ బాగున్నాయి. కాని రెండు వింతలున్నాయి అనడం చమత్కారంగా ఉంది.**

అట్టి పురిని వింతలు రెండు నందగించు/ పరుల కెత్తుగా జెల్లని భవుని విల్లు
వనములందున్న కొమ్మల పండ్ల కన్న/ వాసికిని రాసికిని పెక్కు వానరములు(1-25)

మిథిలలో వానర ప్రస్తావన, భవిష్యత్తులో వానర సైన్యమును ధ్వనింపజేస్తుంది.

**3. సీత "చిగురుంబోలిన చేతితో/ శివధనస్సును కదిపింది" అనడం చమత్కృతి(1-63)**

**4. సీతా స్వయంవరంలో**

విశ్వామిత్రుడు సంజ్ఞగా "చేయి" కదిలిస్తే, రాముడు "కాలు" కదిలించాడు(2-78)

**5. రాముడు సీతను అడవికి వద్దంటాడు, ఎందుకంటే సీత "అసలే పూవులు కాళ్ళు" అనడం(3-5)**

అడవికి వెళ్ళిన తరువాత "భూసుత కాలు సోకినన్ తామరలయ్యెరాళ్ళు"(3-8) అనడం చమత్కారం.

**6. సీత పాదాలలో కుంకుమ, మేనులో పసుపు ఉందనడం (1-34)**

**7. బాలరామునివి పాల బుగ్గలనడం(2-24)**

**8. లక్ష్మణునివి ఆల్చిప్పల వంటి కళ్ళు(3-24)**

**9. దశరథుని యజ్ఞ ధూమము యొక్క వివధాకృతులు విష్ణువు అవతారాలను స్ఫురింపజేస్తాయి. అర్థ చమత్కారాన్ని సూచిస్తాయి.**

ఈ ప్రబంధంలో చక్కని ఉపమానాలతో కూడిన అర్థాలంకారాలు రమ్యముగా చెప్పబడినాయి.

**10. శివధనుస్సు నెత్తడం ఇతరులందరికి అసాధ్యమైన పని, కాని రామునికి సులువు.**

ఎత్తెదవట శివధనువును/ వెుుత్తటి పూదీవవోలె(1-2)

ఇది రాముని బలాన్ని సూచిస్తుంది. శివధనుస్సును పూదీవ అనడం చక్కటి ఉపమానం

**11. సీత అడవులలో నార చీరలతో సంచరించునపుడు అందరూ ఆమెను చూచి భ్రాంతి పడ్డారు.**

ముని కన్యయొ వన కన్య యొ
కన నారలు జుట్టి పుష్ప కలితాంగకమై
తనరు నన దరుణి జానకి
కన విని యెరుగంగ రాని గతి నొప్పెవనిన్ (3-10)

**12. శూర్పణఖ రాముని చూచి మరులు కొన్నది**

నిన్ను గనినంత నా గుండె నిప్పుమీది/ వెన్న ముద్దయై కరగుచు విచ్చిపోయె
పాడు కాముని దెబ్బల పచ్చి మాన్పి/ అమృత సంజీవమూర్తివై యరయ రమ్మ(3-44)

నిప్పు మీది వెన్న ముద్దలా కరగటం-చక్కని ఉపమానం.

**13. బంగారు జింక వర్ణన స్వభావోక్తి అలంకారం**

పదములు నన్ని లేపి యొక బంతివలెన్ విహరించు మింటిలో
వదనము ద్రిప్పుచున్ పదమువైచును హంసయనంగ మంటిలో
బదనిక మేయు నొక్కటను బాదము వంచి పరుండు నొక్కటన్
పొదలును మేని వన్నెలను బూయుచు రాయుచు బూవుతీవెలన్ (3-77)

**ఎ. వర్ణనా వైచిత్రి**

వసునందన్‌గారి వర్ణనలు కథకు మరింత సొబుగు నిస్తాయి. వర్ణనలు అధికంగా ఉండటం ప్రబంధ లక్షణం.

1. కథా ప్రారంభంలోనే మిథిల నగర వర్ణన, మిథిలానగర ప్రజల వర్ణన చక్కగా ఉంది.

ఎల్లరు వేదపారగులె ఎల్లరు ధర్మ పథాను వర్తులే
ఎల్లరు శాస్త్రకోవిదులె ఎల్లరు ధీవిభవాభి రాములే
ఎల్లరు సత్కళారతులె ఎల్లరు నిగ్రహశీల మూర్తులే
ఎల్లరు దేశ బాంధవులె ఎల్లరు ధైర్య గుణోన్నతాత్ములే
(1-17)

రాజర్షి జనకుని పాలనలో ప్రజలు అలా ఉండటం సబబే.

2. సీతాదేవి బాల్య చేష్టల వలన, ఆటలాడటం మరింత మనోహరంగా ఉంది. బాల సీత అందము, పరికిణి కట్టుకొని లడ్డులు పంచడం, గుజ్జన గూళ్ళు, చెమ్మచెక్కలు, రామచిలుకను పెంచుకోవడం జలక్రీడలు వంటి వర్ణనలు ప్రబంధానికి

అందం తెస్తాయి. చిన్నారి సీతను చూడడానికి రెండు కళ్ళు చాలవు.

పేద బమ్మ కన్నులు రెండె పెట్టె నేల/ పాప మీ మానవులకును పగిది తనువు
తనువు నిలువెల్ల కనులుగా దరుణి తనువు/ వెఱ్ఱిదయి కాంచ నవ్వని జుఱ్ఱు కొనుచు (1-59)

3. దశరథుని కొడుకుల బాల్య చేష్టలు మనోహరంగా వర్ణింప బడ్డాయి. (2-19)
4. చక్కని ఉపమానాలతో తాటకి ఉండే అడవి వర్ణింపబడినది (2-32)
5. శ్రీరాముడే ఈ విశ్వములను సృష్టించువాడని రాముని తత్త్వాన్ని చెప్పడం కవి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సూచిస్తుంది.(2-49)
6. రాముడు శివధనుస్సు నెత్తునపుడు ధనుస్సులో కలిగే మార్పులు కవి ఊహకు పరాకాష్ట

శ్రీరామ పాదము జిన్నగా చేరగా/ పులకింత గంగల నలరెధనువు
సీతమ్మ క్రీగంటి చివరి చూడ్కులు తీవ/ సాగగా మెత్తగా సాగె నారి(2-79)

7. శూర్పణఖ సౌందర్య వర్ణనను సుమారు 12 పద్యాలలో వర్ణించడం శృంగార రసస్ఫోరకంగా ఉంది. (3-33 నుండి 45 వరకు)
8. సీతాపహరణం తర్వాత రాముని వేదన ఎంతటి వారికైనా కళ్ళ వెంట నీళ్ళు తెప్పిస్తుంది. (3-124 నుండి 147)

సుమారు 22 పద్యాలలో హృదయ విదారకంగా రాముని స్థితిని వర్ణించాడు కవి.

శోకమె రూపమై వనినశోకుడు రాముడు సంభ్రమించె నీ
లోకమె నారకమ్మనుచు, రూపగు లక్ష్మి సువక్ష సీమ బెం
జీకటి జేసి వైదొలగ, సీతను జూడని జన్మమేల? నా
కీ కటికంపు ధర్మమును గిర్మముతో బనియేమి తమ్ముఁడా (3-144)

ఈ వర్ణనలు 16వ శతాబ్దము నాటి ప్రబంధములను తలపించును.

**శబ్ద చమత్కృతి**

పోతన వలె శబ్ద చమత్కృతి నెక్కువ ప్రదర్శించారుకవి. మచ్చుకు కొన్ని

1. వసునందనాభిధానుడ/ వసుధాత్మజ సీత కథ...(1-8)
2. గోపురమై ధర్మమునకు/గోపురమై...(1-10)
3. భువి మూలాధారముగా/చివురించిన పాప పాప సీతగ దోచెన్ (1-36)
4. పై కొని సోకు సోకు సోకుటకు(3-1)
5. రామ రమణీయ సర్వ కళాభిరామ(3-34)
6. పాటల బాడు కిన్నెరయి/పాటల గంధి/ ఎప్పాటను పాటుగామి బలుపాటుల నొందు(3-38)
7. రాజువె నీవు నవ్య రతిరాజువు గాక(3-45)
8. రాముచక్కదనము రామ చక్కదనము/ జూచి వలచి పట్ట జూచునంత/ రామానుజుడు...(3-54)

అంత్యప్రాసకు ఉదాహరణ-జటాయువు రావణునితో తలపడుట

చించున్ దేహమునెల్ల, శోణితము వర్షించున్ ధరా మండలిన్
త్రెంచున్ కర్కశనాడికా వళులు, భేదించున్ మహా వక్షమున్
త్రుంచున్ మాంసము సూక్ష్మ ఖండములుగా దుర్వార శౌర్యమ్ము జూ
పించున్ ముక్కున గోళ్ళ జీరియసురోర్వీశుండు మూర్ఛిల్లగన్ (3-112)

**పలుకుబడులు**

లోక వ్యవహారంలో ఉన్న పలుకుబడులను కవి చక్కగా ప్రయోగించారు.

చుప్పనాతి(3-28), గునగునగున (3-53), ఉన్నవి లేనివి (3-55), నానాగడ్డిదినుచు(3-70), ఒక దెబ్బకు

రెండు పిట్టలు (3-73), చెవులు గింగిరులెత్తుట(3-91), పెదవి విరుచు(3-95), చెవిలో సీసము పోయడం (3-99), లొట్టలు వేయడం (3-105), గోలుగోలున ఏడ్వడం (3-115), 'సీతమ్మ' నిజంగా నవ్య ప్రబంధమనగా విరాజిల్లి సరస్వతి పీఠమునలంకరించుచున్నదని చెప్పవచ్చు.

**ఛందస్సు**

1. ఇది చంపూ కావ్యం
2. జోలపాట (1-42) ఉండటం విశేషం.

   సీతాదేవి పుట్టినప్పుడు సందర్భోచితంగా మిథిలా నగర స్త్రీలు 'జోలపాటలు' పాడటం కథకు మరింత శోభను తెస్తుంది.
3. ఔద్ధరిణి (3-108, 109) వంటి అరుదైన ఛందస్సులను వాడారు.
4. మానిని-పద్యాన్ని మాలగా, ప్రాస లేకుండా, మాత్రా ఛందస్సుతో వ్రాశారు(1-61)

**ఉపయుక్త గ్రంథ సూచిక :**

1. పోతన, బమ్మెర. 1994. శ్రీమహాభాగవతము. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.
2. వసునందన్,రావికంటి. 2013. సీతమ్మ(నవ్య ప్రబంధం) హైదరాబాదు: రచయిత.
3. శ్రీనివాసరావు, గొట్టె. 2024. పోతన భాగవతం-అలంకార శిల్పం. హైదరాబాదు: శ్రీరాధాకృష్ణ ప్రచురణలు.
4. సంపత్ కుమారాచార్య, కోవెల. 2012. ఛంద:పదకోశము. హైదరాబాదు: తెలుగు అకాడమి.

★★★

BHAVAVEENA
Vol. 22, Issue. 04, April 2025
భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# ఆధునిక భారతీయ లిపులు - పరిచయం

- డా॥. యం. మూదన్న, తెలుగు శాఖ, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

మానవుడు సృష్టించిన విశేషాలన్నిటిలో లిపి అనేది ఒక అద్భుతం. ఆధునిక భారతీయ లిపులను గురించి తెలుసుకునే ముందు లిపి అంటే ఏమిటి? లిపి ఎలా పుట్టింది, కాలగమనంలో ఎలాంటి మార్పులు సంత రించుకుంది వంటి ప్రాథమిక సమాచారం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లిపి అనగానే సాధారణంగా భాషను రాయడానికి ఉపయోగించే గుర్తు లేదా గుర్తు వ్యవస్థను లిపి అంటారు. అంటే భాషను మాట్లాడటం వేరు, ఆ భాషను రాయడానికి ఉపయోగించే గుర్తులు విధానం లిపి. వ్యక్తి తన భావనలను లిఖిత రూపంలో వ్యక్తం చేయడానికి ఉపయోగించే శబ్దాల సమిష్టిని లిపి అనవచ్చు. అలాగే ఏదైనా ఒక భాషను రాసే శైలిని కూడా లిపి అంటారు. లిపిని ఆంగ్లంలో 'స్క్రిప్ట్' అంటారు. స్క్రిప్ట్ అనే పదం లాటిన్ పదమైనా 'స్క్రిప్టమ్' నుండి వచ్చింది. దాని అర్థం వ్రాత లేదా రాయటం. చేతితో రాసినదేదైనా కావచ్చు. అది గీత కావచ్చు. బొమ్మ కావచ్చు. లేదా గుర్తు కావచ్చు. మరేదైనా కావచుఎచ్చు. దాన్నే మొదట లిపిగా పరిగణించారు. మొదట్లో అంటే లిపి లేక ముందు పూర్వం మానవుడు తన మనసులోని భావాలను నిలువు లేదా అడ్డగీతలు ద్వారా వ్యక్తం చేసేవాడు. ఆ తరువాత చిత్రాలు, బొమ్మలు ద్వారా ఆదిమానవుడు తన ఆలోచనలను తెలియజేయసాగాడు. అలాంటి ఎన్నో గీతలు, బొమ్మలు గుర్తులను మనం కొండ గృహల్లో పెద్దపెద్ద కొండ రాళ్లపైన ముఖ్యంగా అజంతా ఎల్లోరా గృహల్లో, ప్రాచీన దేవాలయాల గోడల మీద చూడవచ్చు.

'లిపి' 'లిబి' మరియు గ్రంథ అనే పదాలు మొట్ట మొదటగా పాణినిచే 'అష్టాధ్యాయి'లో ప్రయోగించడం జరిగింది. క్రీ॥పూ॥ 4వ శతాబ్దానికి ముందు 'లిపి' అనే పదమే వాడుకలో ఉండేది. కొన్ని భాషలకు లిపి అనే అక్షరాల్లో వాడుకులో ఉంటే, మరికొన్ని భాషలకు లిపి అనే అక్షరాల్లో వాడుకలో ఉంటే, మరికొన్ని భాషలకు లిపి బొమ్మతో, చిత్రాలతో వాడుకలో ఉండేది. నాడు లిపిలో ముఖ్యంగా ఆడ మగ బొమ్మలకు బాణం గుర్తు లను వాడేవారు. లిపి విధానాన్ని గమనిస్తే కొన్ని లిపులు ముఖ్యంగా మన భారతీయ లిపులు చదవటానికి మరియు రాయటానికి ఎడమ నుండి కుడివైపుకు ఉంటాయి. ఉదాహరణ : బ్రాహ్మీ, దేవనాగరి మరియు ఇతర భారతీయ భాషల లిపులు. ఇంకా పాశ్చాత్య లిపులనేవి చదవటానికి రాయటానికి కుడి నుండి ఎడమ వైపుకు ఉంటాయి. ఉదహరణకు ఖరోష్టి, అరబిక్, పర్షియన్ మొదలైనవి. లిపి దాని చరిత్ర పరిశీలిస్తే ప్రాచీన శాసనాలు ద్వారా వివిధ కాలాల్లో వివిధ రకాల లిపులను గమనించవచ్చు. పూర్వం రాజులు వారి విజయాలను, వారు చేసిన దాన ధర్మాలు, భూమిని దేవాలయానికి దానం చేయడం, బ్రాహ్మణులకు, పండితులకు గ్రామా లను, అగ్రహారాలను మణిమాణిక్యాలను విరాళంగా ఇచ్చినట్టు రాగి శాసనల్లోనూ, రాగి పళ్ళాలపైన కని పిస్తాయి. ఈ విధంగా కాలగమనంలో లిపులు ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయి, వాటి పుట్టుక, వాడుక వంటి విషయాలను గురించి ప్రాచీన శాసనాలు ద్వారా, ప్రాచీన గ్రంథాలు ద్వారా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఆధునిక భారతీయ లిపులు - పరిచయం గురించి తెలియ జేయడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

ఆధునిక భారతీయ లిపులకు మూలం బ్రాహ్మీ లిపి. భారతీయ లిపులన్నింటికీ తల్లి వంటిది. ప్రాచీన ఆధునిక లిపులో పేర్లు చాలా వరకు ఒకే రకంగా ఉన్నప్పటికీ కాలగమనంలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. కొన్ని అక్షరాలు కనుమరుగైపోగా, మరికొన్ని అక్షరాలు రూపాలు మార్చుకున్నాయి. ఒకరకంగా ఈ మార్పులకు మూలకారణం ఆకర్షణీయంగా రాసేటప్పుడు తేలిగ్గా ఉండాలన్న ఉద్దేశ్యం అయి ఉండవచ్చు అని శాసన పరిశోధకుల అభిప్రాయం.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

**ఆధునిక నాగరిక లేక దేవనాగరి :**

హిందీ, మరాఠీ, సంస్కృతం ఇతర ఆర్య భాషల పుస్తకాలు ఈ లిపిలోనే ముద్రితమయ్యాయి. ప్రపంచం లోనే పరిశోధకులు అందరూ ఈ దేవనాగరిక లిపిని గౌరవిస్తారు. ఈ లిపిలోని 'ఈ' అనే అక్షరాన్ని 6వ శతాబ్దంలో కనుగొన్నారు. భారత ప్రభుత్వం దీనిని ఏకైక భారతీయ జాతీయ లిపిగా ఆమోదించి దేశం మొత్తం వాడుకలోకి తెచ్చింది. అలాగే దేశంలోని అన్ని విద్యా సంస్థల్లో ప్రవేశపెట్టబడింది. కేంద్ర ప్రభుత్వం దేవనాగరి భాష అంటే హిందీలోనే తమ పరిపాలన సంబంధితమైన కార్యకలాపాలను కొనసాగిస్తున్నది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నియమ నిబంధనలు ప్రభుత్వ గెజిట్ ఫారాలు వంటివి ఈ దేవనాగరిలిపిలో ముద్రిస్తున్నది. భారత దేశంలో అన్ని భారతీయ భాషల్లో కల్లా హిందీ భాషనే ఎక్కువ వాడకలో ఉంది. ఈ భాషలో ఎన్నో వేల తాళపత్ర గ్రంథాలు లభించాయి. ఈ హిందీ భాషా ప్రభావం మిగతా భాషలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

**ఆధునిక శారద :**

'కాశ్మీరుని' చదువుల తల్లి సరస్వతి పుట్టినిల్లుగా భావిస్తారు. అందుకనే కాశ్మీర్‌ను 'శారదాదేశం'గా శారద మండలంగా గుర్తిస్తారు. అందుకనే ఇక్కడ ప్రాచుర్యం పొందిన లిపి కాబట్టి ఈ లిపికి 'దేవ దేశ' అని కూడా పిలిచేవారు. ఈ లిపి 'కుటిలా లిపి' నుండి 10వ శతాబ్దంలో వృద్ధి చెందింది. కాశ్మీర్, పంజాబ్ ప్రాంతాలలో ఈ లిపిని వినియోగిస్తారు. దాదాపు నాగరి లిపి, శారద లిపి రెండు ఒకే రకంగా ఉంటాయి. ప్రస్తుత ఆధునిక యుగంలో శారదా లిపి స్థానాన్ని నాగరి, గురుముఖ మరియు తాకరి లిపులు అనుసరించి అభివృద్ధి చెందాయి.

**తాకరి :**

మొదటిలో తాకరి అనే లిపి గురించి పెద్దగా తెలియదు. రాజ్‌పుత్ పాలకులైన తాకూర్ అన్న పదము నుండి ఈ తాకరి అనే పదం వచ్చి ఉంటుందని లేదా తంకా లేక లుహానా వ్యాపారస్థుల లిపి నుండి వచ్చి ఉండవచ్చని పరిశోధకులు భావించారు. ఈ లిపి శారదా లిపి లాగానే ఉందని కొందరు భావించారు. హల్లు 'ఖ' అన్న అక్షరం 'ష' లా మారిందని భావిస్తారు. ఈ లిపి జమ్ము, ఉత్తర పంజాబ్ ప్రాంతాల్లో వాడుకలో ఉంది. జమ్ములో తాకరి లిపిని 'డోగరిగా భావిస్తారు. ఈ లిపిని చదువుకున్న కొంతమందికి, అక్కడ కొందరి వ్యాపారస్తు లకు తప్ప బయట వాళ్ళకు ఈ లిపి అర్థం కాదు.

**గురుముఖి :**

దీన్ని పంజాబీ అని కూడా పిలుస్తారు. ఇది వ్యాపారస్థుల లిపి. దీనికి 'లండా' అనే పేరుతో పంజాబ్‌లో పిలుస్తారు. ఈ లిపిలో 'సింధి' లిపిలో లాగా అచ్చుధ్వనులు లేవు. గురు గ్రంథ సాహెబ్ మరియు ఇతర మతపరమైన పుస్తకాలు లండా లిపిలో రాసినట్లుగా చెపుతారు. శారద లిపి నుండి 24 ధ్వనులను తీసుకోవడం జరిగింది. ఈ లిపిలో 3 అచ్చులు 23 హల్లులు ఉన్నాయి. కొన్ని ఉదాహరణ పరిశీలిస్తే 'సరితా' అన్న పదాన్ని 'సిత్రా' అని, 'భగవాన్' అన్న పదాన్ని 'పహగ్‌వాన్' అని 'ప్రతాప్' అన్న పదాన్ని 'పర్‌తాప్' అని వ్యవహరిస్తారు.

**ఖైతి :**

నాగరికి కొద్ది మార్పులతో ఉత్పన్నమైనదే 'ఖైతి' 'ఖయతి' అని కూడా పిలుస్తారు. దీనిలో సంస్కృత భాషలో ఉండే ఋ, ఞ అనే అక్షరాలు ఉండవు. 'వ' కి 'బ' కి మధ్య తేడా కనబడదు. పాలకులు మారడం వలన 'ఖైతి' మూడు రకాలుగా పేర్కొంటారు.

1. మిథిలా ఖైతి, 2. మగధ ఖైతి, 3 భోజ్‌పూరా ఖైతి.

**ఆధునిక బంగ్లా లిపి :**

ప్రాచీన నాగరిక లిపి నుండి ప్రాచీన బంగ్లా లిపి పరిణామం చెందింది. దీనిలో అక్షరాలు నాగరి లిపిలో మాదిరిగానే కనిపిస్తాయి. ఈ ప్రదేశాన్ని భారత్‌లోని పశ్చిమ బెంగాల్ మరియు బంగ్లాదేశ్ రెండు భాగాలు చూస్తారు. కలకత్తాలో ఈ లిపిలో ముద్రించబడిన పుస్తకాలు లభిస్తాయి. ప్రస్తుతం అవి దేవనాగరి లిపిలోకి ముంద్రించ బడుతున్నాయి.

**ఉడియా లేక ఒడియా :**

ఈ లిపి ప్రాచీన కళింగ లిపి నుండి వృద్ధి చెందింది. ఈ ప్రాచీన కళింగ దేశమనేది ఆధునిక ప్రస్తుత ఒరిస్సానే.

ఈ ప్రదేశాన్ని 'ఉత్కళ' లేక 'ఉడ్ర' అని అంటారు. దీన్నే ఉడ్ర, ఒడిసా, ఒడియా అనే పేర్లతో పిలుస్తారు. ఈ లిపి ప్రాచీన నాగరి మరియు బంగ్లా నుండి తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ఏ, ఐ, ఓ, ఔ అచ్చులు ఆధునిక బంగ్లా నుండి తీసుకోవడం జరిగింది.

**మైథిలి :**

ఇది బీహార్‌లోని సాధారణ బ్రాహ్మణుల లిపి. సిక్కులకు సంబంధించిన విషయాలను ఈ లిపిలో రాయడం జరిగింది. బంగ్లా లిపిని కొద్ది మార్పులు చేర్పులతో ఈ లిపి ఏర్పడిందని బాషావేత్తలు పేర్కొన్నారు. ఈ ప్రదేశంలో బ్రాహ్మణులు కాని వారందరూ ఈ లిపికి బదులు నాగరి కానీ ఖైదీ లిపులను వాడుతారు.

**ఆధునికమైన తెలుగు కన్నడ లిపులు :**

తెలుగు కన్నడ లిపులు ఆంధ్ర, కన్నడ ప్రాంతాలల్లో ప్రాచీనకాలంలో రాజుల కాలంలో ముఖ్యంగా విష్ణు కుండినులు, పల్లవుల కాలంలో కలిసి ఉండేవి. ఈ రెండు లిపులు చాలాకాలం తర్వాత విడిపోవడం జరిగింది. తెలుగు లిపి గుండ్రంగా అందంగా ఉంటుంది. ప్రాచీనపు తెలుగు కన్నడ లిపులు నుండి వచ్చినవే ఉ, ఊ, క, స, హ అన్నవి మాత్రమే రెండో లిపుల మధ్య ఉన్న తారతమ్యాలను చూపగలవు. మిగతావన్నీ దాదాపుగా ఇంచుమించు ఒకే మాదిరిగా ఉంటాయి. 'తెలుగు' అన్నపదం త్రిలింగ, తిలింగ, తెలంగాణ వంటి పదాల నుండి మార్పు చెందిందని పరిశోధకులు తెలిపారు. కన్నడ అనేది బహుశా ప్రాచీన కర్ణాటకలోని కన్నడ నుండి వచ్చి ఉండవచ్చని పరిశోధకుల భావన.

**ఆధునిక గ్రంథలిపి :**

ఈ లిపి ప్రాచీన గ్రంథ లిపి నుంది వృద్ధి చెందినదే. సిక్కులకు సంబంధించిన విషయాలు కూడా గ్రంథలిపిలో రాయబడ్డాయి. కానీ ప్రస్తుతం సిక్కులకు సంబంధించిన ఎక్కువగా విషయాలు నాగరిక లిపిలో రాయబడుతున్నాయి, ముద్రించబడుతున్నాయి.

**మలయాళం :**

ఈ లిపినే 'కేరళ' లిపిని కూడా భావిస్తారు. మలయాళం ప్రాంతంలోని మలయాళ భాష మరియు కేరళ భాష ఒక్కటే. ఒకరకంగా ఇది కూడా గ్రంథలిపి మాదిరి గానే ఉంటుంది. తమిళులు, సిక్కు పదాలు రాయటానికి ఈ లిపిని ఉపయోగిస్తారు. గ్రంథలో అయితే ఈ లిపికి సంబంధించిన ఏ ధ్వనినైనా రాయవచ్చు.

**తుళు :**

ఈ లిపి గ్రంథలిపి నుండి ఉద్భవించిన మలయాళం లిపికి మరో రూపం లాంటిదని చెప్పవచ్చు. కర్ణాటక రాష్ట్రంలోని ఉడుపి, పుత్తూరు ప్రాంతాల్లో వాడుకలో ఉంది. ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు మాతృలిపిగా చెప్పవచ్చు.

**ఆధునిక తమిళం :**

పాత తమిళం నుండి కొత్త తమిళం ఆవిర్భవించింది. ఈ లిపిలో రెండు రకాల అచ్చులు కలవు. అవి పొట్టివి మరియు పొడుగువి తమిళం సంస్కృతానికి భిన్నం అయినప్పటికీ కొన్ని ధ్వనులు ఆర్య లిపుల నుండి తీసుకోవడం జరిగింది. తమిళంలో 18 హల్లులు మాత్రమే ఉన్నాయి. గ్రంథలిపిలో సిక్కుల పదాలు రాయబడతాయి. తమిళ అన్న పదం తమిళ్ లేక ద్రావిడ అనే పదం నుండి ఉద్భవించింది.

**గుజరాత్ :**

గుజరాతి భాషకు సంబంధించిన లిపి గుజరాతి లిపి. ఈ లిపి నాగర లిపి నుండి వచ్చిందే. ఈ లిపిలో మనం రాసే కలమును పైకెత్తకుండా రాయవచ్చు. ఈ లిపి ప్రత్యేకత ఏమిటంటే నాగరి లిపిలో మాదిరిగా తలకట్టు లేదా అక్షరమునకు పైన ఉండే అడ్డుగీత ఉండదు. అన్నీ అడ్డుగీత గల అక్షరాలే ఉండవు. రకరకాలుగా ఉంటాయి. ఈ గుజరాతి లిపిని వేరే పేరుతో కూడా పిలుస్తారు అని గుర్జర్ లిపి అనీ వాణియా శా ఈ లిపి మరియు 'మహాజన లిపి' గుజరాతి అనే భాష మాట్లాడటం 13, 14 శతాబ్దాల్లో ప్రారంభమైంది. మొట్టమొదట ఈ లిపిని బ్రాడ్ రూళ్ళ పుస్తకంలో అడ్డుగీత కొట్టే అవసరం లేకుండా ఉండటానికి లైన్లు కింద అక్షరాలను రాసేవాళ్లు ఆ తర్వాత రోజుల్లో బ్రాడ్ రూళ్ళ అనే పద్ధతి పాటించడం లేదు. కానీ ఇప్పటికీ

లెక్కల పుస్తకాల్లో కొంతమంది ఈ పద్ధతిని పాటిస్తున్నారు. ప్రస్తుతం భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ఈ గుజరాత్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా చెప్పవచ్చు.

**మోడి :**

ఈ లిపి మహారాష్ట్రలో ఉద్భవించింది. ఈ మోడి లిపికి మూల కారకులు ప్రారంభకులు 'హేమద పంత్'. మద్రాసు, మైసూరు ప్రభుత్వాలు 19వ శతాబ్దంలో ఈ లిపిని ప్రభుత్వ కార్యకలాపాలను ఎన్నుకుంది. ఈ లిపికి సంబంధించిన రెండు శాసనాలు మరాఠికి సంబంధించినవి రాజస్థాన్‌లో లభించాయి.

**ముగింపు :**

ఆధునిక భారతీయ లిపులను పరిశీలించిన తర్వాత లిపులు ఎలాంటి మార్పులకు గురైయ్యాయి, ఇతర లిపుల ప్రభావంతో మిగతా లిపులలో ఏ విధంగా కలిసి పోయ్యాయి. మరికొన్ని లిపులు ఎలా అంతరించి పోయ్యాయి. ప్రస్తుతం ప్రమాదంలో ఉన్న లిపులు గురించి కూడా భాషావేత్తల పరిశోధనలు ద్వారా తెలుసుకోవచ్చు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న లిపులను, ప్రమాద దశలో ఉన్న లిపులను పరిరక్షించి భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. వ్రాతప్రతుల విజ్ఞానశాస్త్రం - డా॥. పాలెపు సుబ్బారావు.
2. గ్రంథ పరిష్కరణ విధానాలు - సంపాదకులు చిట్రాజు గోవిందరాజు.
3. భారతీయ గ్రంథ పరిష్కరణ ప్రవేశిక - డా॥. బూదాటి వెంకటేశ్వర్లు.
4. సారస్వత సంవీక్షణం - సంపాదకులు తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
5. శాసన పరిచయం - నాగోలు కృష్ణరెడ్డి.

★★★

# ప్రసార మాధ్యమాలలో జానపద సాహిత్యం

– కంజలి రాజేశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, షాద్‌నగర్.

జానపద సాహిత్యం అనేది ప్రజల స్వతంత్ర భావాలను, అనుభవాలను, నమ్మకాలను, నమ్మకాలను, సంప్రదాయాలను, గాథలను మరియు పాటలను ప్రతిబింబించే ఒక అనంతమైన సాహిత్య రూపం. ఇది సామాన్య ప్రజల జ్ఞానం, జీవనశైలి, అనుభవాలు, మరియు భావోద్వేగాల యొక్క సేకరణను కలిగి ఉంటుంది. జానపద సాహిత్యం పూర్వకాలం నుండి ప్రజల మనుసులకు చేరిపోయింది మరియు దీనిలో పాటలు, కవితలు, కథలు, నాటకాలు, ప్రసంగాలు వంటి అనేక రూపాలు ఉన్నాయి.

ప్రసార మాధ్యమాలు (ముఖ్యంగా టెలివిజన్, రేడియో, సినిమా, సాంఘిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ఫ్లాట్ ఫారములు) ఈ జానపద సాహిత్యానికి విస్తృతంగా సహాయం చేస్తున్నాయి. ఇవి జానపద సాహిత్యాన్ని సర్వసాధారణ ప్రజలకు చేరువ చేసే దాన్ని ప్రాచుర్యం పొందించే మరియు సంస్కృతికి వ్యాప్తి చెందే అవకాశాలను అందిస్తాయి.

## రేడియో :

రేడియో అనేది ఒక ముఖ్యమైన ప్రసార మాధ్యమంగా, జానపద సాహిత్యం ప్రజల ఇంట్లోకి చేరుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా మారింది. వివిధ రేడియో ప్రోగ్రాములు జానపద పాటలు, కథలు, నాటకాలు ప్రసారం చేస్తూ, ఈ సాహిత్య రూపాన్ని కాపాడుతూ ప్రజలకు సాహిత్యాన్ని అందిస్తున్నాయి.

జానపద సాహిత్యంలో ప్రజలు తమ అనుభవాలను, నమ్మకాలను, సంస్కృతి, ఆచార సాంప్రదాయాలను, వారి కట్టుబాట్లను అధికంగా ప్రాధాన్యతనిచ్చే సామాన్య ప్రజల జీవనశైలి, వారి జీవితాలను ఆధారమైన కళలు, నైపుణ్యాలు, విలువలు, అలంకారాలు, వారి యొక్క మాతృభాష మరియు వారి ప్రధానమైన వృత్తులు రాను రాను అంతరించిపోతున్న తరుణంలో ప్రసార మాధ్యమాల ద్వారా తిరిగి ప్రజలకు చేరువయ్యాయి. అనడంలో ఎలాంటి సందేహాలు లేవని నేడు అనేక రకాల ప్రసారం మాధ్యమాల ద్వారా జానపద సాహిత్యం మరింత విస్తృతంగా ప్రజలకు చేరువైందని తెలుస్తుంది. ఈ సమాచార ప్రసారం అనేది ముఖ్యంగా అన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా అనేక సమాచార మాధ్యమాల ద్వారా జరుగుతుంది.

**ఉదాహరణకు :**

రేడియో, టీవీ, టెలివిజన్, యూట్యూబ్, సినిమా రంగాలు, సాంకేతిక ప్రాథమిక మాధ్యమాలు, వార్తా పత్రికలు, మ్యాగజైన్ల ద్వారా, ఎన్నో దృశ్య వేదికల ద్వారా మనం నిత్యం చూస్తున్న మాధ్యమాలలో జానపద సాహిత్యం కనబడుతుంది. అందులో మొదటగా...

జానపద సాహిత్యంలో పాడుపు కథల్లో రేడియోను ఉదాహరణగా "ప్రచార ప్రసార సాధనాలకు మాటల పెట్టే అని పోల్చుతారు.

ప్రాచీన కాలంలో తొలుత పాటలను, కథలను సేకరించేవారు. వారు పాడిన పాటలను రాసుకోవడం ఇలా రాసుకోవడానికి చాలా కష్టతరమైనదని పాడే వారి ముందు కూర్చునే రాయడం. వారు పంక్తులను తిరిగి మళ్లీ పాడమని అర్థించడం చాలా ఇబ్బందికరమైనది. ఇలా కొన్ని ధోరణలతో ఇబ్బంది పడడం ఇలాంటివి జరుగుతున్న తరహాలో తర్వాత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక ఆ యొక్క పాటలని మాటలని రికార్డింగ్ చేయడం ప్రారంభించడం జరిగింది. అయితే వీటి చుట్టాలు పెద్దవిగా ఉండి రికార్డింగ్ పరికరాలు కూడా పెద్దవిగా ఉండడంతో వాటిని క్షేత్రాలకు మోసుకు పోవడంతో శ్రమతో కూడుకున్నవిగా ఇబ్బందిగాను, అనుకూలంగా లేనివిగా మారేవి. తర్వాత క్రమంలో క్యాసెట్లలో ఇమిడిపోవడం రికార్డింగ్ పరికరాలుగా పరిణామములు చిన్నవిగా మారడం జాపద సాహిత్య

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

సేకరణకు ఎంతో ఉత్సాహాన్నిచ్చేవి. ఇవి డిజిటల్ వాయిస్ రికార్డర్లు గుప్పెట్లో ఇమిడిపోయేంత చిన్న మాధ్యమాలుగా నేడు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. దీనితో నేడు జానపద సాహిత్యం ప్రసార మాధ్యమాల ద్వారా ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తున్నది.

**టెలివిజన్ :**

టెలివిజన్ కూడా జానపద సాహిత్యాన్ని ప్రోత్సహించే ఒక ప్రధాన వేదికగా ఉంది. టెలివిజన్ సీరియల్లు, డాక్యుమెంటరీలు మరియు ప్రత్యేక కార్యక్రమాలు జానపద సాహిత్యాన్ని ప్రదర్శించడానికి ఉపయోగపడు తున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత ప్రదర్శనలు, జానపద కథనాలు వీటి ద్వారా ఎక్కువ మంది ప్రజల వరకు చేరుకుంటాయి.

**జానపద సాహిత్యంపై టెలివిజన్ ప్రభావం :**

ఆ రోజుల్లో టెలివిజన్ అందుబాటులో లేదు. మనిషికి కావాల్సిన అవసరాలలో కూడు, గుడ్డ, గూడు (ఇల్లు) ఎంత ప్రధానమైనదో నేడు టెలివిజన్ కూడా సాధారణ ప్రజానీకానికి సైతం అత్యంత ప్రధానమైనది. దృశ్య రూపంలో సమాజంలో జరుగుతున్న అనేక విషయాలు తెలుసుకోవడానికి, విలువైన సాంకేతిక వినోదాలను ఆనందంగా పొందడానికి నిత్యజీవితంలో ఒక భాగమైనది. ఈ పరిణామం సామాజిక జీవితం పైన, జానపద సాహిత్యం పైన తీవ్రంగా ఉంది. టెలివిజన్ అందుబాటు లోకి వచ్చిన తర్వాత జానపద కళలను చూడటానికి వచ్చే గ్రామీణ సంఖ్య చాలా అరుదుగా మారింది. టెలివిజన్ ప్రభావంతో జానపద సాహిత్య ప్రదర్శనలు దృశ్య రూపంగానూ, శ్రవణరూపంలోను, సంగీత ప్రదర్శనల ద్వారా కథల ద్వారా ఎక్కువ ప్రచారం కార్యక్రమాలను ఈ సాంకేతికతతో ముందుకు వస్తూ ప్రజల దృష్టిని మళ్ళించాయని మనం గుర్తించవచ్చు. దీని ప్రభావంతో జానపద సంస్కృతి సాంప్రదాయాలను పోలుస్తూ లెక్కిస్తూ గణనీయతను తెలుసుకోవచ్చు.

**సినిమా :**

సినిమాలు కూడా జానపద సాహిత్యాన్ని ప్రజల్లో ప్రాచుర్యం పెంపొందించేందుకు ఒక ప్రముఖ వేదిక. అనేక తెలుగు చిత్రాలలో జానపద కథలు, పాటలు మరియు పాత్రలు అనేక తరాల ప్రజలను ఆకట్టు కున్నాయి. ఈ సినిమాలు జానపద సాహిత్యాన్ని కాపాడటానికి, అదే సమయంలో ఆరాధన చేసేందుకు దోహదపడుతున్నాయి. ఇటీవల తెలుగు సినిమాలలో వచ్చిన జానపద గేయాలు ఆయా చిత్రాలు :

ఉప్పెన ఈ సినిమాలోని సిలక సిలక గోరింక లి పాట పల్లకీ సంప్రదాయం మరియు జానపద సంగీత శైలిని కలిగి ఉంటుంది. ఈ చిత్రానికి అంతర్జాతీయంగా మంచి స్పందన లభించింది.

**సినిమా మాధ్యమాలతో ప్రభావం :**

ఇటీవల సినిమా మాధ్యమికంలో జానపద భాష వేషధారణ చాలా ఆకట్టుకుంటూ ఆనాటి బొమ్మల నాటకీయత నేపథ్యంగా తీసుకుని దానికి అనుగుణంగా వచ్చిన ఆధునిక నాటకీయతలోని భాగమే ఈనాటి సినిమా ప్రాపంచీకరణగాను గుర్తించవచ్చు.

జానపదల వినోదం కొరకు చిందు భాగోతం యక్ష గనాలు, వీధి భాగోతం, ఒగ్గు కథ వంటి కళారూపాల ప్రదర్శనకు వెళ్లేవారు. చూసి ఆనందించే రోజులు పోయి మారుతున్న కాలానుగుణంగా జానపద సాహిత్యంలో సినిమా రంగానికి దగ్గరగా చేరువైంది.

**ఉదాహరణకి :**

"డబ్బులు ఇస్తా తీసుకో అబ్బీ
నువ్వు కాళహస్తిలో దిగబ్బీ
ఆ బెంచ్ మీద కూర్చోబ్బీ
ఆ బొమ్మ వచ్చి ఆడేటప్పుడు
నన్ను తలచుకొని నవ్వబ్బీ"

ఇలాంటి జానపదుల పని పాటలు వేదిక పాటలు సాంకేతిక పరిజ్ఞానంతోటి క్యాసెట్ల రూపంలో సినిమాలోకి ప్రవేశిస్తున్నాయి.

**సాంఘిక మాధ్యమాలు :**

ప్రస్తుతం, సాంఘిక మాధ్యమాలు (ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్) ద్వారా జానపద సాహిత్యం మరింత ప్రాచుర్యం పొందింది. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్

వంటి ఫ్లాట్‌ఫారమ్లలో జానపద కవితలు, పాటలు, వీడియోలు శీఘ్రంగా వ్యాపించగలుగుతున్నాయి. యూట్యూబ్‌లో జానపద సంగీతం, పాటలు, నాటకాలు, కథలు ప్రచారం చెందుతున్నాయి.

**వ్యవసాయ జీవన పాటలు :**

ఇప్పటికీ వ్యవసాయం, దాని విశిష్టత, రైతుల జీవన విధానం, కష్టనష్టాల గురించి పాటలు రచిస్తున్నారు. కవులు, ఎస్.వి. మల్లిక్ అనే వర్తమాన కవి రాసిన పాటను పరిశీలిస్తాను.

ఏమే పిల్ల యెంకటి - ఎంతసేపాయే దున్నవట్టి
అగ్గజాము దాటిపోయే తేనే దేవాయే సద్దిగట్టి
ఆగలేవు పెనిమిటి అన్న మండుతున్న పొయ్యంటువెట్టి
కైకొలాల్లను తోలుకొని రానెవడితి తొవ్వవట్టి

ఈ పాట తెలంగాణ మాండలికంలో రాసింది. భర్త భార్యల మధ్య జరిగిన సంభాషణాత్మకంగా రాసింది. మట్టితో మనిషికి ఉన్న సుట్టరికం తెలియజేస్తుంది పాట.

**బతుకమ్మ పాటలు :**

యూట్యూబ్లో చాలా ప్రచారం పొందిన పాటలల్లో బతుకమ్మ పాటలు. ఇవి పూర్తిగా తెలంగాణ ప్రజల జీవనాన్ని దృశ్యమానం చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ప్రజలల్లో చైతన్యం తీసుకొచ్చిన పాటలు బతుకమ్మ పాటలు, మిట్టపల్లి సురేందర్ తెలంగాణ ఉద్యమకవి ఎన్నో పాటలు రాసి పేరు పొందినాడు.

**ఆయన బతుకమ్మ పాట :**

ఓ..... ఓ ఆ సింగిడితో రంగులనే దూసి తెచ్చి దూసి తెచ్చి
తెల్లా చంద్రుడితో వెన్నెలలే తీసుకొచ్చి
వచ్చి తంగడితో గుమ్మడి పూలు చేర్చి
బంగారు బతుకమ్మను ఇంటిలో పేర్చి
ఆడబిడ్డల అరచేతులనే ఊయలకట్టి
వాడ వాడలకు ఉత్సవాన్ని మోసుకొచ్చి
పువ్వులను పూజించే పండుగ తెచ్చె
.........................

ఈ పాటను ప్రముఖ గాయని మంగ్లీ పాడింది. ఈమె గిరిజన మహిళ, చాలా తక్కువ కాలంలో ఎక్కువ పేరు తెచ్చుకున్న గాయని.

**సామాజిక సమస్యలు - పాట :**

యూట్యూబ్లో అనేక సమస్యలపై పాటలు ఉన్నాయి. యువకవులు, గాయకులు చాలా వైవిధ్యభరితంగా పాటలు సిద్ధం చేశారు. ఈ మధ్యకాలంలో ముఖ్యంగా ఆడపిల్లలపై, మహిళల అత్యాచారాలు, హత్యలు పెరిగి పోయాయి.

కళాశాలల్లో ర్యాగింగ్ పేరిట జరిగిన అవమానాల్లో ఆత్మహత్యలు పెరిగాయి. ప్రేమ హత్యలు పెరిగాయి. కులాంతరాల ప్రేమల కారణంగా కూడా హత్యలు పెరిగాయి. ఇలాంటి సమస్యలపై కూడా పాటలు వచ్చాయి. మిట్టపల్లి సురేందర్ రాసిన పాటను పరిశీలిస్తాను.

అమ్మా మా కళాశాల కామాందుల నిలయమయ్యే
ఆడపిల్లగు జన్మనెత్తుట మహా శాపమయ్యే
గడపదాటి ఒక అడుగు వేస్తే గుండెల్లో వణుకు పుట్టే
గులాబీలతో వెంటపడుతూనే ఆకతాయిలచ్చే...

ఈ పాటను లలిత, ప్రసాద్‌లు పాడారు.

**ఆన్‌లైన్ సాహిత్య పఠనం :**

అన్‌లైన్ పుస్తకాలు, డిజిటల్ ఆర్కైవ్‌లు, వెబ్‌సైట్లు జానపద సాహిత్యాన్ని సేకరించి, పలు భాషల్లో అనువదించి, అందుబాటులో ఉంచుతూ ఒక గొప్ప విస్తరణ చేస్తున్నాయి. ఇలాంటి ఆన్‌లైన్ వేదికలు జానపద, సాహిత్యానికి పునరుజ్జీవనాన్ని కలిగిస్తున్నాయి.

తెలంగాణలో నేడు ఎన్నో జానపద గేయాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఉదాహరణగా అందులో "ఒక గేయాన్ని పరిశీలిస్తే "రేడిగుంట రామిరెడ్డి" పైన పాట కట్టిన వస్తువు మారినప్పటికీ జానపదుల పాటల్లో నడక మారదు. ఉయ్యాల పాటకు విప్లవ సంస్కృతిని జోడిస్తూ రాసిన పాటలు సినిమా పాటల్లోకి మళ్ళాయి.

సినుకు సినుకుల వాన ఉయ్యాలో

సీతారి వాన ఉయ్యాలో
గంగాదారిలోన ఉయ్యాలో
ఉన్నోడి లోగిళ్ళ ఉయ్యాలో
పన్నీటి వాన ఉయ్యాలో
లేనోళ్ల లోగిళ్ళ ఉయ్యాలో
కన్నీటి వాన ఉయ్యాలో (అల్లం వీరయ్య గారు) ఈ
పాటను కట్టారు.

ఈ పాటలో సినకు సిత్తారి, గంగా దారి బంగారి, ఉన్నోడి - పన్నీటి ఇటువంటి చోట్ల చేర్చిన ప్రాసయతులు జానపద గీతాలు కూడా ఉంటాయి గాని అవి అనివార్యం కాదు జానపదాన్ని ఉన్నతీకరించే క్రమంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కొంతదూరం పాట నడిచాక మళ్ళీ సినుకు చినుకుల వాన - సిత్తారి వాన పల్లవించడం జరుగుతుంది.

**జానపద సాహిత్యానికి ప్రాముఖ్యత :**

ప్రసార మాధ్యమాలు జానపద సాహిత్యాన్ని సంస్కృతి, ఆచారం మరియు భవిష్యత్తు తరాల కోసం కాపాడటం ద్వారా దాని విలువను మరింత పెంచుతున్నాయి. ప్రజల ఆలోచనలను, భావోద్వేగాలను, సమాజంలోని అంతర్గత సంస్కృతిని జానపద సాహిత్యం ప్రతి బింబిస్తుంది.

**ముగింపు :**

ప్రసార మాధ్యమాల జానపద సాహిత్యానికి విస్తృత వేదికను అందిస్తున్నాయి. ఇవి సాహిత్యాన్ని సంప్ర దాయంగా మాత్రమే కాకుండా ఆధునిక రూపంలోనూ ప్రజల వద్దకు తీసుకెళ్లుతున్నాయి. జానపద సాహిత్యాన్ని రక్షించడమే కాకుండా, ఇది ప్రాచుర్యం పొందడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జానపద సాహిత్యం - సాంస్కృతిక పరిమాణం - డా॥. పి.సి.ఆర్. స్వరూప.
2. సంగీతం జానపద సాహిత్యం - సినిమాలు - చింతకవి సత్యనారాయణ.
3. ప్రసార మాధ్యమాలు జానపద సాహిత్యం - డా॥. జె.వెంకటేశ్వర్లు.
4. సాంఘిక మాధ్యమాల ప్రభావం - ఎం.ఎల్. భవాని శంకర్.
5. ప్రసార మాధ్యమాల అభివృద్ధి - డా॥. పి. సూర్యనారాయణ.
6. తెలుగు మీడియా చరిత్ర - సురేష్ కొల్లూరు.
7. యూట్యూబ్, చలన చిత్రాల నుండి జానపద పాటల సేకరణ.

★★★

# కందుకూరి 'రాజశేఖర చరిత్ర' నవల విశ్లేషణ

- గంధం రోజమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు, కర్నాటక.

## సంక్షిప్త పరిచయం :

ఆధునికాంధ్ర సాహిత్య ప్రపంచంలో నవ్య కవిత్వానికి బాటలు వేసి, సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టి, అంధ విశ్వాసాలతో, మూఢ నమ్మకాలతో ఎగసిపడుతున్న కుల తత్వ, మతతత్వ కీళ్ళలను, ఛాందస భావజాలాలను ఆపడానికి తన కలాన్ని ఆయుధంగా మలిచి, సామరస్య సంఘీభావాలతో, రుగ్మతలు లేని సమసమాజ నిర్మాణా నికి అహర్నిశలు శ్రమించి, తన దేహాన్ని, ధనాన్ని, చివరకు జీవితాన్ని కూడా జగతికోసం ధారపోసిన ఘనుడు కందుకూరి వీరేశలింగం శ్రమించి, తన దేహాన్ని, ధనాన్ని, చివరకు జీవితాన్ని కూడా జగతికోసం ధారపోసిన ఘనుడు కందుకూరి వీరేశలింగం పంతులు. అందుకే ఆయనకు ఆధునిక ఆంధ్ర సమాజ పితామహుడని, నవయుగ వైతాళికుడని పేర్లు కలవు.

నవలాకారుడుగా, నాటకకర్తగా, కవిగా, వ్యాసకర్తగా, స్వీయచరిత్ర రచయితగా, జీవిత చరిత్ర రచయితగా, అనువాదకుడిగా, పరిష్కారకర్తగా, హేతువాదిగా, మానవతావాదిగా, ఉద్యమకారుడిగా, స్త్రీ జనోద్ధర కారునిగా సంఘసంస్కర్తగా, కార్యశీలుడుగా, వ్యాసకర్తగా, నిత్యపరిణామశీలుడుగా, విమర్శకుడిగా, ఉపన్యాస కుడుగా, పత్రికా సంపాదకుడిగా, పత్రికా సంపాదకుడిగా, పత్రికా వ్యవస్థాపకుడుగా, ఇలా ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించారు కందుకూరి వీలేశలింగం.

**ముఖ్యాంశాలు :**

నవల, స్త్రీ సమయస్ఫూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు, సంఘ సంస్కరణ, మూఢనమ్మకాల వ్యతిరేకత.

## కందుకూరి జీవిత విశేషాల సంక్షిప్త పరిశీలన :

కందుకూరి అంటేనే ఒక సంఘ సంస్కరణకు చిరునామా. ఒక ఆదర్శ సంస్కర్తకు ప్రత్యేక నూతన ప్రక్రియలకు ఆదర్శం. యువ చైతన్యానికి నిదర్శనం. సమసమాజ స్థాపనకు సామాజిక మార్పులకు సామాజిక పునరాభివృద్ధికి, జీవితాన్ని ధారబోసిన వారిలో కీర్తి భాస్కరుడు కందుకూరి వీరేశలింగం పంతులు. 1848 సంవత్సరంలో రాజమహేంద్రవరంలో ఏప్రిలు 16న పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. చిన్నతనం నుండి సాహిత్యం అంటే మక్కువ.

1853లో వీరేశలింగంకి అక్షరాభ్యాసం జరిగింది. 1861లో రాజ్యలక్ష్మమ్మతో వివాహం జరిగింది. 1868 - 69లో మార్కండేయ శతకం, గోపాల శతకం అను రెండు శతకాలను రచించారు. 1870లో పాఠశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. 1871లో రాజమహేంద్రవరంలో మండల పాఠశాలలో సహ ఉపాధ్యాయునిగా పనిచేశారు.

1874లో ధవళేశ్వరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయు లుగా అష్టావదానం చేశారు. అదే సంవత్సరం బాలిక పాఠశాలను ధవళేశ్వరం స్థాపించారు. 1879 ప్రార్ధన సమాజం స్థాపించారు. 1881 డిసెంబర్ 11న ప్రథమ వితంతు వివాహం జరిపించారు. 1879 ప్రార్ధన సమాజం స్థాపించారు. 1881 డిసెంబర్ 11న ప్రథమ వితంతు వివాహం జరిపించారు. 1893లో రావు బహద్దూర్ బిరుదును పొందారు. 1897-98లో వితంతు శరణా లయం స్థాపించారు. 1906లో హితకారిణి సమాజం స్థాపించారు. 1910లో కందుకూరి భార్య రాజ్యలక్ష్మమ్మ మరణించారు. 1917లో ఆంధ్రుల కవుల చరిత్ర మొదటి ముద్రణ.

## నవల - ప్రస్తావన :

ఒక దశ నుండి మరియొక దశకు, ఒక స్థితి నుండి మరియొక స్థితికి మునుజుడు, వ్యవస్థ, దేశం పొందు తున్న పరిణామం, అది భవిష్యత్తుపై చిత్రింపగల ముద్ర సాంఫల్యముగా చర్చించి రచింప వీలగు సాహితీ ప్రక్రియ నవల - కొలకలూరి ఇనాక్ 'నవల' అన్న పదం ఆంగ్లంలోని 'నావెల్' అనే పదానికి పర్యాయపదంగా తెలుగులో

వాడబడుతుంది. కాల్పనిక కథా సాహిత్యమంతా నవల ప్రక్రియగానే వాడబడుతుంది. నవల అనే ప్రక్రియ ఆధునిక సాహిత్యంలో ఎక్కువగా వ్యాపించిన ప్రక్రియ. నవల వల్ల ప్రధానంగా మనకు కథాక్రమం, కాలక్రమం తెలుస్తాయి. పింగళి సూరన రచించిన కళాపూర్ణోదయంలో సరిగ్గా ఇదే జరిగింది. ఆధునిక కాలంలో తెలుగు నవల ప్రక్రియ ప్రవేశించిన తర్వాత కళాపూర్ణోదయంపై ఆసక్తి పెరిగింది. అని అట్టమీద వేసిన ప్రచురణ కూడా ఒకటి వుంది. తెలుగు నవల అని పిలువబడుతున్న ఈ ప్రక్రియను గుజరాతీలో 'నవల్ కథా' అనీ, మరాఠీ, కన్నడ భాషల్లో 'కాదంబరీ' అని, బెంగాలీ, హిందీలలో 'ఉపన్యాస్' అనీ పిలువబడుతుంది. 'నవల' అన్న పదంలో ఆంగ్లపదం 'నావెల' అన్న పదానికి 'కొత్తది, వినూత్నమైనది' అనే అర్థం వుంది. ఈ నవలా ప్రక్రియకు మనవారు చేసిన తొలి నామకరణం 'వచన ప్రబంధం'. క్రీ.శ. 1872లో శ్రీ నరహరి గోపాలకృష్ణమశెట్టి తమ 'శ్రీరంగరాజ చరిత్ర' నవలను 'నవీన సంబంధము' అని అన్నారు.

మానవ జీవితాన్ని సమగ్రంగా చిత్రించగల సాహిత్య ప్రక్రియ నవల అని చెప్పవచ్చు. నవలలో భిన్న తరగతులకు చెందిన మానవ ప్రవృత్తుల వ్యక్తీకరణకు అవకాశం ఉండదనే కాకుండా, జాతీయ అంతర్జాతీయ రంగాల్లోని సాంఘిక, ఆర్థిక రాజకీయ, కళ, సంస్కృతి సంబంధాలైన అన్ని విషయాలు చోటుచుసుకుంటాయి. అందువల్లనే నవలను " " అని అంటారు.

## 'రాజశేఖర చరిత్ర' నవల విశేషాలు :

గోదావరి నది తీరాన ధవళేశ్వరం అనే గ్రామంలో రాజశేఖరుడు అను గృహస్థుడు కలడు, అన్ని రోజుల్లోగే ఆ రోజు తెల్లవారింది. పొద్దుపొడుపులే ఎండలో చెట్ల చిటూరు కొమ్మలు, ఆకులు బంగారు నీరు పోసినట్లు మెరుస్తున్నాయి. గొడ్లకాడ పిల్లలు చద్దిమూటలతో పశువుల్ని తోలుకుంటూ పచ్చిక బైళ్ళకు పోతున్నారు. రైతులు పశువులకు తోలుకుంటూ పొలాలకు సాగారు. రాజశేఖరుడు జందెం సవరించుకుంటూ, ఎడం చేత్తో ఇత్తడి చెంబు పట్టుకుని, గోదావరి కాళ్ళు చేతులు కడుక్కుని, ఒడ్డెక్కి పుక్కిలించి సత్రంవైపు నడిచాడు. రాజశేఖరుడిది నడిమి వయస్సు, నలభై ఉండవచ్చు. ఆయన భార్య మాణిక్యాంబ, కొడుకు సుబ్రహ్మణ్యం 16 సంవత్సరాలు, ఇద్దరు కుమార్తెలు వారిలో రుక్మిణికి 14 సంవత్సరాలు, సీతకి 7 సంవత్సరాలు. రాజశేఖరుడు పొగడ్తలకి పొంగి పోయే వ్యక్తి అది ఆసరాగా చేసుకొని నలభై తరాలు గడిపోయినను తమ బంధుత్వాన్ని పొందుతుంటారు. ఊరిలో ఉన్న పెద్ద మనుషులు పరిచితులైనవారు కూడా రాజశేఖరుడి ఇంటిలో వంటా బాగా రుచికరంగా ఉంటుంది పొగుడుతూ నెలలో సగం దినములు వారి ఇంటి భోజనం చేసేవారు వారి పొగడ్తలకు పొంగిన రాజశేఖరుడు బంధువులు వచ్చినప్పుడల్లా పిండివంటలు, క్షీరన్నము మొదలైన వంటలు చేయించి బంధువర్గం ఊరి పెద్దల మెప్పుపొందాలని చూసేవారు. నిత్యము యాచకులు వారింటికి అసంఖ్యాకములు. ఆనాడు స్త్రీలు చదువుకునే ఆచారం లేదు. అయినా రాజశేఖరుడు తన కుమార్తెమీద ఉన్న ప్రేమతో తానే చదువు చెప్పాడు. కొత్త పుస్తకాల్ని స్వయంగా చదివి అర్థం చేసుకునే శక్తి వచ్చే వరకు విద్యాసాధన చేయించారు.

రాజశేఖరం బావమరిది దామోదరయ్య. రాజశేఖరం చెల్లెల్ని దామోదరానికి ఇచ్చి పెళ్ళి చేశారు. ఆమె ఒక కొడుకుని కని కాలం చేసింది. ఆమె కొడుకు పేరు శంకరయ్య పదిహేను సంవత్సరాలు. రాజశేఖరం రెండోవ కుమార్తెయైన సీతను శంకరానికి ఇచ్చి పెళ్ళి చేయాలనుకున్నారు. దామోదరయ్య పరమ దగాకోరు. రాజశేఖరం పేరు చెప్పి ఇరుగు పొరుగు వారి దగ్గర అప్పులు చేసేవాడు. ఆ అప్పులు రాజశేఖరే తీర్చేవాడు. బావగారి సహాయంతోనే రెండవ వివాహం చేసుకున్నాడు. తర్వాత కూడా దగా పనులు మానలేదు. ఇంటి నుంచి పారిపోయి పెద్దమంత్రగాడిలా వేషం వేసుకొని డబ్బు సంపాదించేవాడు.

రాజశేఖరుడి పెద్దకుమార్తె రుక్మిణికి వివాహమైనది కానీ ఆమె భర్త నృసింహస్వామి ఊరి విడిచివెళ్ళిపోయాడు. అప్పటి నుంచి రుక్మిణి భర్తపై విచారంతో మబ్బు తెరలుగా మనస్సును కమ్మి వేసింది. జనార్ధన స్వామికి కల్యాణోత్సవం రానేవచ్చింది. ఆ ఉత్సవం

చూడటానికి చుట్టుప్రక్కల ఊరిజనంతో నిండిపోయింది. రథోత్సవానికి తల్లితో వెళ్లిన రుక్మిణి మెడలో కాసులపేరు దొంగిలించబడుతుంది. ఇంతలో దేశాంతరం వెళ్లిన రుక్మిణి భర్త మరణించాడు అని వార్త తెలుస్తుంది. దాంతో రుక్మిణి బెంగతో చిక్కిపోయి అనార్యోగం పాలయింది, రుక్మిణి ఆరోగ్యం బాగు చేయాలని భూతవైద్యాలతో సహా ఎన్నో రకాల వైద్యాలు చేయిస్తారు. వెంటనే రాగిని బంగారంగా మార్చే విద్య తెలుసునని చెప్పిన భైరాగి మాటలు అమాయకంగా నమ్మి ఇంటిలో ఉన్న వెండి, బంగారం, ధనం అంతటిని బైరాగికి అందజేస్తారు. రాజశేఖరం, ఆ వెండి బంగారం డబ్బును తీసుకొని భైరిగి పారిపోతాడు.

ఆనాడు భర్తని కోల్పోయిన యువతుల జీవితం నరకప్రాయం. కడుపున పుట్టిన కూతురయినా జాలి లేకుండా కనీసాలంకారాలకు సైతం దూరంచేసి, తల వెంట్రుకలు తీయించి కురూపిణిని చేసి మూలన కూర్చుని పెట్టేవారు. రెండుపూటలా కడుపునిండా తిండి పెట్టకుండా కడుపుమాడ్చే వాళ్లు. ఒక్కమాటలో చెప్పాలంటే వితంతువులు అంటే జీవచ్ఛవాలు బ్రతికివున్న శవాలు.. ఇలాంటి పరిస్తితులను గమనించిన కందుకూరి వారే మొదటి వితంతు వివాహం చేశాడు. రాజశేఖరం దివాళా తీశాడు. ధనమే ఆపదలన్నింటికి మూలం అనే వేదాంతాన్ని చదివేటప్పుడు ఇంకా రాజశేఖరంకి పూర్వ వైరాగ్యం పూనేది. పేదరికంలో ఔన్నత్యం ఉన్నట్లు అని పించింది. అనుభవం మీదగాని తత్త్వం బోధపడలేదు. సంపద ఉన్నప్పుడు ఆయన్ని ఇంద్రుడు చంద్రుడు అని ఆకాశానికి ఎత్తినవాళ్లే ఈనాడు మొహం చాటేస్తున్నారు. పుండుకు పుల్ల గుచ్చుకున్నట్లు చెల్లెలు సుబ్బమ్మ అనారోగ్యంతో మరణిస్తుంది.

ఈ విధంగా మితిమీరిన దానధర్మాలు అమాయత్వంతో ఇంటిలోని బంగారం, వెండి అంతటిని పోగొట్టుకోవడంతో రాజశేఖరుడు క్రమేపి పేదవాడుగా మారిపోయాడు. అంతవరకు చుట్టూ చేరి భజనలు చేసిన వారు, నెలల తరబడి రాజశేఖరుడు ఇంటిలో కూర్చుని విందు భోజనాలు చేసిన వారే ఆయన మొహం కూడా చూడటానికి ఇష్టపడట్లేదు, పలకరించేవారు కరువై పోయారు, అప్పులు తీర్చమని ఒత్తిడి చేయసాగారు. రాజ శేఖరుడు తన గృహాన్ని తాకట్టు పెట్టి కొంత సొమ్ము అప్పులు తీర్చి మిగిలిన సొమ్ముతో కుటుంబంతో సహా కాశీయాత్రకు బయలుదేరుతాడు. దారిలో అనేక కష్టనష్టాలకు గురై కాశీయాత్ర చేయలేకపోతాడు. మధ్యలో నల్లచెరువు అనే చోట రాజశేఖరుడు దొంగల బారిన పడతాడు, అంతకుముందు దాహం తీర్చి కాపాడిన రామరాజు రాజశేఖరం కుటుంబాన్ని రక్షిస్తాడు. గోటిచుట్టు మీద రోకటిపోటులా దొంగల దాడిలో రుక్మిణి తలకు బలంగా గాయం కావడం వలన స్పృహ తప్పిపోతుంది. భయంతో రుక్మిణి మరణించింది అని అనుకొని చీకట్లో ముందుకి సాగి భీమవరం చేరుకున్నారు. అక్కడ బంధువుల వలన సహాయం లభించదు. కొడుకుని ఏదైనా ఉద్యోగం చేసుకోమని పిఠాపురం పంపిస్తారు. బంధువైన శోభనాద్రి వంచన స్వభావంతో తన కుమారుడికి సీతని ఇచ్చి వివాహం చేయలేదనే కోపంతో రాజశేఖరాన్ని చెరసాల నుండి విడుదల చేస్తారు. రాజశేఖరం ఇళ్ళు చేరగా మరణించినదనుకున్న రుక్మిణి రాజశేఖరం కంటపడుతుంది. అడవిలో జరిగిన సంగతి వివరిస్తుంది. సుబ్రమణ్యానికి రాజు దగ్గర ఉద్యోగం దొరుకుతుంది. మరణించాడు అనుకుంటున్న రుక్మిణి భర్త తిరిగివస్తాడు. మునుపటివలె పొగడ్తలకి పొంగి పోకుండా రాజశేఖరుడు అనుభవజ్ఞుడవంతో నవల సుఖాంతం అవుతుంది.

**ముగింపు :**

కందుకూరి వీరేశలింగంచే రచింపబడ్డ రాజశేఖర చరిత్రను మనం పైన చదువుకున్నాం. మంచి సాహిత్యం సమాకలీన జీవన స్థితిగతులను సంస్కృతిని ప్రతిబింబిం చడమే కాక ఆలోచింపచేస్తుంది. నిన్నటి నుంచి నేడు నేటి నుంచి రేపు ఉద్భవిస్తున్న పోరాటం వంటిది నేటి యువతరం తామేమిటో, తమ జాతి గతం ఏమిటో, సంస్కృతి వైభవం ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కందుకూరి లాంటి మహానుభావులు ఎన్నో గొప్ప గొప్ప రచనల ద్వారా ముందుచూపుతోనే

స్త్రీ చైతన్యవంతురాలు కావాలని, సమాజంలో స్త్రీ విద్యావంతురాలు కావాలని ఎంతో కృషి చేశారు. చదువు నేర్చుకున్న స్త్రీ ప్రపంచం నలుమూలల జరుగుతున్న మార్పులను గమనించి తదనుగుణంగా తాను పురుషునితో సమానంగా సమాభివృద్ధిలో పాలుపంచుకోగలుగుతుంది. సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే పురుషుని భాగస్వామ్యంతో పాటు స్త్రీ భాగస్వామి అనివార్యమని వీరేశలింగం అభిప్రాయపడ్డారు. ఆ కాలంలో స్త్రీ విద్య వల్ల ఎంతటి దీనస్థితిలో ఉందో తన జీవితాన్ని ఎంతగా బానిసత్వంలోకి దిగజార్చుకుందో కుటుంబాన్ని, సంఘాన్ని ఎంతటి నరకప్రాయం చేసిందో వీరేశలింగం ఆవేదన వ్యక్తం చేశారు.

రాజశేఖర చరిత్ర నవలలో రాజశేఖరుడు అనే పాత్ర ద్వారా వీరేశలింగం సమాజంలో ఎలా బ్రతకాలి, లేనిపోని దర్జా డాబులకి పోవడం వలన ఎలాంటి కష్టాలు ఎదురవుతాయో తెలియజేశారు. రాజశేఖరం ఇల్లు ఆయన దర్జాతనం, ఆయన అతిథి సేవ, బీరకాయ పీచు వంటి చుట్టరికాన్ని కలుపుతూ, తిండికి ఎగబడి వచ్చే వాళ్ళు, ఎవరు నిజమైన బంధుత్వాని కలుపుకోలేదు వారి వారి స్వార్థపు బుద్ధి కొరకు బంధాలు, బంధుత్వాలను కలుపుకుంటారు అని చివరకి రాజశేఖరంకి తెలిసి వచ్చింది. ఇది నేటి సమాజానికి అన్వయించుకోవాలి, ఎవరు నిజమైన బంధువులు, ఎవరు నిజమైన స్నేహితులు అటువంటి పవిత్రమైన బంధాలు పేర్ల ముసుగులో మనల్ని దోచుకుంటున్నారో తెలుసుకోవాలి అని కందుకూరి వారు తెలియజేశారు. కూడా దయ్యాలు, భూతాలు ఉన్నాయని నమ్మడం యుద్రకుల్ని ముడు బంగారు చేసే విద్య మీద భ్రమలు పెంచుకున్నాడు, దివలా తీసి ఎదురుదెబ్బలు తిన్నాడు. అప్పుడు జీవితం పాఠశాల అయ్యింది, అనుభవాలు గుణపాఠాలు అయ్యాయి, మూఢనమ్మకాలని మనసులోంచి పెకిలించి వేశాడు. ఇంకా నేటి సమాజంలో కూడా ఈ మూఢనమ్మకాలు కలుపు మొక్కల్లా అక్కడక్కడ వ్యాప్తిలోనే ఉన్నాయి, పితంతు ఎదురుపడితే చెడు జరగుతుందని పిల్లి ఎదురు వస్తే మంచిది కాదని ఇటువంటి మూఢ నమ్మకాలు అప్పటి సమాజంలో విస్తృతంగా ప్రచారంలో ఉండేవి. ప్రజలయొక్క మూఢత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు స్వార్థపరులు నేటికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించుకొని లబ్దిపొందుతున్నారు. ప్రజల్లోనే అవిద్య ఇటువంటి మూఢ విశ్వాసాల కారణంగా కనిపిస్తుంది.

**రుక్మిణి :**

చిమ్మచీకటి అసలే అడవి క్రూరమృగాల అరుపులు జారిపోయే గుండె ఆకలి బాధ, ఒంటరితనం, తలమీద గాయం ఒకటే సలుపు దిక్కులేని దీనస్థితిలో రుక్మిణి ఉన్న, కొంత విద్య నేర్చిన స్త్రీ సమయస్ఫూర్తిలో తనను కాపాడు కోవాలని మగవేషం ధరించుకొని అడవిలోని క్రూరమృగాల నుంచి సమాజంలోని మగ మృగాల నుంచి తన్ను తాను రక్షించుకోవడం చూస్తాం.

ఒంటరిగా ఉన్న ఓ స్త్రీ ఎటువంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందో గ్రహించి, తిరిగి తల్లిదండ్రుల దగ్గరకు చేరడాన్ని గమనించినప్పుడు, స్త్రీ విద్య అనే ఆయుధాన్ని ధరించి తాను ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలను, శ్రమలను, అవమానాలను, నిందలను అన్నింటిని ఎదిరించి ముందుకు సాగాలని ఆనాడే వీరేశలింగం స్త్రీ విద్య అనే ఆయుధానికి పదును పెట్టాడు. నేడు అది ఎంతో విస్తృతంగా వాడబడుతుంది. నేటికి కూడా స్త్రీ విద్య పట్ల అవగాహనలేని వారు లేకపోలేదు. 'ఆడపిల్ల చదువు అవనికి వెలుగు' అనే మాటలు స్కూళ్ళ గోడలకే పరిమితం చేయకుండా, ఆ వెలుగును వారి వారి ఇళ్ళల్లో వెలిగించుకోవాలో వారి తల్లిదండ్రులకు తెలియజేయాలి, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, కందుకూరి లాంటి వారు స్త్రీ విద్య కొరకై ఎంతగా పోరాడారో పాఠశాల నుండే తెలియజేసి, ఏ ఏ ప్రాంతాల్లో అమ్మాయి చదువులు వెనుకబడి ఉన్నాయో, ఏ కారణం చేతనో తెలుసుకొని ఆయా ప్రాంతాలకు ప్రభుత్వాలు కమిటీలను ఏర్పాటు చేసి, వారి తల్లిదండ్రులకు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు ఏ విధంగా సంతోషంగా ఉన్నాయో తెలపాలి, పాఠశాల, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సదస్సులు జరగాలి.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కాని, మంచి పుస్తకం కొనుక్కో"

భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు నవల (1975) - అక్కిరాజు రామాపతిరావు.
2. తెలుగు నవలలో సామాజిక చైతన్యం - డా॥. పి. సంజీవయ్య.
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య.
4. తెలుగు నవలా వికాసం - పుల్లాబోట్ల వేంకటేశ్వర్లు.
5. తెలుగు నవల నూరు సంవత్సరాలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
6. స్వీయ చరిత్రము - కందుకూరి వీరేశలింగం పంతులు.
7. హాస్య సంజీవని - కందుకూరి వీరేశలింగం పంతులు.
8. రాజశేఖర చరిత్రము - కందుకూరి వీరేశలింగం పంతులు.
9. సంఘసంస్కరణ దస్తూరి మన కందుకూరి - సం. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.

★★★

BHAVAVEENA
Vol. 22, Issue. 04, April 2025
భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# కోమలాదేవి నవలలు - సమాజ స్థితిగతులకు దర్పణాలు

- పి. నాగశృతి, పరిశోధకురాలు, తెలుగుశాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

## ప్రవేశిక

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల, కథ, నాటిక, ఏకాంకిక, వచన కవిత, విమర్శ వంటి అనేక ప్రక్రియలు వెలువడ్డాయి. అందులో అగ్రగణ్యమైనది నవల. ఒక జీవితాన్నిగానీ, సమాజ స్థితుగతులు గానీ, చరిత్రను గానీ ఇంకా ఏదైనా అంశాన్ని గానీ సమగ్రంగా అభివర్ణించేది నవల. ఈ నవల ద్వారా చరిత్ర, సంస్కృతి, జీవిత చరిత్ర, హేతువాదం, వైజ్ఞానికం, సాంఘికం, మనస్తత్వం వంటి అన్ని అంశాలను సహేతుకంగా, సప్రమాణంగా, సమూలంగా చిత్రించవచ్చు. అందువల్ల ఒక విస్తృతాంశాన్ని చిత్రించుటకు రచయితలు నవలా ప్రక్రియను ఎన్ను కుంటున్నారు. అలా ఎన్నుకొని వివిధ వస్తు వైవిధ్యంతో వందలాది ప్రామాణిక నవలలు రాశారు.

యద్దనపూడి సులోచనారాణి, సి.ఆనందరామం వంటి రచయిత్రులు, కొడవటి గంటి కుటుంబరావు, రావిశాస్త్రి, మల్లాది వెంకటకృష్ణమూర్తి, యండమూరి వీరేంద్రనాథ్ వంటి రచయితలు నవలా ప్రక్రియను ఎంచుకున్నారు. నేడు వీరిని ఆదర్శంగా తీసికొని ఎందరో రచయిత్రులు, రచయితలు నవలలు పోటీబడి రాస్తున్నారు. ఈ కోవలో ఎన్నదగిన నవలాకారిణి కోమలాదేవి.

## ముఖ్యాంశాలు

ఈ కోమలాదేవి దాదాపు పన్నెండు నవలలు రాసినట్లు తెలుస్తున్నది. ఆ నవలలను బంగారు పంజరం, పునస్సమాగమం, చెట్టునీడ, ఆరాధన, స్వీట్ టీన్స్, లేమితో కలిమి, కన్నెపిల్లలు - మెరుపు తీగలు, చెరగని ముద్ర, అనురాగ తరంగాలు, అందుకున్న స్వర్గం, దాంపత్యాలు, పూల తెరలుగా పేర్కొనవచ్చు. ఈ నవలలను రచయిత్రి దాదాపు నాలుగు దశాబ్దాల ముందు రాసినట్లు తెలుస్తున్నది. ప్రతి నవలలోను ఆనాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయాది అన్ని అంశాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. ఆ నవలల్లో పేర్కొన్న అనేకాంశాలు నేటికీ కొనసాగుతూ వస్తూనే ఉన్నాయని విస్పష్టంగా పేర్కొనవచ్చు. అయినా ఆనాటి అహేతుక, అసాంఘిక అంశాల్లో మార్పులు నేటికీ రాకపోవడం విచారకరం. ఒకరకంగా చెప్పాలంటే ఆమె నవలలు వెలుగులోనికి రాకపోవడం కూడా కారణంగా పేర్కొనవచ్చు.

రచయిత్రి కోమలాదేవి సరళ శైలిలో తాను చెప్ప దలచిన అంశాన్ని సూటిగా చెప్పారు. వీరి ప్రతి నవల లోనూ కుటుంబ జీవనంలోని విభిన్నకోణాలు చెప్ప బడ్డాయి. సమాజాన్ని సునిశితంగా పరిశీలించి నొప్పించక తానొవ్వక అనే రీతిలో చిత్రించింది. వీరి నవలల్లో విమర్శ ఉంది. సూచన ఉంది. సలహా ఉంది. ప్రజలు జీవిం చాల్సిన రీతి ఉంది. ఆధ్యాత్మికాంశాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తన కాలం నాటి సమాజాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. కర్నూలు జిల్లాలోని ఆదోని ప్రాంతానికి చెందిన ఈ రచయిత్రి, ఇన్నాళ్ళు వెలుగులోకి రాకపోవడం మన దౌర్భాగ్యమని చెప్పక తప్పదు.

## ఒక జవాను భార్య దేశభక్తి

సమాజంలో కొందరు తాము తమ కుటుంబం బాగుండాలని భావిస్తారు. అయితే కొందరు మాత్రమే సమాజంతో పాటు తాము బాగుండాలని కోరుకుంటారు. అలాంటి వారికి నిదర్శనంగా సైనికులను వారి కుటుంబ సభ్యులను పేర్కొనవచ్చు. ఒక సైనికుని భార్య ఎలా దేశభక్తిని చాటుకున్నదో రచయిత్రి కోమలాదేవి తెలిపారు.

ఒక జవాను భార్య - భర్త మరణాన్ని విని ఉంటుంది. 'నా భర్త దేశం కోసం ప్రాణాలర్పించి వీర స్వర్గం అలంకరిం చాడు. నాకు సంతోషమే. కానీ అతనెందుకు మరణించ వలసి వచ్చింది. అతనికి సరియైన ఆయుధాలు ఎందుకు ఇవ్వలేదు. ఎప్పటిదో పాత కాలం నాటి చేతి తుపాకులు మాత్రమే ఇచ్చారు. అందుకే తన్ను తాను చైనా వారి మెషిన్ గన్స్ నుండి రక్షించుకోలేక పోయాడు. ఆ

యుద్ధంలో ఎందరి ప్రాణాలు మాతృదేశ రక్షణకంకిత మయ్యాయో! ఎందరి జన్మలు సార్థకములయ్యాయో! అంటూ భార్య స్థానంలో ఉన్న ఒక స్త్రీ యుద్ధంలో అమరవీరుడైన తన భర్తను గూర్చి ప్రశంసిస్తూ అంటుంది. ఈ విషయాన్ని రచయిత్రి కోమలాదేవి 'పునస్సమాగమం' అనే నవలలో చిత్రించింది.

మన దేశానికి చైనాతో, పాకిస్తాన్‌తో తరచూ యుద్ధాలు జరుగుతున్నాయి. మన సైనికులు అహర్నిశలు అప్రమత్తతతో దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్నారు. అయినా ముష్కరులు దొంగదెబ్బ తీస్తున్నారు. అయితే మన సైనికులు కూడా ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడుతూ వారి ఆటలు సాగనివ్వకుండా ఎదిరించి తిప్పి కొడుతున్నారు. ఒక్కోసారి ప్రాణాలూ కోల్పోతున్నారు. అలాంటి వీరుల భార్యలు తమ భర్తను కోల్పోయామన్న బాధను దిగమింగుకొని దేశభక్తితో ఎలా పోరాడి అమరత్వం పొందారో తలచుకొని గర్వపడుతున్నారు.

ఈ నేపథ్యంలో చూస్తే అమర సైనికుని భార్య తన భర్త మరణాన్ని ఒక పక్క శ్లాఘిస్తూనే, మరోపక్క మన సైనికులు మరణించడానికి గల కారణాలను బయట బెడుతుంది. శత్రుదేశాల సైనికుల వద్ద అధునాతన ఆయుధాలుండగా మన సైనికుల వద్ద పాతకాలంనాటి చేతి తుపాకులున్నాయని ఆవేదన చెందుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా సైనికుల మౌళిక సమస్యలను తెలుసుకొని సమీక్షించుకొని వారికి అత్యాధునిక ఆయుధాలివ్వాలంటుంది.

## దంపతులు - కలతలు

దంపతుల మధ్య కలతలను గూర్చి కోమలాదేవి తెలిపారు. ఒక భర్త అంటాడు. "మనసు కుత కుతలాడి పోయింది. పరుగుల మీద వెళ్తాననుకొంది కాబోలు. మునుపు వేరు. ఏదో అసూయ - కానీ ఈసారికి తనదేగా తప్పు. అదేదో ఒప్పేసుకోకూడదూ? ఉట్టిగా బుకా యించేస్తోంది. తెలీదంటుంది. అబ్బ అమల ఎంతటి రూపసి - ఆ వేళ ఎంత అందంగా తయారైంది. కవుల వర్ణన కందని స్వరూపం అది. ఆ కపోలాల మృదుత్వం దేనికి. సాటి... ఛీ... ఛీ... అమలాలోలుడనై పోతున్నాను. రేపు ఎదురుచూస్తుంది. వెళ్ళను గాక వెళ్ళను. చూద్దాం. ఎన్నాళ్ళిలా ఉంటుదో. ఔనని ఉంటే క్షమించేద్దునుగా. ఎందుకీ కపట నాటకం? నేను మాటిమాటికి పిల్చు కొస్తుంటే అలుసై పోయింది. ఈసారి చూద్దాం. ఏం జరుగు తుందో. కాస్త నన్ను నేను అదుపులో పెట్టుకుంటాను. తనే రావాలి. నేను పోను. సోమవారం నాడు మామూలు గానే ఇంటికొచ్చాడు" అని 'భార్యారూపవతీ' అనే నవలలో చిత్రించింది. - కోమలాదేవి

అమల అనే యువతి మంచి అందగత్తె. ఆమెను ప్రకాష్ అనే వ్యక్తి ప్రేమించి పెళ్ళి చేసికున్నాడు. ప్రతిక్షణం ఆమె అందానికి దాసోహమంటూ వచ్చాడు. అయితే ఆమె ఏదేదో చిన్న కారణాలతో భర్తపై అలిగి పుట్టింటికి వెళ్ళేది. భర్త అత్తగారింటికి వెళ్ళి బ్రతిమలాడుకొని తీసుకొచ్చేవాడు. అలా రెండు సార్లు జరిగింది. మూడోసారి మళ్ళీ చెప్పా పెట్టకుండా వెళ్ళింది. దాంతో అతనికి తీవ్రమైన కోపం వచ్చింది. అప్పుడు అతను బింకం ప్రదర్శించాడు. ఈ పర్యాయం తాను వెళ్ళి ప్రాధేయపడనని, అమలయే రావాలని పట్టుపడతాడు. ఎన్నాళ్ళకు వస్తుందో రానీలే అనుకుంటాడు. అయితే ఇది మంచి విధానం కాదు.

ఇలాంటి దంపతులు అక్కడక్కడ నేటికీ ఉన్నారు. భార్య స్థానంలో ఉన్న ఆమె చీటికి మాటికీ చెప్పకుండా పుట్టినింటికి వెళ్ళకూడదు. అదేవిధగా భర్త స్థానంలో ఉన్న వ్యక్తి పంతాలకు పోకుండా భార్యతో చనువుగా ఉంటూ ఆమెకు మెట్టినింట ఎలాంటి లోటు ఉందో తెలుసుకొని దాన్ని పరిష్కరించాలి. అంతేగాని ఇరురువురు విభిన్న మనస్తత్వాలతో మసలుకోరాదు. సంసారమనే రథానికి భార్యాభర్తలు జోడు గుర్రాల వంటివారు. ఏ గుర్రం రథాన్ని లాగకున్నా ఆ రథం సక్రమంగా ముందుకు సాగదు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా భార్యాభర్తలు ఉమ్మడిగా చర్చించుకొని పరిష్కరించుకోవాలి. దంపతు లందరూ అలా మసలుకుంటేనే దాంపత్య జీవితం వర్ధిల్లుతుంది. రచయిత్రి యిచ్చే సందేశం కూడా ఇదే.

## ప్రేమికులు

ఒక భర్త గారు నా మంజూ... నా మంజూ... అంటూ మోకాళ్ళూని ఆమె కళ్ళను తడుస్తూ అన్నాడు. నువ్వు లేని

నా జీవితం వ్యర్థం మంజూ. నిన్ను వెళ్ళిపొమ్మని ఏ పరిస్థితుల్లో కూడా చెప్పలేను. నాకు ఎవ్వరూ లేరు. పెదతండ్రి ఉన్నాడు. అతడు కడు వృద్ధుడు. నిన్ను పెళ్ళి చేసుకోవటంలో నేను ఎవ్వరికీ దూరంకాను. నన్ను గూర్చి చింతించే వారులేరు. నీ సంగతి వేరు. ఆలోచించే కొలది నీవు నన్ను వివాహం చేసుకుంటే నీకెన్ని కష్టాలు. మానసిక వ్యధకు లోనౌతావో తలచుకుంటే నాకెంతో బాధగా ఉంటుంది. మీ అమ్మా, నాన్న గార్ల మాటను కాదని నాతో రమ్మని చెప్పటానికి సంకోచిస్తున్నాను' అంటాడు ప్రేమికుడు.

నాలో ప్రాణం ఉండగా మిమ్మల్ని మరవటం అంటూ ఉండదు. ఆనాడు మూడు సంవత్సరాల క్రితమే మీ ప్రేమచే బంధింపబడ్డాను. మీకు గుర్తు లేదూ? ఆ రోజు చెయ్యి విరగ్గొట్టుకొని వస్తే మీరే అంతా చేశారు. మీ నోట్స్ పుస్తకాలు ఇచ్చారు. మీరే అన్నారు మనం ఒకరికొకరు సృష్టించబడ్డామని. ఆ వేసవి సెలవులకి యింటికి వెళ్ళి మిమ్మల్ని చేసుకుంటానంటే - వాళ్ళు ఒప్పుకోకపోతే ఆ రోజే ఇల్లు విడిచి వచ్చేశాను. మీరు గాక నన్ను ఆద రించెందెవరు? ఈ రెండు సంవత్సరాలు నన్ను చది వించింది కూడా మీరేకదా! పైగా ఈ విషయం మీకు, నాకు తప్ప మరో ప్రాణికే తెలియన్వికూడదని కట్టడి చేశారు. ఇంత జేసిన మిమ్మల్ని మరచిపోగలిగితే నేను మనిషిని గాను. నేను మనస్ఫూర్తిగా మీ అర్ధాంగిని కావడానికి సిద్ధంగా ఉన్నాను'. ఆమె చలించి పోయింది - అంటూ 'ఆరాధన' నవలలో కోమలాదేవి యువతీ యువకుల ప్రేమను అద్భుతంగా చిత్రించింది. కుల మతాలు ఆర్థిక అంతస్థులకు అతీతమైన కల్మషంలేని ప్రేమ వారిది.

యుక్త వయస్సులో ఉన్న యువతీయువకులు శారీరక ఆకర్షణకులోనై ప్రేమలోకంలో విహరిస్తారు. ఏవేవో కబుర్లు చెప్పుకుంటారు. తమ ప్రేమ ఫలించి వివాహం చేసి కోవాలని ఆరాటపడతారు. ఈ క్రమలో కులమతాలకు అతీతంగా విశాలదృక్పథంతో ఆలోచిస్తారు. భావిజీవితానికి సంబంధించి ఏవోవో కలలుగంటారు. అంతవరకు బాగానే ఉంటుంది. ఆ తరువాతనే అసలు సమస్యలు పుట్టు కొస్తాయి.

వివాహమై ఇరువురు పిల్లలు పుట్టగానే భార్యపై భర్తకు ఆకర్షణ తగ్గుతుంది. ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయి. జీవితంలో ఏదో చేయారని తప్పు చేశామని భావిస్తారు. కొందరైతే విడిపోవడానికి కూడా వెనుకాడరు. ఈ నేపథ్యంలో నిత్యం ఘర్షణ పడుతుంటారు. దాని ద్వారా వారి పిల్లలు బేలతనంతో దిక్కుతోచని స్థితిలో ఉంటారు. ఇది సంఘజీవనానికి పెద్ద ఆటంకంగా మారుతుంది.

## నేటి పిల్లలు- తల్లిదండ్రులు

నేటి విద్యార్థులపట్ల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయు లకు ఎంత బాధ్యత ఉందో రచయిత్రి కోమలాదేవి తెలిపారు. వాళ్ళు జీతం తీసుకుంటారు. చదువు చెప్పి వెళ్ళిపోతారు. వీళ్ళు జీతం కడ్తారు. వింటే వింటారు లేకపోతే లేదు. కానీ శారద ఊరుకోలేక పోయింది. రెండు మూడు నెలలకోమాట వెళ్ళి రామూ, వనజల చదువు విషయం కనుక్కుని వచ్చేది. ఏదైనా అకృత్యాలు చేశారమో కనుక్కొనేది. క్రమంగా హాజరౌతున్నారో లేదో కనుక్కునేది. ఆమె అంటే టీచర్లకు ఓ విధమైన గౌరవం, భయం ఏర్పడినై. ఆమె ఉపాధ్యాయులలో నేరమున్నా దాన్ని ఎత్తి చూపేది కాదు. అంతా నేరం కొడుకుదీ, కూతురుదీను అన్నట్లు వ్యవహరించేది.

మీలా ప్రతి తల్లిలేక తండ్రి వచ్చి పరామర్శించి వెళ్తే విద్యార్థులు బాగా పైకి వస్తారు. ఇక్కడి సమస్యలు తల్లిదండ్రులకు తెలియవు. ఇంటి పరిస్థితులు మాకు తెలియవు' అంటారు హెడ్ మాస్టరు. మంచి మ్యాట్నీ వస్తే క్లాసు ఎగ్గొట్టి వెళ్తారు. అలా వెళ్ళారని ఎంతమంది తల్లిదండ్రులకు తెలుసు? దాదాపు ఎవ్వరికీ తెలియదు.

బిడ్డలు ఎక్కడ ఏం చేస్తున్నారో తెలియని తల్లి దండ్రులు అసలు అపరాధులు. తల్లిదండ్రులు బిడ్డల చర్యలను వారి ఉనికిని సదా ఒక కంట కనిపెడ్తుంటే ప్రపంచంలో నగం నేరాలు సంభవించవు. వారు పట్టీపట్టనట్లుండబట్టే విద్యార్థులు అందులో చిన్న వారు పెట్రేగి పోతున్నారు.

శారద ఈ థియరీపై సంపూర్ణ విశ్వాసం ఉంచింది - అంటూ ఒక తల్లి తన బిడ్డల చదువుపై ఎంత శ్రద్ధ చూపుతుందో చక్కగా చిత్రించారు నవలా రచయిత్రి కోమలాదేవి "స్వీట్ టీన్స్" అనే నవలలో.

ఈ రోజుల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రుల్లో తొంభై తొమ్మిది శాతం మంది పాఠశాలకు నెలకు కాదు కదా మూడు నెలలకోసారైనా వచ్చి తమ పిల్లల చదువు సంధ్యల గురించి ఆడగడం లేదు. దానితో ఆడ మగ అనే తేడా లేకుండా పిల్లలు విచ్చలవిడిగా తిరుగుతున్నారు. విచిత్ర కటింగులు చేసు కుంటున్నారు. ఇక వస్త్రధారణ విషయానికి వస్తే బెగ్గింగ్ ఫ్యాంట్లు వేసుకొస్తున్నారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు ఎక్కడున్నాయో కూడా వాళ్ళకు తెలియదు. ఉపాధ్యాయు లంటే భయభక్తులు లేవు. పరీక్షలంటే కాపీలు కొట్టిస్తారులే అని ధీమగా ఉంటున్నారు. ఒక్కోసారి ఉపాధ్యాయులపై తిరగబడతున్నారు. ఇలా నేటి పాఠశాల, కళాశాల పిల్లల వికృత ధోరణులు వర్ణించటానికి మాటలు చాలవనవచ్చు.

ఈ దుస్థితికి కారణం, పిల్లలను కొట్టవద్దు, తిట్టవద్దు, భయపెట్టవద్దు అని న్యాయస్థానాల మొదలు పాలకుల వరకు ఒకే మాట మీద నిలబడి ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడమే కారణమని సామాజిక స్పృహ కలిగిన వారంటున్నారు. ఒకప్పుడు పిల్లలను కొట్టవద్దని గగ్గోలు పెట్టిన మేధావి వర్గంలో ఇప్పుడిప్పుడే మార్పు వస్తున్నది. ఉపాధ్యాయులు దండించకపోతే పిల్లలు ఎలా తయారవుతున్నారో అన్ని వర్గాల ప్రజలూ ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. ఈ దుస్థితిలో మార్పు రావాలంటే ముందు తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. వాళ్ళు క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండాలి. తక్కిన దానిని ఉపాధ్యాయులు చూసుకుంటారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కోమలాదేవి 'స్వీట్ టీన్స్' అనే నవలలో అద్భుతంగా చిత్రించారు.

## ముగింపు

సమాజంలోని ప్రజలు విభిన్న కోణాల్లో ఆలోచిస్తారు. అందుకు తగినట్లుగా వ్యవహరిస్తారు. దానివల్ల సమాజ జీవనంలో ఒడిదుడుకులుంటాయి. అదే క్రమంలో మంచి ఉంటుంది. వీటిని వివేచించడమే రచయితల బాధ్యత. ఆ బాధ్యతను గుర్తెరిగి కోమలాదేవి అనేక నవలలు రాశారు. అందులోని వస్తువు రచయిత్రి సమకాలీన సమాజానికి దర్పణాలుగా నిలుస్తున్నాయి. నేటికీ ఆ ఒరవడి కొనసాగుతున్నది. వాటి మంచి చెడులను వివేచించుకొని మంచి దారిలో నడవడం మనందరి బాధ్యత.

## ఉపయుక్త గ్రంథాలు

1. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణ శర్మ
2. తెలుగు నవల - అంపశయ్య నవీన్
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
4. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య

★★★

# పిల్లల సామాజిక స్పృహ హేతువులు - పొడుపు కథలు

**– చిలకల బాలరాజు,** పరిశోధకుడు, తెలుగుశాఖ & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**ప్రవేశిక :**

బుడి బుడి అడుగుల దశ దాటిన పిల్లలు అడుగడుగునా ప్రశ్నలు వేస్తారు. వాటికి మనం జవాబులు చెప్పడం ఒక్కొక్కసారి చాలా కష్టం అవుతుంది. బాల్యదశలోని వారి కుశాగ్ర బుద్ధి అలాంటిది. ఈ క్రమంలో చూసినపుడు వారు కథలు, పొడుపు కథలంటే చెవి కోసుకుంటారు. పొడుపు కథలకు జవాబులు కనిపెట్టడానికి పిల్లలు బుర్రకు పదను పెడతారు. దాని ద్వారా వారిలో ఆలోచనాశక్తి పెరుగుతుంది. దానితో వారి మేధస్సు విస్తృతంగా పెరుగుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించే జానపదులు పొడుపు కథలను సృజించారు. రాత్రివేళ భోజనాలయ్యాక పల్లెల్లో అవ్వ, తాతల దగ్గరకు పిల్లలందరూ చేరతారు. ఆ అవ్వ తాతలు వారికి పొడుపు కథలు చెప్పి వారి బుర్రకు పరిపరి విధాలుగా పదును పెడతారు. వారు సమాధానం చెప్పడానికి వారి మెదడుకు పనిపెడతారు. దాని ద్వారా మెదడు చురుగ్గా పనిచేస్తుంది. అలాంటి కొన్ని పొడుపు కథలను డా॥ఎం.హరికిషన్ సేకరించి గ్రంథంగా తెచ్చారు. వాటిని ఇక్కడ పేర్కొని చర్చించడం జరిగింది.

**పొడుపు కథలు :**

ఈ పొడుపు కథలకు పరిమితులు లేవు. ఏ అంశాన్ని గురించైనా అడుగవచ్చు. ఈ వ్యాసంలో జంతువులు, దేశ నాయకుల లక్షణాలు, గుణ గణాలపై పొడుపు కథలు ప్రశ్నించి జవాబులు రాబట్టే తీరు చెప్పబడింది. ముందుగా జంతువులకు సంబంధించిన పొడుపు కథలు పేర్కొనడం జరిగింది.

**జంతువులు :**

ఇక్కడ సింహం, పులి, పిల్లి, బల్లి, మేక, గుర్రం, గాడిద, కుక్క, ఒంటె, జింక ముంగిస, పాము, కోతి, ఎలుగుబంటి, చేప, కప్ప, ఉడుము వంటి కొన్ని జంతువుల స్వభావాలు పేర్కొని పొడుపు కథలు అల్లడం జరిగింది.

**సింహం :**

ముందుగా చెప్పదగినది సింహం. దాని స్వరూప స్వభావాలు లక్షణాలు ఇలా చెప్పబడ్డాయి.

రీవిని చాటే ఆకారం
మెడలో జూలు సింగారం
గర్జనలో గాంభీర్యం
అడవంతా నా సామ్రాజ్యం

ఎవరిని? నేనెవరిని? - అని సింహం అడుగుతుంది. దీనికి సమాధానం సింహం అని పిల్లలు గుర్తించ గలుగుతారు.

సింహం రీవిగా ఉంటుంది. దాని మెడలో జూలు ఉంటుంది. అది గర్జిస్తే అడవి జంతువులన్నీ హడలి పోతాయి. అది అడవికంతా రాజు. ఇలాంటి పొడుపు కథ ద్వారా పిల్లలు సింహం లక్షణాలు తెలుసుకుంటారు. భవిష్యత్తులో దాని దగ్గరకు పోకుండా జాగ్రత్తగా ఉంటారు. సర్వసాధారణంగా సింహాన్ని అడవికి రాజు అంటారు. భీమున్ని సింహ బలుడంటారు. రాజులు కూర్చునే ఆసనాన్ని సింహాసనం అంటారు. అలా చేయడం ద్వారా రాజు సింహం లాంటి వాడని చెప్పకనే చెప్పారు. ప్రజలకు రాజు రాజైతే, అడవికి సింహం రాజు.

**పులి :**

పులి లక్షణాలు, స్వరూప స్వభావాలు తెలిపే పొడుపు కథ ఉంది. సింహం లాగే పులి కూడా గంభీరమైనది, క్రూరమైనది. ఇది కూడా మాంసాహారి. సింహం తరువాత అడవిపై పెత్తనం పులిదే. ఈ జంతువు ఆనవాలు తెలిపే పొడుపుకథ ఇలా ఉంది.

ఒంటి నిండ చారలు
వాడి వాడి కోరలు
గాండ్రు గాండ్రు అరుపులు
వేటతోటి విందులు

ఎవరిని? నేనెవరిని? - అని పులి తన లక్షణాలు చెబుతుంది. దీనికి సమాధానం పులి.

పులి ఒంటినిండా చారలుంటాయి. దానికి వాడియైన కోరలుంటాయి. అది గాండ్రిస్తుంది. దాని గాండ్రింపు వినగానే జంతువులన్నీ తమ స్థావరాల్లో దాక్కుంటాయి. పులికి ఒంటి నిండా చారలుంటాయి. సింహానికి మెడలో జూలు, శరీరమంతా బొచ్చు ఉంటుంది. ఇవి రెండూ క్రూర జంతువులే. వీటిల్లో అనేక జాతులున్నాయి. అన్నీ ఒకే రకమైన స్వభావం కలిగినవే.

**పిల్లి :**

పిల్లి సాధు జంతువు. దాని ప్రధాన ఆహారం ఎలుకలు. ఇది ఇళ్ళలో నివసిస్తుంటుంది. దీని స్వరూప స్వభావాలను గూర్చి జానపదులు ఇలా పొడుపు కథగా అల్లారు.

పులిని పోలి ఉంటాను
పాలు పెరుగు తింటాను
ఎలుకలంటె నాకు ప్రాణం
కుక్కలంటే నాకు ద్వేషం

ఎవరిని? నేనెవరిని? - అని 'పిల్లి' తన స్వగతాన్ని చెప్పుకున్నట్లు ఈ పొడుపు కథ అల్లబడింది. పిల్లి స్వరూప స్వభావాలు ఇలా చెప్పబడ్డాయి.

- పిల్లి పులిని పోలి ఉంటుంది.
- పాలు పెరుగు తింటుంది.
- ఎలుకలంటే దానికి ప్రాణం.
- దానికి కుక్కలంటే ద్వేషం.

పిల్లి ఎలుకలను చంపి తింటే, కుక్కలు పిల్లులను చంపి తింటాయి. ఇది ఆహారపు గొలుసు కూడా. ఈ పిల్లుల మూలంగా రైతులు ఇంటిలో దాచిన ఆహారం ఎలుకల పాలు కాకుండా కాపాడబడుతున్నాయి. పిల్లి పులిని పోలి ఉన్నా పులికి ఉన్నంత శరీరం కానీ దాని లక్షణాలు కానీ లేవు.

**కుక్క :**

అన్ని జంతువుల్లో కెల్ల విశ్వసనీయమైన జంతువు కుక్క. అందువల్లనే ఇది ఇళ్ళలో స్థానం సంపాదించుకున్నది. దీని గుణగణాలు ఆనవాలు గుర్తించే పొడుపు కథ ఇలా ఉంది.

విశ్వాసాన్ని చూపిస్తా
ఇంటికి కావలి కాసేస్తా
దొంగల జాడ పసిగడతా
ఇంటి దొరలకు తెలిపేస్తా

ఎవరిని? నేనెవరిని?? - అని ప్రశ్నిస్తుంది కుక్క.

కుక్క విశ్వాసాన్ని చూపిస్తుంది. ఇంటికి నిరంతరం కాపలా కాస్తుంది. దొంగల జాడ కనిపెడుతుంది. తన అరుపుల ద్వారా ఇంటి యజమానులు సన్నద్ధులయ్యేటట్లు చేస్తుంది. కుక్కలు మన దేశంలో ఇంటిలో తక్కువగా, వీధిలో ఎక్కువగా ఉంటాయి. అదే విదేశాల్లో అయితే వీధుల్లో దాదాపుగా కనిపించవు. ప్రతి ఇంటిలో పెంపుడు కుక్కలు ఉంటాయి. అవి ఆ ఇంటి యజమానులకు ఎంతగానో దోహదపడతాయి. బజారునుంచి సరుకులు తెచ్చి పెడతాయి. ఇంటికి కాపలా కాస్తాయి. ఇక పోలీసులకు బహువిధాలుగా జాగిలాలు (కుక్కలు) ఉపయోగపడుతున్నాయి.

## దేశనాయకులు :

కేవలం జంతువుల గురించే కాకుండా దేశనాయకుల గురించి కూడా పొడుపు కథలు అల్లబడ్డాయి. వాటిలో మూడింటిని ఇక్కడ పేర్కొని విశ్లేషించడం జరిగింది.

**గాంధీ :**

గాంధీ మహాత్ముని 'జాతి పిత' అని పిలుస్తాము. ఆయన నిస్వార్థ పోరాటం మూలంగా మనకు స్వాతంత్ర్యం వచ్చింది. భారతీయుల కోసం జైలు జీవితం గడిపారు. నిరాడంబరంగా జీవించారు. సత్యాగ్రహం అనే ఆయుధంతో తెల్లదొరల గుండెల్లో గుబులు పుట్టించారు. హిందూ, ముస్లీములు కలసి మెలసి జీవించాలని తపన పడ్డాడు. అలాంటి మహానుభావుని గురించి ఒక పొడుపు కథ ఇలా ఉంది.

బోసినవ్వుల తాతను
మీకందరికీ జాతి పితను
ఆయుధమేదీ పట్టకనే
ఆంగ్లేయులను తరిమిన నేతను

ఎవరిని? నేనెవరిని? - అని తన గునగణాలు చెప్పబడ్డాయి.

గాంధీజీ ఎల్లప్పుడూ బోసినవ్వులు నవ్వుతాడు. రక్తపాత రహిత పోరాటం చేసి మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టి 'జాతి పిత'గా గౌరవించబడ్డాడు. ఆయన ఆయుధాన్ని చేబట్టలేదు. నిరాయుధుడిగా పోరాటం చేసి రవి

అస్తమించని బ్రిటీషు పాలకును మన దేశంనుంచి తరిమివేసిన కారణ జన్ముడు. అందుకే గాంధీని అన్ని దేశాల నేతలు అభిమానిస్తున్నారు.

**నేతాజీ సుభాష్ చంద్రబోస్ :**

స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ ఎంతటి మితవాదో, సుభాష్ చంద్రబోస్ అంతటి అతివాది. సాయుధ పోరాటం ద్వారా గానీ, దెబ్బకు దెబ్బ తీయడం ద్వారాగానీ తిరుగు బాటు చేస్తే తప్ప మన దేశానికి స్వాతంత్ర్యం రాదని తేల్చి చెప్పాడు. అతనికి గాంధీ మహాత్ముని సహకారం లభించకపోవటంతో జపాన్, జర్మనీ వంటి దేశాలకు వెళ్ళి 'ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో సంస్థను స్థాపించి ప్రత్యేక సైనాన్ని తయారు చేశాడు. అయితే దురదృష్టవశాత్తు విమానప్రమాదంలో మరణించాడని వార్త వచ్చింది. కానీ ఆయన మరణంపై ఇప్పటికీ సందేహాలు వెంటాడుతూనే ఉన్నాయి.

ఆయన స్వరూప స్వభావాలను ఈ పొడుపు కథ తెలుపుతున్నది.

'జైహింద్ జైహింద్ అంటూ నినదించా
నేతాజీ అంటూ బిరుదు గడించా
అజాద్ హింద్ ఫౌజ్ స్థాపించా
ఆంగ్లేయులనే ఎదిరించా
ఎవరిని? నేనెవరిని?? - అన్న ప్రశ్నకు సమాధానం పిల్లలు కనిపెడతారు.

జైహింద్ అంటూ నినదించాడు. నేతాజీ అని పేరు గడించాడు. అజాద్ హింద్ ఫౌజ్ అనే సంస్థను స్థాపించాడు. ఆంగ్లేయులకు చిక్కకుండా వివిధ దేశాలు తిరిగి తిరుగుబాటుకు సైన్యాన్ని సిద్ధం చేశాడు.

**ఎపిజె అబ్దుల్ కలామ్ :**

చేపలు పట్టుకొని అమ్మి జీవించే నిరుపేద ముస్లిం కుటుంబంలో జన్మించి తన పట్టుదల స్వశక్తి ద్వారా ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా ఎదిగి, భారత రాష్ట్రపతి పదవిని అలంకరించి, నిస్వార్ధంగా, నిరాడంబరంగా జీవిస్తూ ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు ఎపిజె అబ్దుల్‌కలాం. ఆయన స్వరూప స్వభావాలను తెలిపే పొడుపు కథ ఇలా ఉంది.

సామాన్యుల ఇంట పుట్టాను
శాస్త్రవేత్తగా ఎదిగాను
రాకెట్లను రూపొందించాను
రాష్ట్రపతియై పాలించాను
ఎవరిని? నేనెవరిని?? - అని ప్రశ్నిస్తారు. ఈ పొడుపు కథ ద్వారా కలామ్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు.

**వ్యాస ప్రయోజనం :**

ఇలా ఈ విశ్వంలో కంటికి కనిపిస్తున్న ప్రతి వస్తువు, జీవి, ప్రకృతి, అందులోని సకల జీవరాశుల పైన పొడుపు కథలు అల్లబడ్డాయి. ఈ అల్లబడిన పొడుపు కథల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, కుశాగ్ర బుద్ధి, సూక్ష్మ గ్రాహ్యత వంటి ప్రతిభావంతమైన జ్ఞానం బాల్యం లోనే పెరుగు తుంది. అది వారి భావి జీవిత పురోగమనానికి ఎంతగానో దోహద పడుతుంది.

**ముగింపు :**

'పిల్లలు దేవుడు చల్లనివారే. కల్లకపట మెరుగని కరుణామయులే' అన్నాడో సినీకవి. అలాంటి పిల్లలకు బాల్యంలోనే కుశాగ్ర బుద్ధిని, సూక్ష్మ గ్రాహ్యతను, ఆలోచనను, సామాజిక స్పృహను పెంపొందిస్తే వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతారు. దీని ద్వారా సమాజంలో ప్రశాంతత నెలకొంటుంది. ఈ లక్ష్య సాధనకు దోహదపడేది సాహిత్యం. అందులో అగ్రగణ్యమైనది 'పొడుపు కథ.

## ఉపయుక్త గ్రంథాలు

1. గోదావరి సీమ జానపద కళలు క్రీడలు వేడుకలు - డా॥ పడాల రామకృష్ణారెడ్డి
2. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బి.రామరాజు
3. ఆంధ్రుల జానపద విజ్ఞానము - ఆర్వీఎస్ సుందరం
4. జానపద కళాసంపద - ఆచార్య తూమాటి దోణప్ప

★★★

# మాలతీ చందూర్ నవలా సాహిత్యంలో విజిలెన్స్ హోమ్ జీవిత చిత్రణ

- ఆచార్య కిన్నెర శ్రీదేవి
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- ఎద్దు ప్రవంతి
పరిశోధిక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**రచయిత్రి పరిచయం :** ముందుతరం రచయిత్రుల్లో చైతన్యం, మంచి విషయ పరిజ్ఞానం, నిశిత పరిశీలన కలిగిన వాళ్ళలో ఎన్నదగిన నవలా రచయిత్రి మాలతీ చందూర్. ఈమె నవలా సాహిత్యం చదివిన వారందరికీ ఈ విషయం అర్థమవుతుంది. విజిలెన్స్ హోమ్ గురించి మొట్టమొదట సృజించిన రచయిత్రి మాలతీ చందూర్. నవలా సాహిత్యంలో అడుగడుగునా తారాసపడే వ్యక్తీకరణలలో మాలతీ చందూర్ సంస్కారం, స్త్రీల సమస్యలను అర్థంచేసుకోవడంలో ఆమె వ్యక్తిత్వం ప్రతిఫలిస్తూంటుంది.

వ్యక్తుల అంతరంగాలు ఆవిష్కరించేటప్పుడు రచయిత్రి నిశితదృష్టి పాఠకులను ఆశ్చర్యపరుస్తుంది. వ్యక్తులే అన్నిటికీ కారణం కాదు. సమాజమే మనుషుల చేత మంచి, చెడ్డపనులు చేయిస్తుందని, స్త్రీల విషయంలో పురుష కేంద్రక దృష్టితో కాక స్త్రీలపైనున్న జండర్ తారతమ్యాలతో కూడిన అదనపు భారాన్ని అర్థంచేసుకొని ప్రవర్తించాలనే అవగాహన 'జయ-లక్ష్మి' అనే నవలలో చిత్రించారు. ఇందులో భాదిత స్త్రీల సంరక్షణ కోసం ప్రభుత్వం మహిళా సంరక్షణ కేంద్రాలను 'విజిలెన్స్ హోమ్' పేరుతో ఏర్పాటు చేశారు. ఇతరులచేత మోసగింపబడడానికి అవకాశం ఇవ్వని రీతిలో భాదిత స్త్రీలు ఎదగాలన్నది మాలతీ చందూర్ అభిప్రాయం. అలాగే విజిలెన్స్ హోమ్ అధికారులే భాధిత స్త్రీల ఆలోచనలను మారుస్తారని మాలతీ చందూర్ అభిప్రాయం.

'జయ-లక్ష్మి' నవలలో విజిలెన్స్ హోమ్ లోకి యథాప్రకారం వచ్చేవాళ్ళూ, అప్రయత్నంగా వచ్చేవాళ్ళు, అమాయకంగా మోసగాళ్ళవలలో చిక్కి వచ్చే వాళ్ళూ, తల్లిదండ్రుల నిరాదరణ వల్ల వచ్చేవాళ్ళు, అకస్మికంగా ప్రమాదాలకు, అత్యాచారాలకు గురయినవాళ్ళు ఇలా పలురకాలైన స్త్రీలు భాదితులుగా వస్తుంటారు. వాళ్ళ అంతరంగాలు, ప్రవర్తనలు, సంఘర్షణలు, దుఃఖాలను ఈనవలలో మనం విపులంగా తెలుసుకోగలం. సమాజం స్త్రీల పట్ల ఎంత చిన్నచూపును ప్రదర్శిస్తుందో, అందుకు భిన్నంగా హోమ్ వాళ్ళను ఆదరించి అక్కున చేర్చుకుంటుంది. ఒక తండ్రిగా, భర్తగానేకాక జులాయిగా తిరిగే పురుషులు, ఈస్త్రీలపట్ల ఎంత దౌష్ట్యాన్ని కనబరుస్తారో 'జయ-లక్ష్మి' నవల ద్వారా అర్థం చేసుకోగలుగుతాం.

విజిలెన్స్ హోమ్ పట్ల సమగ్రమైన అవగాహనతో, దాదాపుగా అన్ని అంశాలూ వదలకుండా మాలతీ చందూర్ ఈ నవలలో దృశ్యీకరించారు. వాచ్ మేన్ నుంచి సూపర్నెంటు వరకు బాధిత స్త్రీలతో వాళ్ళు ప్రవర్తించే విధానాన్ని ఈనవలలో విశ్లేషణాత్మకంగా చిత్రించారు. అక్కడి స్త్రీలపై పురుషులకే కాదు స్త్రీలకు కూడా వుండే అభిప్రాయాలను విడివిడిగా పరిశీలిస్తే, స్త్రీలపట్ల ఎంత విరుద్ధమైన, ద్వైదీభావాన్ని కలిగి వుంటారో జయ-లక్ష్మి', 'కృష్ణవేణి' నవలలో విశ్లేషణాత్మకంగా చిత్రించారు.

## ఇతివృత్త పరిచయం :

మాలతీ చందూర్ నవలలు ప్రధానంగా వ్యక్తి సమస్యలను, వ్యక్తికి కుటుంబానికి మధ్య సంఘర్షణలను భిన్నకోణాలనుండి వస్తువుగా చేసుకున్నవి. మాలతీ చందూర్ నవలారచనా మార్గంలో ఒక మలుపు 1976లో వచ్చిన కృష్ణవేణి నవల. కృష్ణవేణి ఒక వ్యక్తే. కాని వ్యక్తిగా ఆమె జీవితంలోని ఒడి దుడుకుల సమస్య కాదు ఈ నవలా వస్తువు. ఒక మహిళా విజిలెన్స్ హోమ్ సూపరెండెంట్‌గా కృష్ణవేణి అనేక మంది మహిళల జీవితానుభవాలను తనవిగా చేసుకొని అభివృద్ధిచేసుకొన్న ఒక మానవీయ సమాజ నిర్మాణ ఆశయం ఈ నవలకు ఇతివృత్తం. స్త్రీలు ఏ సామాజిక ఆర్థిక వర్గానికి చెందిన వాళ్ళైనా జీవితంలో ఎన్నెన్ని స్థాయిలలో ఎంతెంత హింసను ఎదుర్కొనవలసి వస్తున్నదో చూపింది ఈ నవల. హింసకు లోనవుతున్నవాళ్లనే అంటే బాధితులనే

నేరస్థులుగా చూసి శిక్షించబూనుకొనే సామాజిక నీతి విధానాన్ని, చట్టాన్నివిమర్శకు పెట్టింది.

పేకాటకు తాగుడుకు సర్వం తగలేస్తూ భార్యాపిల్లల ఆకలి పట్టించుకోని భర్తను వదిలేసి పిల్లల పోషణకు బతుకుతెరువు మార్గం వెతుక్కొంటూ ఇల్లువదిలిన సుశీల నేరస్థురాలైంది. భార్యాపిల్లల పట్ల బాధ్యత వదిలేసి, వాళ్ళ తిండీ బట్టా మందూమాకు అవసరాలు పట్టించుకొనటం మానేసిఇంకొక స్త్రీ తో సంబంధాలు పెట్టుకొనటానికి సిద్ధంగా ఉన్న ఆమె భర్త సామాజిక హెూదాకు ఏ ఇబ్బందీ లేదు. పైగా అతనికి పిల్లనిచ్చి పెళ్ళిచేసే పరిస్థితులు కూడా ఉంటాయి. ప్రభుత్వం రెండోపెళ్లి చేసుకోకూడదని చట్టమైతే పెట్టింది కానీ మరొక ఆడదానితో సంబంధం పెట్టుకోకుండా ఆపలేకపోతున్నది. భార్యాపిల్లలను తిండిపెట్టకుండా హింసించటం వ్యక్తిగత మైన విషయం అయి కూర్చుందే కానీ నేరంగా పరిగణించ బడే సామాజిక నీతి లేదు. పిల్లలకు తిండిపెట్టకుండా వదిలేసే మగవాడి కర్కశత్వం నేరం కాదుకానీ వాళ్ళ ఆకలి తీర్చటానికి రెక్కలైనా ,ఒళ్లయినా, ఒంట్లో రక్తమైనా అమ్ముకొనటానికి సిద్ధపడే మాతృప్రేమ మాత్రం నేరమై శిక్షకు కూడా కారణం అవుతుంటుంది.

జైలు జీవితం వంటి కుటుంబజీవితం, కుల కట్టుబాట్లు, ఆడది కావటం వల్ల ఆంక్షలు %% వీటిమధ్య ఊపిరాడక స్వేచ్ఛకోసం బయటకు వచ్చి వ్యభిచారం చేసిన గీత నేరస్థురాలు అయింది. ఆమె దగ్గరికి వచ్చిపోతూ ఆనందించిన జడ్జీ వంటి పురుషుల హెూదా కాస్తయినా తగ్గలేదు. ఏ నేరానికైతే విజిలెన్స్ హెూమ్ లో గీత శిక్ష అనుభవిస్తున్నదో ఆ నేరంలో భాగస్వామి అయిన జడ్జీది ఆ విజిలెన్స్ హెూమ్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాగలిగిన స్థితి. బిడ్డ తల్లి అయిన ఒంటరి స్త్రీని పెళ్ళాడి ఆమె చాటున వావి వరుసలతో సంబంధం లేకుండా సవతి కూతురిని కూడా లొంగదీసుకుని అనుభవించగల నీచమానవులకు సమాజంలో చలామణి ఉంటూనే ఉంటుంది. కానీ ఆ మగవాడి దుశ్చర్యకు బలిఅయిన ఆరోగ్యం వంటి అమ్మాయిలు ఒంటరులుగా చేయబడి అనివార్యంగా వ్యభిచారంలోకి దిగి నేరస్థులన్న ముద్రను పొందాల్సి వస్తుంటుంది. నిస్సహాయురాలైన అత్యాచారానికి గురయిన ఆడపిల్లకు ఓదార్పు, చేయూత ఇయ్యక పోగా ఒంటరి రహస్య జీవిత శిక్షను విధించగల పరువు ప్రతిష్టల కుటుంబాల అమానవీయత ఒక వైపు. రోడ్డుపక్కన కూరలమ్ముకొనే వాళ్ళను నేరస్థులుగా నిలబెట్టే నెలసరిమామూళ్లు వసూలుచేసే పోలీసు వ్యవస్థ రక్షణ లక్షణం మరొకవైపు. ఇలాంటివి ఎన్నో ఇందులో దృశ్యం చేయబడ్డాయి.

ఒకరిని నేరస్థులుగా నిలబెట్టి శిక్షించే వ్యవస్థలో వాళ్ళనలా చేస్తున్న నేర సమాజ మూలాన్ని చూడ మంటుంది ఈ నవల. ఆడదానిని అనేకరకాలుగా నిస్స హాయురాలిని చేసి ఆమెను దోచుకొనటానికి, పీడించ టానికి అన్ని అవకాశాలు మగవాళ్లకు ఇచ్చిన సమాజంలో అసలు నేరస్థులు ఆ మగవాళ్ళు. వాళ్లకు విశేషాధికారాలు ఇచ్చిన వ్యవస్థ అని రచయిత్రి చెప్పకనే చెప్పింది. జయ-లక్ష్మి అనే నవల ఇదే మహిళా విజిలెన్స్ హెూమ్ కేంద్రంగా నడచిన కృష్ణవేణి కొనసాగింపు నవల. ఈ రెండు నవలలు కలిపి చూస్తే స్త్రీల సమస్యల పరిష్కారానికి అమలవుతున్న చట్టాలు, బాధిత స్త్రీల రక్షణకు ఏర్పాటు చేయబడే ప్రభుత్వ సంస్థలు, కృష్ణవేణి వంటి నిబద్ధ ఉద్యోగుల కృషి - ఏవీ సరిపోని ఒక పరిస్థితి గురించి తెలిసి ఆందోళన కలుగుతుంది. అయితే అదే సమయంలో పితృస్వామిక అధికార సమాజ సంస్కృతీ నిర్మాణాలలో సమూలమైన మార్పు గురించిన సమాజంలోనే కాక ప్రభుత్వవిధానాలలోకి చొచ్చుకుపోయిన ద్వంద్వనైతిక విలువల సంస్కృతిని గురించిన ప్రశ్నలు రేకెత్తించిన నవలలుగా వీటికి అనితర ప్రాధాన్యత ఉంది.

'కృష్ణవేణి' నవల విజిలెన్స్ హెూమ్‌కు రిమాండ్ మీద వున్న స్త్రీలు, శిక్ష పడినవారు అనేక కేసుల్లో ఇరుక్కున్న వారు కూడావుంటారు. ప్రభుత్వం నిర్వహించే ఈ హెూమ్ కు కృష్ణవేణి సూపర్నెంటు. ఆమె సంస్కారం గలది. ఏ పని నైనా ఆలోచించి చేసే స్వభావం, ఇన్మేట్స్ పట్ల జాలి - ప్రేమ. వారిని ఏవిధంగా నైనా తీర్చిదిద్దాలని, వారికొక జీవన మార్గం ఏర్పాటు చేయాలనే తపనతో పనిచేస్తుంది.

ఒకవిధమైన జీవితానికి అలవాటు పడితే

అందులోంచి బయట పడడమూ కష్టమేనని కొన్ని పాత్రలు తెలిపితే, ఆ పరిస్థితులకు జీవితాంతం అలవాటుపడలేక వ్యథపడేవాళ్ళు మరికొంతమంది. అనుకోకుండా మోసగాళ్ళు పన్నే వలలో చిక్కుకుని బయటపడలేక గింజుకునే జీవితాలు మరికొన్ని.

## నూత్న కథావస్తువు :

"ఈ నవలలో ఎందరో జయలు, లక్ష్మిలు మనల్ని పట్టి కుదిపేస్తారు. ఇంచుమించుగా అందరి కష్టాలు ఒక్కటే. అక్కడి స్త్రీలందరి కన్నీళ్లు ఒక్కటే". సమాజం వెలివేసిన జీవితాల క్రమం కూడా ఒక్కటే.

తమంతకు తాము బయట సమాజం చూసే చిన్న చూపుకు భయపడి వాళ్ళ కళ్ళలోని అసహనాన్ని, అసహ్యతను భరిస్తూ, సమాజం విధించే కనిపించని శిక్షలతో విజిలెన్సు హోములోనే మగ్గిపోయే వాళ్ళు వున్నారు. మహిళా సంరక్షణాలయాలను శిక్షగా కాక, ఆ హోమ్ నే కోరుకుని అక్కడే వుండాలనుకునే వాళ్ళూ వున్నారు. బయటకు వెళ్ళి బ్రతకలేక అనాథలైన వాళ్ళు, మహిళా సంరక్షణాలయాలకు అనుబంధంగా నడిపే సేవా సదనాల్లోనే (హోమ్లో) వుండేవాళ్ళూ, శిక్షా సమయంలో కూడా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషిస్తూండే మహిళలు ఇలా రకరకాల మనస్తత్వాలతో విజిలెన్స్ హోమ్స్‌కు వస్తుంటారు.

## సామాజిక దృష్టికోణం :

జీవితంలో అనేక రకాల మోసాలకు గురైన ఈ స్త్రీల మీదకంటే మనుషుల మీదా, చుట్టూ సమాజం మీద సూపర్నెంట్ కృష్ణవేణికి విపరీతమైన కోపం. చదువుకున్నవారు కూడా విజిలెన్స్ హోమ్, రెస్క్యూహోమ్స్ అంటే అదేదో రొచ్చుగుంట అన్నట్లు చూస్తున్న సంధర్భాన్ని రచయిత్రి ఇలా వ్యాఖ్యానించారు. ఈ దేశానికి, జాతికి విముక్తి లేదనే నిస్పృహ ఆమెలో కలుగుతూంటుంది. హోమ్లో ఇన్మేట్స్ వంక ఆకలిగా చూసే మొగాళ్ళని, ఆడపిల్లలని సన్మార్గంలో పెడతామంటూ చాటుమాటుగా అవకాశం కొరకు వెతికే కుహనా సంస్కర్తలనీ చూస్తుంటే ఆమెకి అసహ్యం, కోపం. ఈ హోమ్ కొచ్చిన ప్రతి అమ్మాయి పతనమయింది కాదనీ, యిందులో అమాయకులైన అమ్మాయిలు, ఏ పాపమూ అంటని అమ్మాయిలు వున్నారనీ వచ్చిన విజిటర్స్ కు చెవిన ఇల్లుగట్టుకు చెపుతూంటుందామె. అంతా విని కూడా దొంగచాటుగా ఆ అమ్మాయిల వంక చూసే వాళ్ళ కక్కుర్తిని చూసి, ఆమెకు పీక నులిమెయ్యాలన్నంత ఉద్రేకం కలుగుతూంటుంది.

'జయ-లక్ష్మి' అనే ఈనవలలో విజిలెన్స్ హోమ్ అంటే ఏమిటో తెలియడమే కాకుండా అక్కడికి వచ్చిన స్త్రీల రకరకాల సమస్యలు, ప్రవర్తనలు, వాళ్ళపట్ల సమాజం చూసే చిన్నచూపు, వాళ్ళ అంతరంగాల్లో మెదిలే భయాందోళనలు, చివరికి కుటుంబ సభ్యులూ చీదరించుకోవడం ఇతరత్రా అన్ని విషయాలను ఈనవల చర్చిస్తుంది. మొత్తానికి విజిలెన్స్ హోమ్ సంపూర్ణావిష్కరణ ఈ నవల.

"విజిలెన్స్ వింగ్లో కొందరు ఆడవాళ్ళు యీ హోమ్‌ను ప్లాట్ ఫారమ్ లాగా వాడుకుంటూంటారు. కొందరు తమ పాత జీవితాన్ని అసహ్యించుకుని, కొత్త జీవితం కొరకు, కొత్త ఉపాధి కొరకు పాటుబడుతుంటారు. తమ ప్రవర్తన సరిదిద్దుకు బాగుపడాలని తాపత్రయ పడుతూంటారు.

కొందరు అమ్మాయిలు అదేదో జైలు శిక్షలా అనుభవించి, తిరిగి పాత వృత్తిలోకి వెళ్ళిపోతూంటారు. వెళ్ళిపోయినవారిని చూస్తుంటే కృష్ణవేణికి ప్రభుత్వమూ, సంస్థలూ, వ్యక్తులూ యివ్వగలిగినంత చేయూత నివ్వడం లేదేమోనని సందేహం వ్యక్తం చేస్తుంది. పతనమై పోయిన ఒక ఆడపిల్లను కానీ, ఒక స్త్రీని మళ్ళీ మామూలు మనిషిని, సంఘంలో గౌరవనీయమైన స్త్రీగా చెయ్యగలగడం, వారికి పునరావాసం కల్పించడం ఎంత జటిలమైన సమస్యో కృష్ణవేణికి తెలుసు". అలా చట్టం కూడా అభాగ్య, వంచిత స్త్రీల పట్ల ఎంత వివక్ష చూపుతుందో ఈ క్రింది వాక్యాలలో అర్థమవుతుంది.

"లంచం పుచ్చుకునే వాడినీ, యిచ్చే వాడినీ ఇద్దరినీ శిక్షిస్తారు. బ్లాక్ వస్తువులు అమ్మే వాళ్ళనీ - కొనేవాళ్ళని, దొంగ సరుకులను కొనేవాళ్ళని, అమ్మేవాళ్ళని యిద్దరినీ శిక్షిస్తారు. కాని మహిళల విషయంలో మటుకు "అసలు నేరస్తుల్ని వదిలేసి ఆట పావులని పట్టుకుంటున్నారు." అంటుంది. మహిళా వివక్షకు చట్టం కూడా మినహాయింపు కాదని ఈ నవల నిరూపిస్తుంది.

మామూలుగా సామాజిక రుగ్మతలైన అవినీతి, లంచగొండితనం, విజిలెన్స్ హోమ్లో కొన్ని అక్రమాలు, కొన్ని పక్షపాత చర్యలు జరుగుతూ వుంటాయి. కొందరు స్వార్థపరులతో పాటు కొందరు నిజాయితీ పరులు కూడా వుంటారు.

హోమ్ ఇన్మేట్ సుశీల తన పిల్లల కోసం తపించి పోతూ వుంటుంది. సుశీల తండ్రి ఆ పిల్లల కోసం సుశీల భర్తకి తన రెండో కూతుర్ని యివ్వడానికి నిర్ణయించు కుంటాడు. ఈ నిర్ణయం వెనక ప్రధాన భూమిక నిర్వహించేది అతని దరిద్రమే. అట్లాగే వ్యభిచార నేరంలో అరెస్ట్ అయి హోమ్ కు వచ్చిన గీత అనే అమ్మాయి శిక్షా కాలం తరువాత కూడా తిరిగి అదే జీవితంలోకి వెళ్ళాలనుకుంటుంది. ఆ జీవితంలో లభించే కొన్ని చిన్న చిన్న సౌకర్యాలున్నాయి. ఉదా: స్వేచ్ఛ, తన పుట్టింట్లో లభించకపోవటమే అందుకు ప్రధాన కారణంగా భావిస్తుంది.

అటెండర్ వేలాయుధం లాంటివాళ్ళు, ఏదో విధంగా డబ్బు మిగుల్చుకోవాలనుకుంటారు. సమాజంలో అడుగడుగునా అలుముకున్న అవినీతి, మహిళా పునరావాసకేంద్రాలలో కూడా వుంటుందని 'జయ-లక్ష్మి', 'కృష్ణ వేణి' నవలలు చెపుతాయి.

సేవాసదనాలలోకి వచ్చిన ఆడవాళ్ళకు కూడా ఏదో ఒక పేరుతో 'భర్తలు'గా వచ్చి కోర్టులో జామీనుకట్టి తమతో తీసుకెళుతుంటారు. అలా తీసుకువెళ్ళిన వాళ్ళను నడిరోడ్డు మీద వదిలేసినవారే చాలామంది. సరస్వతి లాంటి వాళ్ళు రకరకాల పేర్లతో మళ్ళీ మళ్ళీ ఈ సదనాలకు రావడం, వచ్చినపుడల్లా, కొంత మందిని తమకు అనుగుణంగా మార్చేసి తమతోపాటు, మళ్ళీ పాత జీవితాలలోకే తీసుకెళ్ళే ప్రయత్నం చేసన్తూంటారు. ఆసుపత్రిలో ఏదో వంకన చేరి తమకిచ్చే తిండి కూడా అమ్ముకుని డబ్బుచేసుకునే ఆడవాళ్ళని గురించి ఈనవలలో చదువుతూంటే మనసు కలచివేస్తుంది.

ఒకసారి ఆ హోమ్లోకి అప్రయత్నంగా, విధిలేక వచ్చిన వాళ్ళు సమాజం తమని తక్కువగా చూస్తుందేమో అని వ్యధపడడం, కుటుంబ సభ్యులు వీళ్ళ పట్ల తీవ్రంగా స్పందించడం, అంతవరకూ, ఓ పద్ధతిలో నడుస్తూన్న జీవితాలు హఠాత్తుగా అల్లకల్లోలమై పోవడం, భర్త, పిల్లలు దూరమై కన్నీళ్ళను మింగలేక, కక్కలేక మనుషులు చిక్కిశల్యం కావడం ఇవన్నీ ఆర్థికంగా కాకపోయినా, సామాజికంగా హాయిగా జీవితం గడిపే వారెవరికీ అర్థం కాని, అనుభవంలోకి రాని అంశాలు.

అసలిలాంటి కథావస్తువుని తీసుకోవడం ఒకఎత్తు. ఆద్యంతం చదివింపజేయడం హృదయానికి హత్తుకునేలా చెప్పడం మరో ఎత్తు. ఇలాంటి వైవిధ్యమైన కథావస్తువును తీసుకొని, సమర్థవంతంగా సన్నివేశాలు కూర్చడం కూడా కష్టమైన పనే. కానీ మాలతీ చందూర్ ఈ నవల కథా కథనాన్ని చాలా సునాయాసంగా నడిపారు. కొంతవరకు ఆమె సున్నితమైన శైలే ఇందుకు ప్రధాన కారణం కావడం విశేషం.

## నామౌచిత్యం :

ఈ నవలకు 'జయ-లక్ష్మి' అని పేరెందుకు పెట్టాల్సి వచ్చిందో అని చదువుతున్నంత సేపు అన్పించింది. ఒక జయ, ఒక లక్ష్మి అనే కాకుండా సుశీల, కృష్ణవేణిలు కూడా ఇందులో ముఖ్యపాత్రలే. ఆయితే, విజిలెన్స్ హోమ్ గేట్లలోకి వచ్చిన ప్రతి ఆడపిల్లనీ చక్కదిద్దాలనీ, ఆమె వాళ్ళకు ఆర్థిక సుస్థిరత్వం కల్పించాలనే సూపర్నెంటు కృష్ణవేణి తపన. ఆమె ఉద్యోగ నిర్వహణలో జయాప జయాలు పడుగు పేకల్లా కలిసిపోయాయి. ఒక 'లక్ష్మి' ఆమెకి ఆత్మతృప్తినిస్తే, ఒక 'జయ' ఆమెని ఆత్మపరీక్ష చేసుకోమంటుంది". ఈ వాక్యాలు చదివిన తరవాత కొంతవరకు ఈ నవల పేరు అర్థవంతమైందిగానే అన్పిస్తుంది. భాదిత స్త్రీల గురించి తెలిపే అర్థవంతమైన పదాల కంటే, నీచార్థాలను సూచించే పదజాలం తప్ప గౌరవనీయ పదాలు దొరకక ఈ పేరు పెట్టివుంటారని పిస్తుంది.

ఎట్నించి ఎటు కొలిచినా పాపం అక్కడి మహిళల జీవిత కొలమానం కురుచ దృష్టికోణంతో కొలవబడినవే. హోమ్ గేట్ ముందు దిగే స్త్రీలను చూడడానికే, పక్కింటి దగ్గరకి ఓసైకిల్ వాలా వచ్చి సమయానికి హాజరు కావడం, "చిలకలు ఎప్పుడొస్తాయో" అని ఎదురు చూడడం, ప్రతి

చోటా వాళ్ళను చూసి మగవాళ్ళు వెకిలి చేష్టలు చేయడం, ఆ గేటు లోపల అడుగుపెట్టిన ప్రతి స్త్రీ చెడిపోయి వుంటుందనే అపోహ పడడం, వాళ్ళని కేవలం మగవాళ్ళని ఆకర్షించే వాళ్ళుగా మాత్రమే గుర్తించడం, ఇవన్నీ సమాజంలోని వక్రగమనానికి నిదర్శనాలే.

**జీవనోపాధి :**

విజిలెన్సు హోమ్ సూపర్నెంటు వారందర్ని ఇతర దృష్టుల నుంచి మళ్ళించే ప్రయత్నంలో నవార్లు అల్లడం, బుట్టలు, బొమ్మలు తయారు చేయడం, ఫాన్సీ ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలు, బాడ్జీలు తయారు చేయించి హోమ్ అకౌంట్‌లో సగం బాధిత స్త్రీల అకౌంట్లలో సగం జమ చేస్తుంది. విజిలెన్స్ హోమ్ నుంచి బయటికివెళ్ళాక వారికి ఆర్థిక తోడ్పాటు ఈవిధంగా లభ్యమవుతుంది. ఇదంతా వారిలో సత్ప్రవర్తనను పెంపొందించే మార్గమని హోమ్ సూపర్నెంటు కృష్ణవేణి గాఢంగా నమ్ముతుంది. యువతులు పొట్టపోసుకోవడంకోసం వ్యభిచారమే మార్గంగా ఎంచుకోవలసిన అవసరం లేదనీ, సమాజంలో తాము ఇతరుల్లాగా ఏదో ఒక వృత్తిని చేపట్టవచ్చనీ రచయిత్రి చాలా సమర్థవంతంగా ఈ నవలలో చిత్రించారు.

అలాగే ఈ హోమ్లో అనుబంధంగా పనిచేసే 'అన్-మారీడ్ మదర్స్ వింగ్'(అవివాహిత తల్లుల విభాగం) అనాథాశ్రమం గురించి కూడా ఈ నవలలో చిత్రించారు. మాలతీ చందూర్. ఇందులో అన్-మారీడ్ మదర్స్ వింగ్ గురించి చేసిన ఈ కింది వివరణ చూడండి.

"పెళ్ళి కాకుండా తల్లులైన ఈ స్త్రీలకు రక్షణ వుండాలని, పుట్టిన పసిగుడ్డుని అమానుషంగా తల్లి నుంచి వేరు చెయ్యకూడదని అందరూ ఒప్పుకుంటారు. కానీ, పెళ్ళి కాకుండా తల్లులైన అమ్మాయిలని ఎవరూ హర్షించరు. సమాజం బయటికి నెట్టేస్తుంది. ఆఖరికి తల్లిదండ్రులు కూడా ఆ అమ్మాయికి రక్షణ ఇవ్వరు.

**దమన నీతి :**

తప్పు అన్నది స్త్రీ, పురుషులు ఇద్దరూ కలిసే చేస్తారు. కానీ ఆ శిక్షలు మటుకు స్త్రీ - అనుభవించాల్సి వస్తోంది. ఇష్టంవుండో, ఇష్టం లేకనో, మోసగించబడో, కాలుజారో, అమాయకత్వం వల్లనో, అత్యాచారానికి గురయ్యే, పరిస్థితుల వత్తిడి వల్లనో, రాబోయే ఆపదని ఊహించ లేకనో కొందరు నిర్భాగ్యస్త్రీలు తప్పులు చేస్తూంటారు. ఈ తప్పువారి పాలిట శాపం అయి, తల్లితండ్రులు, స్వజనులు, సమాజం ఇలా వీరందరి నుంచీ వెలివేయ బడతారు. వీరికి నిలవ నీడ వుండదు. ఒకోసారి ఉన్నత కుటుంబాల నుంచీ, మధ్యతరగతి నుంచీ అప్పుడప్పుడు కొందరుఅమ్మాయిలు వస్తూంటారు. తండ్రులో, తల్లులో వెంటపెట్టుకొచ్చి, కడుపుతో వున్న తమ అమ్మాయిని ఇక్కడ జేర్చి, పురుడు అయిపోయాక పసిగుడ్డును హోమ్ కు అప్పగించి, ఏమీ జరగనట్లు ఇళ్ళకు వెళ్ళిపోతుంటారు.

అర్థబలం, అంగబలం వున్న తల్లితండ్రులు తమ పిల్లల తప్పులని కప్పిపుచ్చుతుంటారు. అంతే నైపుణ్యంగా, తెగిన దారాన్ని ముడివేసినట్లు ఆ అమ్మాయిని మామూలు జీవితం గడపమంటారు. ఒదిలేసిన పసిపిల్లలని హోమ్ పెంచుకుంటుంది." ఆర్థికబలం, సామాజికహోదా లేని ఆడవాళ్ళ జీవితాల్లో ఇలాంటి సంఘటనలు వాళ్ళ జీవితాల్ని ఎలా మారుస్తాయో, స్త్రీకి, పురుషుడికి వివక్ష ఏస్థాయిలో వుందో మాలతీ చందూర్ వర్ణించిన ఈ వాక్యాలు చదివిన పాఠకులకు అర్థమవుతాయి. అనాథ పిల్లలు ఈ హోమ్ లోనించి బైటికి వచ్చేసరికి లోకం 'పతిత'లుగానే చూస్తుందనే వేదన చదువరుల హృదయాల్ని బాధిస్తుంది.

అనాథలుగా చేరే పిల్లలు ఏఆకర్షణలకు చలించకుండా, నిగ్రహంగా వుండేందుకు వార్ని, వీర్నీ, కలవ నివ్వకుండా విజిలెన్స్ హోమ్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఎన్ని కట్టుదిట్టాలు చేసినా,ఎన్ని సౌకర్యాలు అమర్చినా హోమునుంచి తప్పించుకోవడానికి చూస్తుంటారు.

"వీళ్ళందరికీ తిండానికి తిండి, తలదాచుకోడానికి నీడ, రక్షణ యిచ్చే ఈ హోమ్స్‌లో అన్ని సౌకర్యాలూ వున్నాయి. వేళ ప్రకారం క్రమ శిక్షణతో అన్ని పనులు చెయ్యాలనే నిబంధన తప్ప మరి ఏ ఒత్తిడీ లేని ఈ పిల్లలంతా ఎందుకు పారిపోవాలని చూస్తారు. ఈ

జీవితంలో స్వేచ్ఛలేదని ఎందుకు బాధపడుతుంటారు? వాళ్ళ దృష్టిలో భద్రత అంటే నిర్బంధమని అర్థమా? తాత్కాలికంగా కనిపించే స్వేచ్ఛ కోసం శాశ్వతంగా ఎందుకు తమ రెక్కలు విరుచుకుంటున్నారో అర్థంకాదు. హోమ్ ను పంజరం అనుకొని, గిలగిల్లాడిన వాళ్ళు బయటకు వెళ్ళిన తరువాత అగ్ని పంజరంలో ఇరుక్కునే ఈ అమ్మాయిలను తను మార్చగలదా? అని ప్రతి సారీ జవాబు దొరకక చీకటిలో తడుముకుంటూ వుంటుంది సూపర్నెంటు కృష్ణవేణి.

ఈ నవలలో ముఖ్యపాత్ర సూపర్నెంట్ కృష్ణవేణి. విజిలెన్స్ హోమ్ బాధ్యత అంటే కత్తి మీద సామే. ఆమె కఠినంగా నడచుకున్నా కష్టమే, రూల్స్ సరళతరం చేసినా కష్టమే. తన కంటే ముందు సూపర్నెంటు అత్యంత కఠినంగా నడచుకోవడం వల్ల జైలులాగా తయారైన విజిలెన్స్ హోమ్లో ఆడపిల్లల మనస్సులో మార్పు తేవాలని ఆరాటపడుతుంది హోమ్ సూపార్నెంట్ కృష్ణవేణి. తన జీవితం కంటే హోమ్ లోని ఆడపిల్లల జీవితాలు ముఖ్యమనుకునే ఉదాత్త వ్యక్తిత్వం ఆమెది.

"తన మీద నమ్మకంతో, విశ్వాసంతో చూసే సుశీల, పెళ్ళి చేసుకుని స్థిరపడాలనే కమల, పెళ్ళి లేకుండా తల్లులైన ఆ బాలింతలు వీళ్ళంతా లేకుండా వీళ్ళ బాధ్యతలూ, సమస్యలూ తీర్చకుండా తను నిశ్చింతగా వుండగలదా?" అని ఆలోచిస్తుంది. "వీళ్ళ సమస్యలు ఒకనాటితో తీరవు. ఈరోజు సుశీలైతే రేపు మరో సుగుణ. ఇవి అనంతం. కాలంతోపాటు ఇవీ పెరుగుతుంటాయి." అని భావిస్తుంది కానీ అంతలోనే మానసిక సంఘర్షణకు లోనవుతుంది.

హోమ్లోని స్త్రీల మనస్తత్వాలు ఒక పక్క సమస్యగా మారితే, హోమ్లోని ఉద్యోగులు తెచ్చే సమస్యలు, వాళ్ళ అవినీతిపరత్వం మరోపక్క రెండు వైపులా పదునైన కత్తి మీద సాములా తయారవుతాయి. కృష్ణవేణికి తన పరిధిలో సాధ్యమైనంతవరకు, తన చేతుల్లో వున్నంత మేరా ఆడ పిల్లల జీవితాలు బాగు చేయాలని ప్రయత్నిస్తుంది. సూపర్నెంట్ కృష్ణవేణి జయ విషయంలో ఓడిపోయినా, లక్ష్మి కమలల విషయంలో విజయం సాధిస్తుంది. అయితే ఇదంతా గొప్పగా భావించకుండా 'సమాజం మంచిగా వుంటే తన లాంటి సూపర్నెంటులే వుంటారని' తనకు తాను నచ్చచెప్పుకుంటుంది.

తల్లి తండ్రులు అమ్మాయిల విషయంలో ఎలా ప్రవర్తించాలో ఈ నవలలో మాలతీ చందూర్ ప్రస్థావించారు. అందరు తల్లితండ్రులు లక్ష్మి తల్లితండ్రుల్లా అమ్మాయిల తప్పిదాన్ని క్షమించి - వాళ్ళని కడుపులో పెట్టుకున్నప్పుడు తనలాంటి సూపర్నెంట్ లంతా తనలాగే వుంటారని, మనిషిని పోలిన మనిషీ, సమస్యని పోలిన సమస్యా ఎక్కడా వుండవు. సమాజంలో పతనమైన అమ్మాయిలను, చెడి పోయిన పిల్లలంటూ ప్రత్యేకంగా ఎవరూ వుండరు. మనుషులందరికీ సుఖపడే అవకాశం వున్నట్లే, హోమ్లోని వారికీ పిల్లా పాపల్తో బతికే అర్హత వుందని చెపుతుంది.

అమ్మాయిలంతా కమలలా వుండాలని ఇలా అంటారు రచయిత్రి. "ఆడపిల్లలంతా కమలలాగా పశు ప్రవృత్తిని, మొగవాడిలోని జులుంను ధైర్యంగా ఎదిరించ గలిగితే బాగుంటుంది. అలాగే కమలలాగా అమ్మాయిలందరూ ఆత్మరక్షణ కోసం పోరాడగలిగితే బాగుంటుంది. మొగవాడు చెయ్యి ఎత్తగానే అదిరిపోయే అమ్మాయిలు, నిర్భయంగా ఈ అమ్మాయిలపై అధికారం చెలాయించే పురుషులు ఇవన్నీ స్త్రీ జీవిత వలయంలోని చిక్కులు. ఈ చిక్కుల్నుంచి ఎంతమంది బయటపడ గలుగుతున్నారు? ఎంతమంది నిలబడగలుగుతున్నారు?" అని ప్రశ్నిస్తారు.

కృష్ణవేణి పాత్రను చాలా విశాల హృదయురాలిగా సమర్థవంతమైన సూపర్నెంటుగా తీర్చిదిద్దారు మాలతీ చందూర్. విజిలెన్స్ హోమ్ లాంటి చోట అమ్మాయిల్ని నేరస్థులుగా పరిగణించకుండా, స్నేహంగా వుండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. మానవ నైజంలో సహజమైన ప్రేమకు మాత్రమే లొంగడం అనే భావనను ఈ పాత్ర ద్వారా తెలియజేస్తారు రచయిత్రి.

నవల పేరులోని పాత్రలైన జయ,లక్ష్మిలు ఇద్దరూ రెండు రకాలుగా కృష్ణవేణి ద్వారా సహాయం పొందుతారు. తల్లితండ్రులు చనిపోయి అమ్మమ్మ ద్వారా అక్కడికి

చేరిన జయని హోమ్ పెంచుకుంటుంది. చాలా చలాకీగా అందరితోనూ హాయిగా కలిసిపోయినట్లుండే ఆ అమ్మాయిని మీనాక్షమ్మ అనే ధనవంతురాలు తన ఇంట్లో సహాయకురాలిగా తీసుకెళ్ళి కూతుర్లా చూసుకుంటుంది. కానీ అమెరికాలో ఉద్యోగం చేస్తూ స్వదేశానికి వచ్చిన ఆమె కొడుకు జయని ఇష్టపడడాన్ని సహించలేక పోతుంది. జయ తిరిగి హోమ్ చేరుకున్నా, మనసు పరిపరి విధాలుగా చెదిరిపోతుంది. తనిట్లా హోమ్లో వుండబట్టే తనకిదంతా జరిగిందని హోమ్ జీవితం పట్ల అసహనాన్ని పెంచుకుంటుంది. ఆ జీవితం నుంచి బయటపడే ప్రయత్నంలో కృష్ణవేణితో చెప్పకుండా పెళ్ళికూడా చేసుకుంటుంది. చివరికి అక్కడకూడా మోసపోయి తిరిగి హోమ్ కే చేరుకుంటుంది. కానీ జయ మనసును అర్థంచేసుకొని, అవకాశమిస్తానన్న మీనాక్షమ్మ ఉత్తరం చదివి, అందుకు తానిక అర్హురాలు కాదను కుంటుంది. తెలీని వ్యథతో ఆత్మహత్య చేసుకుంటుంది.

జయ విషయంలో సూపర్నెంటు కృష్ణవేణి ఎంతో స్వేచ్ఛనిచ్చి చాలా నమ్మకంతో పెంచుతుంది. అవన్నీ ఒక్కసారిగా కల్లలైపోయి, జయ ప్రవర్తనపట్ల బాధ పడుతుంది. తనలో తాను ఇలా పునరాలోచించు కుంటుంది. జయ 'పెళ్ళి' విషయంలో మేట్రన్తో అన్న మాటల్ని ఇక్కడ గమనించవచ్చు.

'ఏం, పెళ్ళి కాకపోతే ఆడది బతకలేదా? చదువుకుని మంచి ఉద్యోగం చేసుకుంటుంటే కళ్ళకద్దుకుని పెళ్ళిచేసుకుంటారు. మన హోమ్లో అందరాఫీసర్లకీ పెళ్ళయిందా? " అంటుంది. కానీ మళ్ళీ "జయని మంచి కుటుంబంలో కోడలు చెయ్యకపోతే నాపేరుకు మారు పేరు పెట్టు" అని సవాల్ విసురుతుంది.

తన పెంపకం పైన గల నమ్మకంతో ధీమాగా పెంచిన అమ్మాయి తన చేతుల్లోంచి దాటిపోయి జీవితాన్ని చేతులారా నాశనం చేసుకోవటం భరించలేక పోతుంది కృష్ణవేణి. ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలలోని వైరుధ్యాన్ని, అసమతౌల్యతను గమనించగలుగుతాం.

లక్ష్మిఅనే అమ్మాయి సినిమాల్లో వేషం కోసమని పారిపోయి పట్నానికి వచ్చేసి ఆగంతకుల చేతుల్లోపడి, మురికి కూపంలోకి అడుగుపెడుతుంది. జయతో ఎదురైన అనుభవం వల్ల కృష్ణవేణికి లక్ష్మిని నమ్మడానికి కొంత సమయం పడుతుంది. కానీ మారాలనే తపన, పరివర్తన పట్ల సంకల్పం, మానసిక స్థైర్యం బలంగా వున్న వాళ్ళకి తన సహాయం తప్పనిసరి అని గ్రహించి లక్ష్మికి సాయ పడుతుంది. లక్ష్మి ఆరోగ్యం చక్కబరచి, తల్లితండ్రుల్ని పిలిపించి వాళ్ళకు అప్పగిస్తుంది. తను అలా ఒక అమ్మాయికి జీవితాన్ని సరిదిద్దుకొనే అవకాశం తన ఉద్యోగ జీవితంలో దొరికిన గొప్ప సంతృప్తిగా సూపర్నెంట్ కృష్ణవేణి భావిస్తుంది.

**సమాజ వక్రదృష్టి :**

అమాయకంగా ఉచ్చుల్లో చిక్కుకునే పిల్లలు, హోమ్లో చేరి అన్యాయంగా 'పతిత'లుగా ముద్రపడే ఆడపిల్లల జీవిత సంఘర్షణలు గుండె చాటున ఎక్కడో తీవ్రమైన వ్యధ మెదులుతుంది. తాము అలవాటు పడిపోయిన జీవితం రంగుల జీవితంగా అభివర్ణించి హోమ్లో మిగతా అమ్మాయిలందర్నీ దుర్గంధంలోకి లాగాలని చూసే సరస్వతి లాంటి అమ్మాయిలు కూడా హోమ్ కు వస్తుంటారు. ఏదో ఓ పేరుతో ఆసుపత్రిలో చేరి వాళ్ళు ఇచ్చే గుడ్లు మొదలైనవి అమ్ముకోమని సలహాలిచ్చే ఆరోగ్యం లాంటి స్త్రీలు, హోమ్ నించి పారిపోవడానికి మార్గ దర్శకత్వం వహించే కళావతి మొదలైన వాళ్ళ పట్ల కూడా ఎక్కడా ఏహ్యాభావం కలగ కుండా వాళ్ళనలా తయారుచేసిన సామాజిక వ్యవస్థ పట్ల అవగాహన కలిగిలే రచయిత్రి జాగ్రత్తగా రచించారు. మాలతీ చందూర్ ఇలాంటి స్త్రీల విషయంలో సాధించాల్సిన సాధికారత గురించి అనునిత్యం తపన పడే కృష్ణవేణి పాత్రను సృజించడం ద్వారా రచయిత్రి ఆలోచనల్లోని మహిళా అభ్యుదయ భావాలను అర్థంచేసుకో గలుగుతాం. డబ్బుకోసం తన రక్తాన్ని కూడా ఆరోగ్యం పాత్ర అమ్ము కోవటంలోని విషాదం గ్రహించగలుగుతాం. అలాంటి పరిస్థితుల్లో ఇరుక్కున్న వారి పట్ల జాలి, సానుభూతి కలుగుతాయి. మనుషులు డబ్బు చుట్టూ తిరగడం తప్ప మానవ సంబంధాలకు అవకాశంలేని స్థితి. వ్యాపార విలువలతో ప్రారంభమైన నవలారంభం వ్యాపార

విలువల విస్తరణ యొక్క విశ్వరూపాన్ని మాలతీచందూర్ నవలలో దర్శించగలం.

**మాతృత్వ భావన :**

సుశీల ఈ నవలలో మరోముఖ్యమైన పాత్ర. సాధారణ గృహిణి జీవితం నుంచి హఠాత్తుగా ఆమె జీవితం వలలో పడ్డ చేపలా గిలగిల్లాడి పోతుంది. సుశీల లాంటి స్త్రీల విషయంలో చట్టాలు కూడా కఠినంగా వ్యవహరిస్తాయని ఈ వాక్యాలు చూస్తే అన్పిస్తుంది "ఒక వేళ తల్లి తప్పు చేస్తే నోరులేని ఆ పిల్లలేం చేశారు? తల్లిని పిల్లల నుంచి వేరుచేసే హక్కు వీళ్ళకెవరిచ్చారు? ఈ చట్టమన్నది ఎంత కఠినమైనదో - స్త్రీల రక్షణ కోసం చేయబడిన చట్టాలు ఒక్కోసారి స్త్రీల పట్ల గొడ్డలి పెట్టు అవుతాయి." అన్న వాక్యాలలోని లోతు అర్థమై పాఠకుల హృదయాలు ఆర్ద్రమవుతాయి. తల్లీబిడ్డల్ని వేరుచేసే హక్కు ఏ చట్టానికి లేదని అలాంటి పరిస్థితుల్లో ఇరుక్కున్న వారి పట్ల జాలి, సానుభూతి కలుగుతాయి. మాలతీ చందూర్ రచనల్లోని పాత్రలు వేసిన ప్రశ్నలు ఈనాటికి చట్టబద్ధతను పొందిన వాస్తవరూపం మనం చూడగలుగుతున్నాం. ఇంతకంటే నవలా సాహిత్య ప్రయోజనం లేదనిపిస్తుంది.

ఏదో ఉపాధి కోసం వెళ్ళిన ఆమె అనుకోకుండా తన తప్పు లేకుండా కొందరు మగవాళ్ళ వల్ల, పోలీసుల అవినీతి వల్ల హెూమ్‌లోకి వచ్చిపడుతుంది. దాంతో ఆమె జీవితం తలక్రిందులౌతుంది. తల్లిదండ్రులకు ఆమె పట్ల ప్రేమ వున్నా చూపించలేని పరిస్థితికి వస్తారు. తను నిరంతరం కలవరించే తన ఇద్దరు పిల్లలను హెూమ్ కు తెచ్చి చూపిస్తే, ఆ భర్త పిల్లల్ని వదిలేసి వెళ్ళిపోతాడనే భావంతో వాళ్ళలా ప్రవర్తిస్తారు. నిజానికా సదరు భర్త జీతం అంతా అతని దురలవాట్లకి ఖర్చుపెట్టుకుంటూ ఇంట్లో భార్యా, పిల్లల తిండి విషయం కూడా పట్టించుకోడు. పెళ్ళైన కొత్తల్లో కాస్త బాగానే వుండేవాడు. తర్వాత మారిపోయాడు.

భర్త అన్నామలై రాత్రి పన్నెండూ, ఒంటిగంటకు ఇంటికొచ్చేవాడు. ఆలస్యంగా ఎందుకొచ్చావని సుశీల దెబ్బలాడితే, ఎదురు తిరిగేవాడు. సుశీల భర్త గురించి రచయిత్రి మాటల్లో చెప్పాలంటే, "మొగవాళ్ళు కాబట్టి వాళ్ళు బయటికి పారి పోవచ్చు. సినిమాలు చూస్తూ ఇంట్లో దారిద్ర్యాన్ని మర్చిపోవచ్చు. కాని ఆడదానికి అలా కుదరదే! ఆకలి అని ఏడ్చే పసిదానికి నెత్తురు అమ్మి అయినా అన్నం పెట్టాలి. ఇంట్లోవున్న సామాను అమ్మి పిల్లల్ని పోషించాలి" అని సుశీల పాత్ర ద్వారా వ్యాఖ్యానిస్తుంది.

"భగవంతుడా - మాకు విముకి లేదా? మేము ఎలా బతకడం" అంటూ సుశీల ఆక్రోశించడంలో మగవాళ్ళు ఎంత పలాయనవాదులో పై వాక్యాలు చూస్తే అర్థమవుతుంది. సాధారణంగా కుటుంబ జీవితంలో కూరుకుపోయి బయట సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల గురించి తెలియని సగటు మధ్యతరగతి స్త్రీలకు ఈ నవల ఒక కనువిప్పు.

హెూమ్ నుంచి వెంటనే బయటపడే మార్గమూ వుండక, తిండి తినకుండా తన పిల్లల్నే తల్చుకుంటూ కృశించి పోతూంటుంది సుశీల. హెూం సూపర్నెంట్ కృష్ణవేణి ఆమె కష్టాల్ని తీర్చలేకపోయినా తాత్కాలిక ఉపశమనం కలిగే విధంగా మాట్లాడి, ఆమెని తిరిగి మామూలు మనిషిని చేయగలుగుతుంది. సుశీలకు కొంతైనా సాంత్వన చేకూర్చగలుగుతుంది. సుశీల పాత్ర సాధించిన సంయమనంతోనే ఈనవల ముగియటం విశేషం.

"మొగవాడిలాగా తల్లి తన పిల్లల బాధ్యతని విస్మరించలేదు" - ఈ విషయం సుశీల జీవితం చూస్తే బాగా అర్థమవుతుంది. హెూమ్ నిర్వహణలో కృష్ణవేణి కృతకృత్యురాలైందనడానికి తార్కాణం అటెండర్ వేలాయుధం కూతురు కమల. వేలాయుధం భార్యే స్వయంగా తన కూతుర్ని తెచ్చి హెూమ్లో వదిలి వెళ్ళడం, తండ్రి దగ్గర కంటే, హెూమ్లోనే రక్షణగా వుంటుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చడం, మూడో పెళ్ళైన వాడిని పెళ్ళి చేసుకోవడం కంటే, హెూమ్లో వుండడమే మేలనుకునే కమల నిర్ణయం, తండ్రి గురించి భయపడకపోవడం చూసిన కృష్ణవేణి అవివాహితులైన ఆడపిల్లలకు కమల ఆదర్శం కావాలనుకుంటుంది.

ధనవంతురాలైన మీనాక్షమ్మ హెూమ్‌లో నించి

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

జయని సహాయానికి తెచ్చుకుని బాగానే ఆదరిస్తుంది. కానీ ఆ పిల్లకూ మనసు వుంటుందని మర్చిపోతుంది. సేవ చేయించుకునేప్పుడు కురిపించిన ప్రేమ తన కొడుకుతో పెళ్ళి అనుకునే సరికి జయపట్ల అలసత్వం చూపిస్తుంది. అనాథల్ని దూరంగానే వుంచాలని సహజంగా, ధనంతో వచ్చిన అహంకారంతో ఆమెని దూరంగా విసిరేస్తుంది. చివరకు మళ్ళీ కష్టాలు వచ్చి పడగానే, సహాయానికి మనిషి కావలసి వచ్చినపుడు ఆమే స్వయంగా జయని వెతుక్కుంటూ వస్తుంది. జయ జీవితం అస్తవ్యస్తం కావడానికి పూర్తిగా కాకపోయినా మీనాక్షమ్మ కూడా ఒకవిధంగా కారణమవుతుంది.

### పురుష పాత్రల అప్రాధాన్యత :

ఈ నవలలో పురుష పాత్రలు చాలా చిన్న పాత్రలు - హోమ్‌లోని స్త్రీల జీవితాలతో ముడిపడిన వాళ్ళు కొందరైతే, హోమ్లో పనిచేసే సిబ్బంది మరికొందరు. నిజంగా మగవాళ్ళ నైజాలెలా వుంటాయో, ఏ సందర్భాల్లో ఎలా ప్రతిస్పందిస్తారో రచయిత్రి బాగా చెప్పగలిగారు. ఇందులో కొందరు కాయగూరల మార్కెటుకు వెళ్ళినా కమీషను కొట్టేయడం, పాలపాకెట్లు బయటికి సరఫరా చేసేయడం, అమ్మాయిలు పారిపోయేందుకు సహాయం చేయడం లాంటి సంఘటనలు కూడా ఒక సవాలుగా ఎదురవుతుంటాయి.

మీనాక్షమ్మ కొడుకు మోహన్రావు తాను అమెరికా వెళ్ళి వచ్చినా, అహంకారం లేకుండా ఇంట్లో సాయానికి వచ్చిన అనాథ పిల్ల జయని ప్రేమిస్తాడు. తల్లికెదురు చెప్పలేని నిస్సహాయుడుగా వుండిపోతాడు. చివరకు అమెరికన్ని పెళ్ళి చేసుకుంటాడు. ఆమె చచ్చిపోతే, పిచ్చివాడుగా మారతాడు. ఈ నవలల్లోని పురుష పాత్రల దౌర్భల్యాన్ని ఈనవలలో చూడగలం.

వేలాయుధం హోమ్ ప్రభావంతో ఆడవాళ్ళు బయటికెళ్తే చెడిపోతారనే భావనను పెంచుకుని తన కూతురు పైనే ఆ నియంత్రణలన్నీ చూపిస్తాడు. అదే సమయంలో నిజాయితీగా వుండే షణ్ముగం కూడా అదే హోమ్‌లోనే మరో అటెండర్‌గా ఉద్యోగంలో వుంటాడు. అతన్ని ఎందరు మార్చాలని చూసినా హోమ్ కోసం నీతిగా పని చేస్తూంటాడు. ఇక సుశీల భర్త అన్నామలై భార్య కన్పించకపోతే 'ఎవడితోనో లేచిపోయింద'ని రగడ చేస్తాడు. తిరిగి వెనువెంటనే మరో అమ్మాయిని పెళ్ళాడాలని చూసుకుంటూంటాడు.

సుశీల తండ్రి కఠినంగా మాట్లాడినా అతని హృదయం బాధతో కొట్టుకుంటుంది. "పైకి రాయిలా కన్పించే ప్రతి హృదయంలో సుతిమెత్తని భాగం ఏమూలనో దాక్కుని వుంటుంది. ముసలాడిని తప్పుపట్టి ప్రయోజనం లేదు. అతను తన పరిస్థితులకి బానిస"

సమాజమే వ్యక్తుల్ని ఇలా మార్చిందని అనే స్పృహ పాఠకులకు కలుగుతుంది. ఈ నవల చదువుతున్నంత సేపు. మనం అనాదిగా కొన్ని చట్రాలలో ఇమిడిపోయి వున్నాం. స్త్రీలు ఇలా వుండాలి, పురుషులు ఇలా వుండాలి అని వాటికేమాత్రం విఘాతం కలిగినా సమాజం వెంటనే స్పందిస్తుంది. అడుగడుగునా స్త్రీల పట్ల వివక్ష ఎంత దారుణంగా వుంటుందో కళ్ళకి కట్టినట్లు ఈనవలలో రచయిత్రి చిత్రించారు.

### ద్వంద్వనీతి :

హోమ్‌లో అడుగుపెట్టిన ప్రతి అమ్మాయి జీవితమ్మీద సమాజం దృష్టిలో 'పతిత'గా ముద్రపడిపోతుందనే విషయాన్ని ఎలా మార్చాలా అని సూపర్నెంట్ కృష్ణవేణి పడే తపనలో పాఠకులు కూడా పాలు పంచుకుంటారు. ఆమె ఆశించిన ప్రయోజనం కోసం నిరంతరం ప్రయత్నించాలని పాఠకులకు అనిపించడంలో ఆశ్చర్యపడక్కర లేదు.

ఈ నవలలోని కొన్ని వాక్యాలు మనల్ని చాలాసేపు ఆలోచింపచేస్తాయి. "అమ్మాయిలకి వయసూ, నగలూ రెండూ శత్రువులు. ఈ విషయం చాలా మంది తల్లి తండ్రులు గ్రహించుకోలేరు." అని మలతీ చందూర్ అంటారు. మర్యాదకీ, శీలానికీ అతీతమైన బాంధవ్యం - రక్తపాశం మనుషుల్ని బాధిస్తూ వుంటుంది.

### వంటింటి చిట్కాలు :

హోమ్ లోని మరో అమ్మాయి ఆరోగ్యానికి సంబంధించిన ఈ వాక్యం చూడండి "బత్తాయి కాయల్ని

BHAVAVEENA
Vol. 22, Issue. 04, April 2025

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

వేణీళ్ళలో ముంచి రసం తీసి ఆపైన కాసిని వేడినీళ్ళు కలిపి ఇస్తే ఆయాసం రాదు" అని రచయిత్రి సూచిస్తారు. ప్రమదావనం శీర్షిక లేకుండా ఇలాంటి చాలా వంటింటి చిట్కాలు చాలా ఇస్తుంటారు. అలా ఇవ్వడంవల్ల స్త్రీల పని వత్తిడి తగ్గించగలుగుతానని ఒకానొక సంధర్భంలో వివరణ ఇచ్చారు మాలతీచందూర్.

పుస్తకం మూసేక బరువైన హృదయం కాలాన్ని నిలదీసి అడుగుతుంది, ఏమిటీ సమాజం ఇంతేనా స్త్రీల జీవితాలు అన్న బాధ కలుగుతుంది. ఈ నవల 1976లో రాసిందైనా ఈనాటికీ స్త్రీల జీవితాల్లో మార్పు రాలేదు. దాదాపుగా యాభై ఐదు సంవత్సరాల కాలంలో ఏ పరిస్థితిలోనూ ఇంకా మార్పు రాలేదు. ఈ మధ్యే రాసిన నవలలాగానే వుంటుంది. ఇన్నేళ్ళ తరువాత కూడా ఈ పుస్తకం చదివితే ఎంతో ఆశ్చర్యంగా, చాలా బాధగా అన్పిస్తుంది ఎవరికైనా.

స్త్రీల జీవితాలు, ముఖ్యంగా మధ్యతరగతి స్త్రీల జీవితాల్లో మార్పు ఎప్పుడొస్తుంది? ఎలా వస్తుంది? ఒకే తప్పు స్త్రీ, పురుషులిద్దరూ కలిసి చేసినదైనా స్త్రీనే అవమానించే, నిందించే సంస్కృతి ఎప్పటికి మారుతుంది అనే ప్రశ్న కృష్ణవేణి చాలా పర్యాయాలు ఈ ప్రశ్నలవల్ల సమాజంలో అమలవుతున్న వివక్షల పట్ల రచయిత్రికి గల అసంతృప్తిని కృష్ణవేణి నిరసనల ద్వారా తన వ్యతిరేకథను తెలియ జేసింది. నిజానికి ఆహోమ్ కు చేరే ఆడవాళ్ళం దరూ తప్పు చేసారని చెప్తున్న ''తప్పు'' అనబడేది వాళ్ళొక్కళ్ళే చేసినది కాదు. ఎవరో మగవాళ్ళ ప్రమేయం తప్పకుండా, ఖచ్చితంగా వుంటుంది. కానీ ఎవరు దాన్ని నిర్భయంగా ఒప్పుకుంటారు? సెక్సుపరంగా ఎక్కువ మంది స్త్రీలతో సంబంధాలు కలిగి వుండడం మగవాడికి గొప్పతనమనీ, స్త్రీ పొరపాటున ఒకరికంటే ఎక్కువని భరించాల్సివస్తే 'పతిత' అనీ, చెడిపోయిందనీ అనడం రివాజై పోయింది.

"కేవలం స్త్రీలకే ఇన్ని ఆంక్షలెందుకుండాలి? ఉంటే ఇద్దరికీ వుండాలి. లేకపోతే ఇద్దరికీ ఉండకూడదు" అని ఎవరైనా ఆలోచిస్తారా ఎప్పటికైనా? అని స్త్రీలు పడే వేదనలకు గల మూలకారణాలను స్పృశించేలాగా ఈనవల రచించడంలో భాదిత స్త్రీల సమస్యల పట్ల మాలతీ చందూర్‌కు గల నిశిత దృష్టికి పై వాక్యాలే నిదర్శనం.

స్త్రీగా పుట్టినందుకు ఎన్ని అవహేళనలు భరించాల్సి వుంటుందో ఈ నవల చదివితే మగవాళ్ళకూ అర్థమవు తుంది. ''ఏం చేస్తాం? పరిస్థితులకి ప్రతి ఒక్కరూ బానిసలే." అని ఊరుకోకుండా కనీసం చదువుకున్న మగవాళ్ళయినా ఆలోచించడం ప్రారంభిస్తేనే మార్పు ప్రారంభమైనట్లుగా గుర్తించవచ్చు.

ఈ నవలలో చెప్పినట్లు "వీళ్ళ సమస్యలు ఒక్కనాటితో తీరవు. ఇవి అనంతం. కాలంతోపాటు ఇవీ పెరుగు తుంటాయన్నది అక్షరాలా సత్యం. స్వాతంత్రానంతరం కొన్ని సమస్యలు పూర్తిగా కాకపోయినా, పాక్షికంగానైనా పరిష్కారమార్గంలో వెళుతున్నాయి. కానీ మారిన సమాజంలో సమస్యల స్వరూపం కూడా చాలామార్పులు వచ్చి కొత్త రూపాన్ని తీసుకుంటున్నాయి.

నేటికీ మన సమాజంలో సుశీలలు, కమలలు ఎందు కుంటారు? ఆ...కాలం మారిపోయింది. స్త్రీలు విద్యాధికు లవుతున్నారు, ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు, ధైర్యంగా మాట్లాడగలుగుతున్నారు, పరిస్థితులను ఎదిరించి చక్క బెట్టుకోగలుగుతున్నారని కొందరు వాదించవచ్చు. కానీ ఇది ఒక పార్శ్వం మాత్రమే. చదువుకునీ, డబ్బు సంపాదించీ భర్త చాటు భార్యగా బతికే వాళ్ళు, నిరంతరం ఇంటా బయటా పోరాడాల్సిన వాళ్ళు అత్యధికంగా మనకి కనపడుతూనే వున్నారు. సమాజపరంగా ఏ స్త్రీ జీవితంలోనూ సంపూర్ణత్వం రాలేదనే అన్పిస్తూంటుందింకా. ఏదో ఒక రూపంలో సమాజం రెండవ తరగతి పౌరురాలిగా స్త్రీలను భావించినా స్త్రీలు తాము కూడా అలాగే భావించినా, తమ సాటి స్త్రీలను అలానే గుర్తించినంత కాలం స్త్రీల ఆలోచనల్లో మార్పు రానంతకాలం ఇదే భావజాలం చర్విత చరణ మవుతుంది. స్త్రీలపై జరిగే, అత్యాచారాలు కానీ, అవమానాలు కానీ, వివక్షలు కానీ పురుషాధిపత్యసమాజ భావజాలకారణం మాత్రమే గుర్తించడం జరుగుతుంది. ఈ వివక్షలు ఏమాత్రం తగ్గకపోవడం అందుకు సంబంధించిన కారణాల్లో కొన్ని మాత్రమే.

విజిలెన్స్ హోమ్ గురించి ఇంత విపులంగా, నిశితంగా వచ్చిన నవల తెలుగు సాహిత్యంలో మరోటి లేదు. స్త్రీలు మాత్రమే స్త్రీల హృదయాల్ని ప్రతిభావంతంగా ఆవిష్కరించగలరనేది ఈ నవల చదివేక బాగా అర్థమవుతుంది.

**ముగింపు :**

జీవితం ఒక తెగని సంకెల. ఎట్నుంచి ఎటు వెదికినా కఠినమయ్యే బంధాలు, తెంచుకోలేని ప్రేమావేశాలు, కన్నీళ్ళు పరిష్కారం కావని తెల్సినా ఆపుకోలేని బలహీనతలు. వ్యక్తులు కలిస్తేనే సమాజం. స్త్రీలను సమస్యల వైపు నెడటాయి అయినా వైయక్తికం కంటే సమాజం గొప్పది. మనం కన్నీళ్ళు వృధా చేసేకంటే. మరొకరి కన్నీళ్ళు తుడవడంలో ఎంతో ఆనందం వుంటుందనే కృష్ణవేణి దృక్పథమే మాలతీ చందూర్ సాహిత్య దృక్పథం.

'కృష్ణవేణి', 'జయలక్ష్మి' నవలలు చదివిన తరువాత నిరాశ్రయులైన స్త్రీల కోసం నడిపే మహిళా పునరావాస కేంద్రాలు, మహిళల సంరక్షణశాలలు, ప్రభుత్వ సేవా సదనాల ఆవశ్యకతను పాఠకులు గుర్తిస్తారు. బాధిత మహిళల పట్ల సరైన దృష్టికోణాన్ని అలవరుచుకోగలరన్న విశ్వాసం పెంపొందుతుంది. అన్యాయాలకు, అత్యాచారాలకు గురైన స్త్రీల చుట్టూ ఒక భద్రతా వలయం వుంది. అది మనల్ని కాపాడి సంరక్షించిస్తుందన్న భావం కలుగుతుంది. ఈభావన వాళ్ళ జీవితాలకు భరోసానిస్తుంది. ఒకవిధంగా వాళ్ళ జీవితాలను సరిదిద్దుకునే శిక్షణాలయాలుగా గుర్తింప చేయాలన్న తపన కనబడుతుంది. మాలతీ చందూర్ విజిలెన్స్ హోమ్స్ విషయంలో చేసిన ప్రయత్నం 'జయ-లక్ష్మి' నవలలో విజయవంతమైంది.

**ఆధార గ్రంధాలు :**

1. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం డాక్టర్ పి సంజీవమ్మ,, అభ్యుదయ రచయితల సంఘం కడప.
2. తెలుగు కథలు కథన రీతులు, సంకలనం మధురాంతకం రాజారాం సింగమనేని నారాయణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్.
3. స్త్రీవాద తాత్వికత వోల్గా సాహిత్యం డాక్టర్ కే శ్రీదేవి సంహిత పబ్లికేషన్స్ హైదరాబాద్.
4. నవలా శిల్పం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్.
5. సంవిధానం, గుడిపాటి,పాలపిట్ట బుక్స్,హైదరాబాద్.
6. తెలుగు పసిడి, సంపాదకులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ విక్టరీ పబ్లిషర్స్ విజయవాడ.
7. నారి సారించి, శిలా లోలిత సాహిత్య వ్యాసాలు, మాధ్యమం ప్రచురణ హైదరాబాద్.
8. జయ-లక్ష్మి మాలతీ చందూర్,క్వాలిటీ పబ్లికేషన్స్, విజయవాడ .
9. కృష్ణవేణి,మాలతి చందూర్, క్వాలిటీ పబ్లికేషన్స్ విజయవాడ.

★★★

# సి.నా.రె కవిత - మానవత

- సిరిపురం కౌశిశ్రీ, వి.అధ్యాపకురాలు, రేకుర్తి, కరీంనగర్.

తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ పురస్కారాన్ని పొంది కవితా జగత్తులో మానవతా దృక్పథానికి మనోజ్ఞరూపాన్ని దిద్దుతున్న శిల్పి సి.నా.రె. ఉత్తర, దక్షిణ ధ్రువాల్లా ఉండే సంప్రదాయం, ప్రయోగాలు ఆయనలో ఒక్కటిగా కలిసి పార్వతీ పరమేశ్వరుల్లా సమన్వయంతో దర్శన మిస్తాయి. మనిషిలోని మమతను, బాధను, విప్లవాన్నీ తన కవితలో కీర్తించడం ఈయన మతం. తెలుగు సాహితీ చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని పొందింది.

సుదీర్ఘ సాహితీ జీవితం సి.నా.రె. సొంతం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ రచనా జీవితంలో సి.నా.రె. అక్షరసృష్టి అనితరసాధ్యం అన్నట్టుగా సాగింది. మనిషిని మహోన్నతంగా నిలిపే మానవత్వం గల సమర్థుడైన సమగ్రకవి. మానవతను ధరించిన అభ్యుదయవాది. కవితాశిల్ప శాస్త్రంలోను, ప్రపంచ సాహిత్యాలలోనూ, లలితకళల్లోనూ లోతుపాతులు తెలిసిన నిరంతర చైతన్య శీలి. జాతి, మత, కుల భాషాప్రాంతీయ దురభిమానా లకు దూరంగా ఉంటూ, నిష్కలుషిత విశ్వమానవతను మహోన్నతంగా నిలిపిన అభ్యుదయవాది. అతడు ఎంత గొప్పకవో, అంత గొప్ప విమర్శకుడు. వచన కవిత్వంలో మేరు పర్వతం లాంటి సినారె అదే ప్రక్రియను శ్వాసగా, ధ్యాసగా అనేక వచన కవితా రచనలను రచించి భాషను, భావాన్ని రెండింటిని నవ్యంచేసి వచన కవితకు స్థిరత్వాన్ని కల్పించారు. శ్లిష్టా, కుందుర్తి మొదలైనవారితో ప్రారంభ మైన వచన కవితా వికాసానికి జవజీవాలు కల్పించి వచన కవిత్వానికి కొత్త భాషను, చూపును అందించిన వాడు సి.నా.రె. వచన రచనలు సుదూర తీరాలకు పయనించి అందరిమెప్పును పొందాయి.

ఆధునికాంధ్ర సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో అజరామరమైన వచన కవితా రూపశిల్పంతో, అసాధారణమైన విమర్శనా దృష్టితో, విశ్వమానవ హృదయాంత రాళల్లోని, చైతన్య జలపాతాళ సవ్వడితో, సంప్రదాయం నుండి ప్రయోగాలకు ప్రస్థానం సాగించిన అత్యాధునిక కవి సి.నా.రె. మానవత్వాన్వేషణలో మానవతా దృక్పథానికి మనోజ్ఞరూపాన్ని దిద్దుతున్న అక్షర శిల్పి సి.నా.రె.

నేటి అంతర్జాతీయ కళా ప్రపంచంలో అతి నవీన సంవిధాన వాదాలైన పదచిత్రవాదమూ, ప్రతీకవాదమూ, అభివ్యక్తివాదము వంటి సకల ధోరణులనూ చక్కగా ఆకళింపుకున్నాడు. ఆధునిక యూరోపియన్, అమెరికన్ కవితా వాహినిలో క్షుణ్ణంగా జలకాలాడేడు. తెలుగు సాహిత్యంలో మహాకవి సినారె ప్రవేశమొక జాజ్వల్య మానమైన నూత్న శకాన్ని ఆవిష్కరించింది. ఆయన కావ్య ద్రష్టత్వం మానవీయ భవిష్యత్తును, గమ్యాన్ని ఎప్పుడు స్పృశిస్తుందో అప్పుడంతా ఒక ఉదాత్త గంభీర స్వరంలో దాన్ని ఆవిష్కరిస్తుంది. సినారె కవిత్వంలో వస్తువుల ఆత్మల్ని వెతికి పట్టుకొని ఆవిష్కరించే దార్శనిక తత్త్వం మనకు గోచరిస్తుంది. ముఖ్యంగా ముక్కు సూటిగా వుండే కవిత్వంలో కూడా సౌందర్యజ్వాల నిక్షిప్తమై వుండాలన్నది ఆయన వాదం. ఆధునిక తెలుగు కవిత్వంలో అనేక ప్రక్రియలను వెలయించిన నిరంతర సారస్వతమూర్తి డా॥సి.నారాయణరెడ్డి, అభ్యుదయ దృక్పథం నింపుకున్న మానవత్వం, ప్రయోగశీలత సినారె కవితా విహంగానికి రెండు పక్షాలు. వాటిలో ఆయన ఎన్నో ఉన్నత కవితా శిఖరాలను అవలీలగా అధిరోహించారు.

కవిత్వాన్ని ఒక తపస్సుగా భావించే కవి డా॥సి.నారా యణరెడ్డి గారు. నిత్య వ్యవహారంలో ప్రతిపాదిత అర్థాన్ని మించిపోకుండా, కవిత్వాన్ని వాడుక భాషగా మలచుకొన్న కవి'వరేణ్యు'లు డా॥సినారె. గేయ కావ్యాలు వ్రాసినా, వచన కవిత్వం వెలువరించినా, ప్రపంచపదులను పదిలపరచినా, గజళ్ళను గళమెత్తి పాడినా కవిత్వం నడిచి వస్తున్నట్లనిపిస్తుంది.

ఆ కవిని చూస్తే, ఒక జ్ఞాపకం ప్రవహిస్తున్నట్లు, బద్ధకం ఒళ్ళు విరుచుకొన్నట్లు, సింహం మందగతిలో ముందుకు సాగినట్లు, పిల్లతెమ్మెర వీచినట్లు, సీతాకోకచిలుక రెక్కలు సవరించుకున్నట్లు అనిపిస్తుంది, ఆ కవి మాట్లాడుతుంటే. కాలం కాని కాలంలో వసంతం వచ్చినట్లు, కోయిలపాట

సుదూరంగా వినిపిస్తుంది ఆ కవి వాక్కులో. కవులు చాలామందే ఉంటారు. కాని కవిత్వాన్ని శ్వాసించేవారు, జీవితాన్నే కవిత్వంగా మలచుకొన్నవారు కవిత్వం చెప్పకపోతే ఊపిరాడనివారు ఒక్కరే ఉన్నారు - ఆయనే డా॥సి.నారాయణరెడ్డి.

ఆధునిక కవితాస్వరూపం సర్వదా నేడు వచన కవిత్వం అని పిలవబడుతుంది. కాని దురదృష్టవశాత్తు ఈ పదం అపార్థాలకు తావిస్తోంది. ప్రతీ అపక్వవచన రచనా కవిత్వమే అనుకొనే భ్రమకలిగిస్తోంది. ఫ్రీవెర్స్ అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా హిందీ సాహిత్యంలో ముక్తచ్ఛంద కవిత అని పిలుస్తున్నారు. ఇది అంతస్సత్వాన్ని వెల్లడించే చక్కని పదమే. స్వచ్ఛంద కవిత అనినప్పటికి పరవాలేదు. ఫ్రీవెర్స్ అనే ఆంగ్లపదం వెర్స్‌లిబర్ అనే ఫ్రెంచి పదానికి సమానార్థకంగా రూపొందింది. ఈ పదాలు రెండూ వస్తుతత్త్వాన్నిద్యోతకం చేస్తున్నాయి. వెర్స్ నిర్మాణంలో స్వేచ్ఛను ప్రతిపాదించడమే వీటి లక్ష్యం. కాని వచన కవిత అనే పదం సిద్ధపరిచినట్లు కవిత్వానికే సంపూర్ణ స్వేచ్ఛనిచ్చి వదిలివేయడమనే దురర్థం సంభవించదు. కవితను గుణబద్ధంగా కాక గుణబద్ధ స్వరూపంలో తీర్చిదిద్దడమనే దీనిభావం కవితాభివ్యక్తికి నూతనావకాశాల అన్వేషణలోనే ఈ ప్రయోగం ప్రాదుర్భవించింది.

సినారె నూటికి నూరుపాళ్ళ కవి కవిత్వ రహస్యం తెలిపిన కవిత్వ నిర్మాణశిల్పి. కులాలకు, మతాలకు, వర్గాలకు వాదాలకు అతీతమైంది కవిత్వం కరుణతోనే కవి అవుతాడు.

లోకంలో ఉన్న మానవ జీవితాన్ని అనేక విషయాల్లో మునిగి తేలుతాడు. కవి అయినా అది చాలదు. శాస్త్రజ్ఞానం లోకంలో అంతర్గతంగా ఉన్న దానిని చూడడానికి కావలసిన జ్ఞానాన్నిస్తుంది. శాస్త్రజ్ఞానంచేత అంతర్గత విషయాల్ని తెలుసుకుని అతడు సాధారణ స్థాయినుంచి ఉన్నత స్థాయికి చేరుకుంటాడు. అపుడు అతడు మాట్లాడేమాట కూడా వ్యవహరిక భాషలో ఉన్నట్లు ఉండదు. ఉదహరణకి పండువెన్నెల అనేది నిత్య వ్యవహారంలో ఉన్నమాట.

విశిష్ట వ్యక్తి కవి ఆ పండు వెన్నెలలోకి వెళ్ళేసరికి అతనికి ఒక విచిత్రానుభూతి కలుగుతుంది. అపుడతను ఏదో చెప్పడానికి తన విచిత్రాను భూతిని రెండోవాడితో పంచుకోవాడానికి ప్రయత్నిస్తాడు. ఇది స్వభావసిద్ధం అపుడు ఆ రెండవవాడికి తన అనుభూతిని అందజేయ డానికి తన నోట్లోంచి రాలిన వాక్యాలేమిటో అవి కవిత్వం ఈ పండు వెన్నెలను అనుభవించిన ఆ వ్యక్తి రాత్రి నగ్నంగా వెన్నెట్లో స్నానం చేస్తోంది అంటాడు. ఇది వ్యావహరిక భాష కాదు. విశిష్ట భాష ఈ విశిష్ట భాషనే కవిత్వం అంటారు. కళా రంగంలో విప్లవాన్ని తీసుకువచ్చి ప్రళయాన్ని సృష్టించిన చిత్రకళా పద్ధతి క్యూబిజమ్, నేడు వున్న అన్ని రకాల 'ఇజాల'కు మూలం ఇదే. వస్తువులను, ప్రకృతిని, గోళాకార, స్తంభాకార ఆకారాలలో చిత్రించే పద్ధతినే క్యూజిజమ్ అంటారు.

క్యూబిజమ్‌ని తెలుగులో ఘనవాదం, కఠినవాదం, యదార్థవాదం అనవచ్చు ఎందుకంటే చిత్రాలలో 'ఘనము'నకు లేదా క్యూబుకు వస్తువులోని యదార్థస్థితికి ప్రాధాన్యత ఎక్కువ అలాగే సాహిత్యంలోనూ యదార్థాలకు, కఠినత లేదా క్లిష్టతకు ప్రాధాన్యత ఎక్కువ. ప్రకృతి యందలి వివిధ రూపములను సంక్షేపించి స్వచ్ఛా రూపాలను సృష్టించి కల్పన లోనరించి చిత్రకళా విధానం క్యూబిజమ్. సినారె ఏ ఒక్క వాదానికో కట్టుబడకపోయినా, ఆయన ఏ వాదాన్ని తన కవితలో కావాలని రాయకపోయినా, అన్ని వాదాలూ ఆయన కవితలో గోచరిస్తాయి.

సినారె తను మనిషినన్న విషయాన్ని గ్రహించి, తన సభ్యతా సంస్కార అభ్యాసాలతో మనిషిగా రూపొంది - మనిషిని అన్ని కోణాలలోను పరిశీలించి, దర్శించి, పరిశోధించి 'మానవ ప్రకృతిని యధాతథంగా చిత్రించడమే కవిత్వ ధర్మమని. భావించి - తన కావ్యంలో మనిషికి ప్రథమ స్థానమిచ్చాడు. మనిషిని కవిగా మార్చే మౌలికశక్తే తాత్త్విక చింతన. ఆ తాత్త్వికతతొనే మనుషుల్ని పరిపాలిస్తాడు కవి. సి.నా.రె. తత్త్వాన్వేషి, కని కాబట్టి యిలా చెబుతున్నాడు.

'కవి ప్రజాసామాన్యానికి తత్త్వదర్శి' అని ప్లూటార్కు, కావ్యంలో తత్త్వం ముందు కవిత్వం తరువాత అని బ్రౌనింగ్ మహాతాత్త్వికుడు కాని వాడెవ్వడు మహాకవి అనిపించుకోడని కోలెరిడ్జి 'కవులే జనరంజకులైన తత్త్వవేత్తలని' సిడ్నీ ప్రభృతులు తాత్త్వికుడైన వాడే కవి అని స్పష్టం చేశారు. జీవితాన్ని ఇన్ని రకాలుగా అనుభ

వించాడు కాబట్టే సినారె ఉత్తమ కవిత్వాన్ని సాధించ గలిగాడు. మాథ్యూ ఆర్నాల్డ్ మానవ జీవన వ్యాఖ్యానమే కవిత్వ మంటాడు.

'భోజుడు (లేక అగ్నిపురాకణర్త) కవిత్వం జీవితానికి రూపాంతరం అంటాడు. జీవితాన్ని ప్రతి మనిషి అనేక కోణాల్లో అనుభవిస్తూనే ఉంటాడు. ఆ అనుభవం ఎప్పుడైతే అసంతృప్తి ఆవేదనలతో కూడుకొన్నదవుతుందో అప్పుడు దేవుడ్ని ఆశ్రయించటం సహజంగా జరిగే విషయం కనుకనే గుడిలో చేరిన మనుషులు జీవితం చెక్కిన శిల్పాలంటాడు కవి. శిల్పాలు సజీవమూర్తులా గోచరిస్తాయి కాని స్పందన వుండదు వాటిలో, అలాగే గుడికి చేరే మనుషులు అటువంటివారే వీరికి ప్రాణంవున్నా లేనివారికిందే లెక్క అంటే జీవచ్ఛవాలన్న మాట. 'మనుషులు జీవచ్ఛవాల్లా జీవించటానికి అనేక సమస్యలు కారణం. సమస్యలకి మూలమైన రాజకీయ వాతావరణాన్ని ఇలా విశ్లేషిస్తాడు.

మనిషి- 1. రాజకీయ మృగం, 2.పవిత్ర జీవి, 3. సాంఘిక జీవి, 4.నవ్వగలిగిన. ఏడ్వగలిన జంతువు అని పాశ్చాత్యులు మనిషిని నిర్వచిస్తే - సినారె 'మనిషి కన్నీళ్లు కార్చే జంతువంటాడు.

సినారె ప్రతిభవున్న కవి మానవ జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకున్న కవి కనుకనే ఇలా చెబుతాడు. స్వేచ్ఛగల మనిషి మాత్రమే పరిపూర్ణ మానవుడిగా గుర్తింపబడతాడని, స్వేచ్ఛ లేని వాడు సగం మనిషని చెబుతాడు థామ్సన్.

సినారె తాత్త్విక చింతన సత్యాన్వేషణ అపూర్వం. 'మానవ మేథస్సు నుండి వెలువడే బలీయమైన భావ వ్యక్తీకరణయే కవిత్వం. అని అంటాడు వాట్స్‌డాన్‌టన్.

1905లో ఐన్‌స్టిన్ భౌతిక శాస్త్రంలో కనిపెట్టిన సాపేక్ష సిద్ధాంత ప్రభావం క్యూబిజంపై పడింది. ఐన్‌స్టిన్ Theory of Relativity కనిపెట్టిన రెండు సంవత్సరాలకు పికాసొ క్యూబిజం పద్ధతిలో చిత్రం వేశాడు. సాపేక్ష సిద్ధాంతానికి క్యూబిజానికి చాలా పోలికలున్నాయి. ఒక వస్తువును చూచే దృక్పథాలు ఎన్ని వుంటే అన్ని రకాలుగా కనిపిస్తుందనే అభిప్రాయం విజ్ఞాన శాస్త్రంలోనూ చూపించారు క్యూబిజంలోని బమ్మలలోనూ చూపించారు.

ప్రకృతి యందలి వివిధ రూపములను సంక్షేపించి. స్వచ్ఛ రూపములను (Pure forms) సృష్టించి కల్పన లోనరించు చిత్ర కళా విధానం క్యూబిజమ్.

ఇంప్రెషనిజం తర్వాత ఫ్రెంచి కళారంగంలో శిరసెత్తిన ఉద్యమం క్యూబిజం దీనికి పికాసో నాయకుడు. నీగ్రో కళా ప్రభావంతో వెలువడిన ఉద్యమమిది. దృశ్య ప్రపంచమును జబఎవం (కోణాకృతులు) గా విడదీసి చిత్రించుట ఈ ఉద్యమం లక్ష్యం ఈ తెగ చిత్రకారులకు వర్ణ సమ్మేళనంపై, రేఖా విన్యాసంపై శ్రద్ధ ఉండదు. ప్రకృతి లోని అపురూపమైన అంశాలను చిత్రించుటలో వీరికి ఆనక్తివెుండు. వెుదట Geometrical forms (రేఖాకృతుల)తో ప్రారంభమైన క్యూబిక్ చిత్రకళలో క్రమంగా Pictorial Lyricism (చిత్ర రూపంలో మౌన సంగీతం) మార్మికత పొడసూపినవి స్పష్టతకు దూరమై, భావ వైవిద్యం కోల్పోయినను ఈ చిత్రకళ వాద్య సంగీతంవలె హృదయ స్పందకమైనది ప్రథమ ప్రపంచ యుద్ధంతో ఇది ఆగిపోయింది యుద్ధానంతరం ఈ కళారీతిలోని అంతస్సారం సర్రియలిజంలో లీనమై పోయింది.

సినారె కవిత్వంలో 'సర్రియలిజం'ను గూర్చి పరిశీలించే ముందు సర్రియలిజం యొక్క స్వరూప స్వభావాలను తెలుసుకోవటం అవసరం. సర్రియలిజం అనే పదం ఫ్రెంచిలో ఒక సర్రియలిస్టు నాటకం వచ్చాక ఏర్పడింది. సర్రియలిజం అనే పదానికి తెలుగులో అధి వాస్తవికత, అతి వాస్తవికత, అప్రయత్న రచన అనేవి పర్యాయపదాలు. పారిస్‌లో 1918 తర్వాత అంటే వెుదటి ప్రపంచ యుద్ధానంతరం తలెత్తిన సాహిత్య ఉద్యమం యిది. ఈ ఉద్యమ నాయకుడు అంద్రేబ్రెటన్. నియమాలు, నిబంధనలు, ప్రమాణాలు అన్నింటినీ కాలదన్నటం, వ్యక్తీకరణ అతినవ్యంగా ఉండటం, కలల్లోని వాస్తవాన్ని గుర్తించటం, చిత్రవిచిత్ర వస్తుజాలాన్ని అప్రయత్నంగా ప్రయోగించటం అధి వాస్తవికతా లక్ష్యాలు.

బాహ్య స్వరూపానికి ప్రాధాన్యత నిచ్చి విస్తారంగా వర్ణించే పద్ధతి ఏదైతే వుందో దానిని సహజ పద్ధతని (Realism), మనోమయ ప్రపంచంలో బాహ్య రూపం వల్ల కలిగే అలజడిని చిత్రించే పద్ధతి ఏదైతే వుందో దాన్ని అసహజ పద్ధతి అని (Sur-realism) - అంటే అధి వాస్తవికతని అంటారు. అంటే వాస్తవికత సహజ సిద్ధమైన ప్రకృతతి లాంటిది. దానికి వికృతే అధి వాస్తవికత అంటే

కన్పించే దాన్ని వదలి ఊహా జగత్తులో తిరగవద్దనటమే వాస్తవికత పాదం, దానిని వ్యతిరేకించేదే అధి వాస్తవికతా వాదం. ఈ అధి వాస్తవికతలో వ్యక్తావ్యక్తంలో అంటే స్వప్నావస్థలో గుప్తంగా పడివున్న అనుభూతుల్ని కాగితం మీద వెదజల్లటం. అసంబద్ధ భావాలకు రూపమివ్వటం జరుగుతుంది.

తెలుగులో అధివాస్తవిక కవితకు ప్రయోక్త శ్రీశ్రీ ప్రవక్త శ్రీ శ్రీరంగం నారాయణబాబు వీరిద్దరే ముఖ్యంగా ఆధునికాంధ్ర కవులలో అధివాస్తవిక కవులుగా కనిపిస్తారు.

సినారె కవితలో ఆధివాస్తవికత: ఆధునిక కవులలో ఏ ఇజమ్ లలోనూ 'ఇంప్రిజన్' ఆ పని కవులు ఇద్దరే కనిపిస్తారు వారిలో ఒకరు కీ.శే.దేవరకొండ బాలగంగాధర తిలక్ మరొకరు శ్రీ సినారె. మరి అటువంటప్పుడే సినారె కవితలో అధివాస్తవికతని గూర్చి ఎందుకు తెలపటం అని ప్రశ్నించవచ్చు. సినారె ఏ ఒక్క వాదానికో కట్టుబడక పోయినా, ఆయన ఏ వాదాన్ని తన కవితలో కావాలని రాయకపోయినా, అన్ని వాదాలూ, ఆయన కవితలో గోచరిస్తాయి.

సి.నా.రె. రచనలు ఏది చూసిన నిలువెల్లా కవిత్వంమే అన్నట్లు ఉంటాయి. ఆయన రచనల్నింటిలోనూ ముఖ్యంగా 'విశ్వంభర', 'మట్టి మనిషి ఆకాశం'లలో ఆయన చమత్కారికలు ఎంతోమందిని ఆకట్టుకున్నాయి. అంతేకాదు తెలుగు వచన సాహితీరంగంలో అని ఎంతో ప్రసిద్ధి పొందాయి. వాటిలో క్లుప్తత, మెరుపు, సామాజిక స్పృహ మొదలైనవి ప్రత్యేకలు ఉంటాయి. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే 1974 తర్వాత వచ్చిన వచన రచనలపై సి.నా.రె ముద్ర బలంగా వుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

యుగకవి సినారె మానసిక వాతావరణంలోని గొంతు ఉరుముల నుంచి పారిశ్రామిక వాతావరణంలోని రైలు చరిత్రల నుంచి తీసుకున్న ఉదాహరణల్లో సాహిత్యం సృష్టించటం వాస్తవికతకు ప్రతిబింబమనటం అతిశయోక్తి కాదు చూడండి.

మానవత్వంలో ఉన్న పరిమళాన్ని పైకితీసి పంచిఇచ్చే గంధవహుడు ఈయన. నిజంగా 'ఇజా'లకి అందని ప్రజాకవి. ఈయనలో 'ఇజం' ఏమన్నా ఉన్నదంటే అది హ్యూమనిజం. ఇది నిజం. విప్లవకన్య అందంగా వుండ కూడదని ఎక్కడాలేదు. ఈ దృష్టి 'సరికొత్త సత్యం' అనే శీర్షికలో బాగా కనబడుతుంది.

'సత్యమంటే నగ్నమైందని / తాండవ నృత్యంకంటే ఉద్విగ్నమైందని / ఇన్నాళ్లూ అనుకొనేవాణ్ణి./ ఇప్పుడు తెలిసింది /సత్యానికీ అందముందని /చట్రాయిలోనూ హృదయస్పందనముందని'.రెండూ కనబడతాయి.

'బ్రతుకంటే నిప్పులు కక్కడమూ కాదు
కన్నీళ్ళు కనుగుడ్లలో కుక్కడమూ కాదు.
జుట్టు పీక్కోవడమూ కాదు
చుట్టచుట్టుకుని పడుకోవడమూ కాదు.
బ్రతుకంటే ఉద్దీప్త చైతన్యం
జలవిద్యుత్తుతో దాని బాంధవ్యం.
బ్రతుకంటే వర్షామేఘం

బీళ్లతో ఏళ్ళతో దాని అనుబంధం'. ఇది నారాయణ రెడ్డి గారి విశిష్టత. జీవితాన్నిచూచి భయపడి పారి పోవడమూ లేదు. ప్రపంచాన్ని ద్వేషంతో ఎదుర్కోవడమూ లేదు. ఈయన కవిత్వంలో కనబడే తాత్త్విక సందేశం ఇదే. 'చీకటిబోనులో చిక్కు వడిపోయిన వేకువకు కట్టు విప్పుతూ'నే, 'మాపును చీలుస్తూ రేపును పిలుస్తూ'నే, 'అగ్నిపర్వతం అంచుమీద ఆనందం వెతుకుతున్నాడు'. ఇక్కడ గవేషణా ముఖ్యమే! గమ్యస్థలమూ ముఖ్యమే! గమించే మార్గమూ ముఖ్యమే !

**ఆధార గ్రంథాలు:**

1. కుందుర్తి వచన కవిత, జి.వెంకటేశ్వర్లు, హైదరాబాద్.
2. ద్వానాశాస్త్రి, 1. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2004.
3. ఆర్.ఎన్.సుదర్శనం, సాహిత్య నేపథ్యం, శ్రీ రత్నా ప్రింటర్స్, రాజమండ్రి, 1989.
4. ఆర్వీయార్, సాహిత్య తత్తం, విశాలాంధ్ర పబ్లికేషన్ హైదరాబాదు, 1988.
5. సి.నా.రె. జీవన రేఖలు, ప్రత్యేకవ్యాసం, డా॥తిరుమల శ్రీనివాసాచార్య.
6.శ్రీమిరియాల రామకృష్ణ-శ్రీశ్రీ కవితా స్వరూపం.

★

# Cultural Resistance and Resilience: Exploring the Empowerment of Dalit Women in Literature

*- Chettupalli Anvesh*

**Abstract**

